# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

01-11-2024 సంపుటి -2 (దీపావళి) సంచిక-9 రూ.25/-





సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# సుమతి 'సాహితీ సామ్రాట్' పోటీలు నవంబర్ - 2024 ఫలితాలు

## ఈ నెల ఉత్తమ కథలు :

### మొదటి బహుమతి రూ1000 /-

1.స్వాభిమానం — సి .ఎస్ .జి .కృష్ణమాచార్యులు

2.పాపక్షయం — నంద త్రినాధ రావు

(బహుమతి ఇద్దరికీ సమానంగా పంచబడును

### రెండవ బహుమతి రూ500/-

1.అపుత్రస్య గతిర్నాస్తి — ఎం .వీరేశ్వరరావు

2 .జగతి సిగలో జాబిలమ్మ — యు .మధుపాత్ర శైలజ

(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### కన్సొలేషన్ బహుమతి పొందిన కథలు :

1 .మూడో చీర — పి .అజయకుమార్

2. ఆ ముప్పై ఆరు గంటలు — వాడపల్లి పూర్ణకమేస్వరి

3. నీతోనే నా జీవితం — యశోదా కైలాష్

4. అమావాస్య చంద్రుడు — డా.ఎం .సుగుణారావు

(బహుమతి లేకపోయినా పోటికి పరిగణించబడును )

### సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథలు :

1.హరివిల్లును తాకిన ఆ క్షణం — ఎం .కారుణ్యకుమార్

2. వెల్డన్ షబ్బీర్ — నాగార్జున శర్మ

3. కాపలా — రాధా హిమబిందు

4.దేవుడున్నాడు — పి. మంగారత్నం

## ఈ నెల ఉత్తమ కవితలు:

### మొదటి బహుమతి రూ500 /-

1. ఓ స్త్రీ ,ఓ అక్షరం ,ఓ మానవత్వం — ఎం.కారుణ్యకుమార్

2.నాకు నానకు మధ్య — శింగిరాజు శ్రీనివాసరావు

(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### రెండవ బహుమతి రూ250/-

1.ఎనకటి రోజులు — తాటి హరీష్

2.పదవి — కె .విజయకుమార్

(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును)

### కన్సొలేషన్ బహుమతి

1.నాతో ఒక్కసారి మాట్లాడు — జె .శంకరరావు

2. కొత్త జ్యోతుల వెలుగు కోసం — ఎన్ .లహరి

(బహుమతి లేకపోయినా పోటికి పరిగణించబడును)

### సాధారణ ప్రచురణకు ఎన్నికైనవి :

1.ఆహ్వానించు -ఆస్వాదించు — ఏ .నాగేశ్వరరావు

2. ప్రేమలేఖ — ఎం .వీరేశ్వరరావు

3. అమ్మ@నా లైఫ్ గురు — బి .కళాగోపాల్



# సుమతి

## (సమగ్ర సకుటుంబ మాసపత్రిక)

## తెలుగు సాహితీ జగత్తులో

## అనతి కాలంలోనే ధ్రువతారగా సుమతి ని నిలిపినందుకు

## ధన్యవాదాలు తెలుపుతూ

## సుమతిలో ప్రకటనలు ఇవ్వండి

- ఎడిటోరియల్ బోర్డ్

అనతి కాలంలోనే అశేష పాఠకలోకానికి చేరువైన

సుమతి సకుటంబ మాసపత్రికలో ప్రకటనలు ఇవ్వండి

కవర్ పేజి కలర్ :రూ.5000/-

కవర్ పేజి బ్లాక్ అండ్ వైట్ :రూ. 3000/-

లోపలి పేజీల్లో కలర్ :రూ2000 /-

లోపలి పేజీల్లో బ్లాక్ అండ్ వైట్ :రూ.1000 /-

ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు

మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని మీ ముందుకు ప్రతి నెల ఒకటవ తారికునే వస్తుంది.

ఇప్పుడు సుమతి పత్రికను ఆన్లైన్లో కూడా చదవ వచ్చు



# సుమతి

మాసపత్రిక

సంపుటి :2 సంచిక:8

అక్టోబర్ 2024

సంపాదకురాలు
అవుతు శ్రీవిద్య

సహ సంపాదకురాలు
జి .జ్ఞానిక

ముఖచిత్రం
మోక్ష

గ్రాఫిక్స్
జ్ఞానిక

చందా వివరాలు

సంవత్సర చందా రూ 250

ఐదేళ్ళ చందా రూ 1200

ప్రకటనలు , చందాలకు మరియు

రచనలు ,అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా

SUMATHI.POTILU@GMAIL.COM

ప్రచురణ
సుమతి పబ్లికేషన్స్
(RC NO.:538/2006)

హౌస్ నం :26 -46 -79

వేణుగోపాల నగర్ ,గుంటూరు

ఆంధ్రప్రదేశ్


## సంపాదకీయం

మౌలికంగా మనిషులు ఆనందాన్ని కోరుకుంటారు. అయితే శాశ్వత ఆనందం శారీరక, భౌతిక విషయాల నుంచి రాదు. కానీ ఈ ఆధునిక కాలంలో ఈ సత్యాన్ని గమనించడంలో మనం నిర్లక్ష్యం వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఆనందం కోసం బయట వెతుకుతున్నారు. కానీ నిజానికి అది ఉన్నది మనలోనే! ఒత్తిడి ఎక్కువగా పోటీతత్త్వం నుంచి వస్తుంది. అది ఆరోగ్యకరంగా ఉంటే నష్టమేమీ ఉండదు. కానీ చాలాసార్లు అది అసూయ, ద్వేషాల మధ్య కాలిపోతోంది. ఎదుటి వారిని తనలో భాగమనుకునే భావన తగ్గిపోతుంది. ఇలాంటి ఆలోచన మనుషుల సంతోషాన్ని హరించివేస్తోంది.కాబట్టి మనకు మనమే పోటి అనుకోవాలి తప్ప ఇతరులు ఎప్పుడు పోటి అనుకోరాదు

సుమతి

## సుమతి – సుభాషితాలు

బాధ్యత లేని యవ్వనం,జ్ఞాపకాలు లేని వృద్ధాప్యం

ఉప్పు లేని వంట అనవవసరం

# ఈ నెల సాహితి సుమాలు...

## ఫీచర్స్ అందరి కోసం

6 ముఖచిత్ర కథ
9 ఈ నెల కవిత
10 నడుస్తున్న చరిత్ర
18 అంతర్నేత్రం
20 ఈ శీర్షిక మీదే
31 మేర భారత్ మహాన్
60 జీవన చిత్రాలు
66 వైరల్
67 నాలుగో కోతి
71 సెటైర్
74 కార్టూన్స్ పేజి
75 యాత్ర
78 విహారి
81 కార్టూన్స్ పేజి
95 నమ్మకాలూ –నిజాలు
97 కరెంట్ అఫైర్స్
100 అవగాహన
105 ఫోటోగ్రఫి పాఠాలు
109 యువతా తెలుసుకో
111 భేతాళ భారతం
113 మన కథానాయకులు

116 కార్టూన్స్ పేజి
117 వార్తల్లో వ్యక్తి
124 చదవాల్సిన పుస్తకం
128 చూడాల్సిన సినిమా
131 క్రాస్ రోడ్స్ కబుర్లు
152 మన పురాణాలు
156 సప్తపది
170 ధర్మసందేహాలు
172 సృజన
173 పిల్లలు పిడుగులు
174 రాశి ఫలాలు

## సీరియల్స్

21 పంచవటి( కామెడి సీరియల్ )
40 మమతల తరంగాలు (ఫ్యామిలీ సీరియల్ )
45 యమపాశం (క్రైం సీరియల్ )
54 రాణ ప్రతాప్ (చరిత్రాత్మక సీరియల్ )
62 గర్భ శ్లోకం (క్రైం సీరియల్)
120 డెత్ మెసేజ్ (క్రైం సీరియల్ )
158 నయన ( సీరియల్ )

## కథలు

26 స్వాభిమానం
33 పాపక్షయం
37 అపుత్రస్య గతిర్నాస్తి
82 జగతి సిగలో జాబిలమ్మ
86 మూడో చీర
90 ఆ ముప్పె ఆరు గంటలు
134 నీతోనే జీవితం
138 అమావాస్య చంద్రుడు
143 ఉ అంటావా ఉహు అంటావా
149 సిగినాధం సినిమాకథ
164 ఆకలే అన్ని నేర్పిస్తుంది

## కవితలు

25 మనిషి కంపు కొడుతున్నాడు
59 ఓ స్త్రీ ఓ అక్షరం ఓ మానవత్వం ..
70 నాన్నకు నాకు మధ్య
80 ఎనకటి రోజులు
148 పదవి
157 నాతో ఒక్కసారి మాట్లాడు

★★★

## ముఖచిత్ర కథ

# దీపావళి

దీపావళి.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ. ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి.. నూతన వెలుగులు తీసుకొచ్చే గొప్ప పండుగ. హిందువులతో పాటు జైనులు, బౌద్ధులు, సిక్కులు, ఇతర మతస్తులు ఆరోగ్యం, సంతోషాన్ని కోరుకుంటూ సెలబ్రేట్ చేసుకునే పర్వదినమే దీపావళి ఆశ్వయుజ బహుళ అమావాస్య రోజు ఈ పండుగను జరుపుకుంటారు . రామాయణంలోనూ దీపావళి ప్రస్తావన ఉంది. పురాణ కథనం ప్రకారం.. భూదేవి, వరహా స్వామికి అసుర సమయంలో జన్మించిన నరకాసురుడు.. శ్రీహరి చేతిలో చావులేని విధంగా తల్లి చేతిలోనే మరణించేలా వరం పొందుతాడు. వరగర్వంతో లోకకంటకుడిగా తయారైన నరకుడు ముల్లోకాలను పట్టిపీడించాడు. నరకాసురుడి బాధలు భరించలేని దేవతలు, మునులు, గంధర్వులు శ్రీహరికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి మొర ఆలకించిన శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో కృష్ణుడిగా అవతరించి సత్యభామతో నరకాసురుని సంహరింపజేశాడు. నరకాసుర సంహారంతో అందరూ ఆనందంగా పండుగ చేసుకున్నారు. చతుర్దశి నాడు నరకుడి మరణించగా, ఆ తర్వాత రోజు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. దీపావళి అంటే దీపాల వరుస అన్ని అర్థం. కొన్ని ప్రాంతాల్లో దీపావళిని ఐదు రోజుల పండుగగా జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ప్రారంభమైన దీపావళి వేడుకలు.. కార్తీక శుద్ధ విదియ 'భగినీహస్త భోజనం''తో ముగుస్తుంది.



ఆశ్వయుజ బహుళ త్రయోదశినే ధన త్రయోదశిగా జరుపుకుంటారు. ఇంటిని శుభ్రం చేసి, పాత సామాన్లను శుభ్రం చేస్తారు. కొత్తగా కొనుగోలు చేసిన వెండి, బంగారు ఆభరణాలు ఈ రోజున పూజలో పెడితే ధనలక్ష్మి అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుందని విశ్వసిస్తారు. అందుకే ధనలక్ష్మీ, కుబేరులను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. బంగారం, వెండి కాకుండా ధన త్రయోదశి రోజు ఏ వస్తువు కొనుగోలు చేసి శుభం జరుగుతుందంటారు. అమృతం కోసం దేవతలు క్షీరసాగరాన్ని మథించినప్పుడు ధన త్రయోదశి రోజునే లక్ష్మీ దేవి ఉద్భవించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకే ఈ రోజున తనను పూజించిన వారికి లక్ష్మీదేవి అనుగ్రహిస్తుంది. ఏ వస్తువు ఇంటికి తెచ్చినా అది అమృతభాండం అవుతుందని చాలా మంది నమ్ముతారు. ఆరోగ్యానికి, ఔషధాలకి అధిపతి అయిన ధన్వంతరి జయంతి కూడా ఈ రోజే. ఆరోగ్యమే మహాభాగ్యం.. అలాంటి మహాభాగ్యానికి అవసరమైన ఔషధకర్త ధన్వంతరి. ఆయన కూడా క్షీరసాగర మథనంలో లక్ష్మీ దేవి, కామధేనువు, కల్పవృక్షం, ఐరావతం లాంటి దివ్యశక్తులతోపాటు ధన్వంతరి ఆవిర్భవించాడు. ఒక చేతిలో అమృత భాండం, మరొక చేతిలో ఆయుర్వేద గ్రంథంతో పాల సముద్రం నుంచి తరలివచ్చాడు. అందుకే ఆరోగ్యం కోసం, అనారోగ్యాల నుంచి శీఘ్ర ఉపశమనం కలగడానికి ఈ రోజు ధన్వంతరిని కూడా పూజిస్తారు. ధన్వంతరి కూడా శ్రీమన్నారాయణుని అంశ అని.. ఆయనను పూజిస్తే లక్ష్మీదేవి సంతోషించి అనుగ్రహిస్తుందని అంటారు. అందుకే ఆయుర్వేద వైద్యులు చికిత్స ప్రారంభించేటప్పుడు ధన్వంతరిని స్మరించుకుంటారు. ధన త్రయోదశి ఆరోగ్యాన్ని, మహాభాగ్యాన్ని కూడా ఇస్తుంది.

ఆశ్వయుజ అమావాస్య రోజునే దీపావళి పండగ. ఈ సమయంలో ఇంటిని శుభ్రం చేసి, రకరకాల పిండి



వంటలు తయారు చేస్తారు. సంధ్యా సమయంలో గోగు కర్రలకు గుడ్డ పీలికలతో కాగడాలు కట్టి, వెలిగించి, గుమ్మాల్లో నేల మీద కొడుతూ... 'దిబ్బి దిబ్బి దీపావళి, మళ్ళీ వచ్చే నాగులచవితి, పుట్ట మీద జొన్నకర్ర, పుటుక్కు దెబ్బ! అని పాడతారు. గోగు కర్రల్ని ఎవరూ తొక్కని చోటవేసి, వెనక్కి తిరిగి చూడకుండా కాళ్లు కడుక్కుని లోపలికి వెళ్లి శుభానికి మిఠాయి తింటారు. ఇలా చేస్తే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని నమ్మకం. తర్వాత ఇంటిని దీపాలతో అలంకరిస్తారు. మట్టి ప్రమిదలు, నువ్వుల నూనె వాడటం మంచిది. లక్ష్మీదేవికి ఇష్టమైన నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తే అమ్మ అనుగ్రహం లభిస్తుంది. గుమ్మం, తులసి దగ్గర మాత్రం తప్పనిసరిగా మట్టి ప్రమిదలో నువ్వుల నూనె లేదా ఆవు నేతితో దీపాలు వెలిగించాలి. ప్రదోష సమయంలోనే లక్ష్మి దేవి పూజ చేస్తారు. ధనలక్ష్మి పూజ ఈ రోజు చేస్తే ధన ధాన్యాలు, అష్టైశ్వర్యాలు సంప్రాప్తిస్తాయి. దీపావళి రోజున లక్ష్మీపూజతో తమ వ్యాపారం వృద్ధి చెందుతుందని వ్యాపారులు నమ్ముతారు. కొత్త బంగారు, వెండి ఆభరణాలు పూజలో పెడితే శుభప్రదం.
దీపావళి మర్నాడు బలిపాడ్యమి. చతుర్దశి నాడు విష్ణుమూర్తి వామనుడి రూపంలో పాతాళానికి అణిచేసిన బలిచక్రవర్తి మళ్లీ భూమ్మీదకి తిరిగివచ్చిన రోజు ఇదేనని చెబుతారు. బలికి పూజలు చేస్తారు. నందగోపాలుడు గోవర్ధన గిరినెత్తి రేపల్లె వాసులను కాపాడిన రోజూ ఇదే.

పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ ఎంతో ఇష్టంగా జరుపుకునే పండుగ దీపావళి. ఏటా దీపావళి రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొత్త కాకపోయినా... వాటి గురించి మరోసారి తెలుసుకుంటే మరిచిపోయిన అంశాలు గుర్తుకువస్తాయి. దీంతో దీపావళి ఆనందాన్ని ఏమాత్రం కోల్పోకాకుండా, సురక్షితంగా జరుపుకోవడమే మన లక్ష్యం కావాలి. టపాసులు కాల్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే విషాదం బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. నిపుణులు కొందరు సూచించినట్టు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

1. పేలకుండా మధ్యలో ఆగిపోయిన టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయరాదు. అదిపైకి మండకపోయినా లోపల ఉండిపోతే దాన్ని చేతిలోకి తీసుకోగానే పేలిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి వాటికి దూరంగా ఉండండి. ముందు జాగ్రత్తగా అలాంటివాటిపై నీటిని చల్లి తడపండి.
2. బాణాసంచా ఎప్పుడూ ఇంట్లో కాల్చేందుకు ప్రయత్నించవద్దు. బహిరంగ ప్రదేశాల్లోనే వాటిని పేల్చండి.
3. జేబుల్లో టపాసులు పెట్టుకుని తిరగడం చాలా ప్రమాదకరం.
4. మంటలు అంటుకునే అవకాశం గల ప్రాంతాలకు దూరంగా బాణాసంచాను పేల్చాలి. భవనాలు, చెట్లు, ఎండుగడ్డి లాంటి చోట టపాసులు పేల్చడం వల్ల అగ్ని ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువ.
5. కాల్చిన బాణాసంచా సామాగ్రిని ఇసుక పోసి ఓ ప్లాస్టిక్ బకెట్‌తో కప్పి ఉంచండి. దీనివల్ల ఆ దారిలో వేళ్లేవారికి హాని కలుగకుండా ఉంటుంది.
6.టపాసులు కాల్చేసమయంలో ముందు జాగ్రత్తగా బక్కెట్‌తో నీటిని సిద్ధంగా ఉంచుకోండి.
7.బాణాసంచా కాల్చేటప్పుడు చేతులను టపాసుకు దూరంగా ఉంచి జాగ్రత్తగా అంటించాలి. అలాగే టపాసుకు ముఖాన్ని దూరంగా ఉంచడం మర్చిపోవద్దు.
8.నిప్పు అంటుకుని గాయమైన శరీర భాగంపై నుంచి వస్త్రాలు తొలగించండి. గాయాలపై చల్లని నీటిని పోయాలి.

# సాహితి భోజులకు ఆహ్వానం

## సాహితి భోజులకు... మహారాజ పోషకులకు ఇదే మా ఆహ్వానం . మీరు తెలుగు భాషా ప్రేమికులా..?సాహితీ ప్రియులా ..? తెలుగు సాహిత్యాన్ని బతికించుకోవాలని మీలో బలమైన కోరిక ఉందా ..?ఐతే సుమతికి అండగా నిలవండి

మహామహులు సాహితీ పత్రికలు నడపడం మావల్ల కాదు అని చేతులెత్తేసిన నేపథ్యంలో పురుడు పోసుకున్న సుమతి సకుటుంబ మాస పత్రికకు మీరు అందించే తోడ్పాటు కొండంత బలాన్ని ఇస్తుంది. మానసిక ఉల్లాసంతో పాటు, ఆలోచన రేకెత్తించే కథలు, కవితలు సీరియల్స్ అదే విధంగా నాలుగో కోతి , సెటైర్ ,కబుర్లు , భేతాళ భారతం,కార్టూన్లు ,అంతర్నేత్రం వంటి ఎన్నో ఫీచర్స్ తో పాఠక లోకాన్ని అలరిస్తున్న విషయం మీకు విదితమే. కేవలం చందాల తో పత్రిక నడపడం అంటే సాధ్యమయ్యే పని కాదు .తెలుగు భాషను బ్రతికిన్చుకోవాలి అనే ఒకే ఒక్క మహా సంకల్పంతో సుమతి పత్రికను సుమతి ఫౌండేషన్ ద్వారా ప్రారంబించటం జరిగింది .

ఈ సంకల్పానికి మీ సహకారం తోడైతే నిర్విఘ్నంగా ఈ మహా ప్రస్థానం సాగుతుంది. ఇందుకు గాను సుమతి అకౌంట్ కు గానీ మేము ఇచ్చే ఫోన్ పే / గూగుల్ పే నంబరు 10/– రూ నుండి మీ అవకాశాన్ని. బట్టి ఎంతైనా డోనేషన్ ఇవ్వవచ్చు. మీ చందా / డొనేషన్ ఆన అయిన అదే రోజు వాట్సాప్ లేదా పోస్ట్ ద్వారా రసీదు అందుతుంది. మన తెలుగు భాష పరివ్యాప్తి చెందడానికి సాహిత్య సంపద సృష్టించడం తప్ప మరొక మార్గం లేదు. ఇప్పటికే వివిధ పోటిల ద్వారా రచయతలను ప్రోత్సహిస్తూ వస్తున్నాము . ప్రతి నెల రచయతలకు ఎంతో కొంత బహుమతి మనస్సు పెట్టి రూపం లో సహాయం చేస్తూ వస్తున్నాము . ఈ ఏడాది ఉగాది రోజున 50 మంది కరచయతల్ను సన్మానించాము . సుమతి ఫౌండేషన్ ఇప్పటికే అనేక సేవ కార్యక్రామాలలో సమాజానికి ఇతోధిక సేవలందిస్తోంది .మనవ సేవే మాధవ సేవ అని నమ్మి ఎన్నో అనాధ , వృద్ధ ఆశ్రమాలకు సహాయం చేస్తూ వస్తోంది .భవిష్యత్తులో ఫౌండేషన్ ద్వారా దిగువ కార్యక్రమాలు చెయ్యాలనే సంకల్పం తో ఉన్నాము

1. ప్రతి పాఠశాలలో తెలుగ భాష పై పోటీలు నిర్వహించి చిన్నారులలో సాహిత్యం పట్ల అభిమానం పెంపొందించేటట్లు చూడటం
2.సాహిత్య రంగంలో కృషి చేసే వారికి ఆరోగ్య భీమా /అవసరమయ్యే మందులకైన ఇతోధిక సహాయం
3.ఔత్సాహిక పేద రచయితల పుస్తకాలు ముద్రించటం
4. పేద వృద్ధ రచయతలకు ఎంతోకొంత ఆర్ధిక సహాయం

దీనికి మీ తోడ్పాటు అనివార్యం.
ఎంత చిన్న సహాయం చేసినా , మీ పేర్లు ఫోటో తో సహా సుమతి పత్రికలో ప్రచురింప బడును . పోషకులకు పత్రిక ఉచితంగా పంపబడును. సుమతి నిర్వహించే అన్ని కార్యక్రమాలలో మీకు ఉచిత ప్రవేశం కల్పించబడును
వివరాలకు సంప్రదించాల్సిన నంబర్: 7893111985
సుమతి అకౌంట్ నంబర్ :150810100022726
IFS CODE :UBIN0815080
Phone Pay No;7893111985

నిఖిలేశ్వర్ గారి

# జీవితం ఒక కత్తి ధార

చల్లగా ఆహ్లాదంగా
ఏమరుపాటుగా
విస్తరించి వీస్తున్న
ఈ వెన్నెల కిందే
ఆకలితో మెలికలు తిరిగే
కొండచిలువలాంటి నీటితెర
అలమటించే ఆకలి
దారిద్ర్యంతోనే కాపురం
పిలిస్తే పలికే
చావుతోనే సహజీవనం
అంతిమ శ్వాసదాకా
పెనుగులాడే జీవనవాంఛ
చొచ్చుకుపోతున్న
వాడికత్తిలాంటి జీవనధార
జలసమాధి చేస్తున్న నీటితెరని
నిలువునా చీల్చి
మేల్కొంటూనే వుంది
తిరిగి ఆదుర్దాగా
ఎదురుచూస్తున్న
పిండాకృతిలోంచి....!

# కెనడా తో గొడవేంటి ?



భారత్ –కెనడా మధ్య దౌత్త ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. రెండు దేశాలు దౌత్యవేత్తలను బహిష్కరించాయి. భారత్ మీద ఆంక్షలు విధించేందుకు కెనడా సిద్ధమవుతోంది. అసలు ఈ స్థాయి వివాదాలు ఎందుకొచ్చాయి? భారత్ కెనడా మధ్య ఏం జరుగుతోంది? ఇండియా మీద ట్రూడో ఘాటు ఆరోపణల వెనుక వ్యక్తిగత స్వార్థం ఉందా?

ఫెడరల్ ఎన్నికలకు ఏడాది మాత్రమే టైమ్ ఉండటంతో ఎలాగైనా ఎన్డీపీ మద్దతు సాధించడం లేదంటే దాని ఓటర్లను ఆకర్షించడం లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్న ట్రూడో.. భారత్

# నడుస్తున్న చరిత్ర

పై ఆంక్షల దిశగా అడుగులు వేస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఓ ప్లంబర్ హత్య రెండు దేశాల మధ్య వివాదానికి కారణమైంది. హర్దీప్ సింగ్ నిజ్జర్ అనే వ్యక్తి 1997లో దొంగ పాస్ పోర్టు కింద కెనడా వెళ్లాడు. 2007లో అతడికి కెనడా పౌరసత్వం లభించింది. పంజాబ్ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా ప్రకటించాలని కెనడా కేంద్రంగా ఖలిస్తానీ వేర్పాటువాదులు కొన్నేళ్లుగా నిరసనలు చేస్తున్నారు. వారిని భారత్ ఉగ్రవాదులుగా ప్రకటించింది. అయితే, ఖలిస్తానీ అగ్రనేత నిజ్జర్ గతేడాది హత్యకు గురయ్యాడు. దీని వెనుక భారత్ ప్రమేయం ఉందని ట్రూడో సర్కార్ ఆరోపిస్తూ వస్తోంది.
గత ఏడాది జూన్‌లో నిజ్జర్ హత్య తర్వాత భారత్, కెనడాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. 2023 జూన్ 18న సాయంత్రం, కెనడాలోని సర్రేలో గురుద్వారా వద్ద ఖలిస్తాన్ అనుకూల నాయకుడు హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను ముసుగు ధరించిన సాయుధులు కాల్చి చంపేశారు. దీంతో భారత ఏజెంట్లే నిజ్జర్‌ను హత్య చేశారనే ఆరోపణలు వచ్చాయి. నిజ్జర్ హత్యలో భారత ప్రమేయం ఉందని కెనడా ప్రధాని ట్రూడో గత ఏడాది సెప్టెంబర్ 18న ఆరోపించగా, దానిని భారత్ ఖండించింది. కెనడా నుంచి రుజువులను కోరింది. నిజ్జర్ హత్య వ్యవహారం నిజానికి ఎప్పటిదో. ఆ విషయాన్ని అందరూ మర్చిపోయారు. ఇప్పుడు దాన్ని కెనడా సర్కార్ మళ్లీ హైలైట్ చేస్తోంది. 2023 జీ20 సమావేశాల తర్వాత నుంచి నిజ్జర్ హత్యపై ట్రూడో ప్రభుత్వం వివాదం మొదలు పెట్టింది. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడం మొదలైంది.

సిక్కు వేర్పాటువాద నేత హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్‌తోపాటు ఇతర దౌత్యవేత్తలను 'పర్సన్స్ ఆఫ్ ఇంట్రెస్ట్' (దర్యాప్తుకు సంబంధించిన సమాచారం ఉండటం, లేదా కేసుతో సంబంధం ఉండటం)గా కెనడా పేర్కొనడంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, ఈ ఆరోపణలు 'నిరాధారమైనవి' అని భారత్ ప్రకటించింది. కెనడా ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం ఆ దేశంలో సిక్కుల్ని తమవైపు ఆకర్షించేందుకు ఇలా చేస్తోందని ఆరోపించింది.భారత్ ప్రకటన తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందించారు. ఆరుగురు భారత దౌత్యవేత్తలను తాము బహిష్కరించామని చెప్పారు. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసు దర్యాప్తుకు భారత ప్రభుత్వం సహకరించకపోవడమే ఇందుకు కారణమని ట్రూడో అన్నారు.

రాజకీయ స్వార్థంతో భారత్ మీద కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలు గుప్పిస్తున్నారనే చర్చ జరుగుతున్న వేళ.. ఈ విభేధాలు ఎలాంటి మలుపు తిరుగుతాయనే చర్చ మొదలైంది. అసలు భారత్ కెనడా మధ్య వివాదం ఎలా మొదలైంది. ప్రస్తుత ఆంక్షలతో ఏం జరగబోతోంది? భారత్ మీద కెనడా ఆంక్షలు విధించే పరిస్థితిలో ఉంది. ఆంక్షలు విధిస్తే భారత్ మీద ఎలాంటి ప్రభావం పడే ఛాన్స్ ఉంది?అనేదే ఇప్పుడు సమస్య .

★★★

# ప్రొ.సాయిబాబా మరణానికి బాధ్యత ఎవరిది?



వందమంది దోషులు తప్పించుకోవచ్చునేమో కానీ ఒక నిర్దోషికి కూడా శిక్ష పడకూడదు అన్నది భారత న్యాయ శాస్త్ర సూత్రం. అయితే 90 శాతం అంగవైకల్యంతో పది సంవత్సరములుగా జైలులో ఉన్న సాయిబాబా 2017లో గచ్చిబౌలి జిల్లా సెషన్స్ కోర్ట్ జీవిత ఖైదు విధిస్తే, బాంబే హైకోర్టు 2022లో కొట్టేసింది. దానిపై సుప్రీంకోర్టుకు వెళితే స్టే విధించి తిరిగి విచారించాలని బాంబే హైకోర్టును కోరింది. తిరిగి విచారించిన బాంబే హైకోర్టు సాయిబాబా నిర్దోషి అని తీర్పు చెప్పింది. అంటే నేరం చేయని ఒక నిర్దోషి కి జీవిత ఖైదు విధించడం, ఆ జీవిత ఖైదు తప్పు అని కొట్టివేయడం,చూస్తుంటే భా రతదేశ న్యాయస్థానాలు కొంతమంది మేధావుల జీవితాలను పణంగా పెడుతున్నాయని అర్థమవుతుంది. ఇంతకీ అతను చేసిన నేరం ఈ ప్రభుత్వాలు ఆదివాసీలకు పెడుతున్న హింస నుంచి వాళ్లను కాపాడటానికి ప్రయత్నిం చడం, ఆపరేషన్ గ్రీన్ హంట్ కు వ్యతిరేకంగా ప్రచారం చేయడం. అంటే కష్టాల కడలిలో ఉన్న ప్రజలకు అండగా నిలబడడమే నేరమైతే ఈ కోర్టులు, ఈ న్యాయస్థానాలు, ఈ ప్రభుత్వాలు ఎవరికోసం పనిచేస్తున్నాయి? గరుడుగట్టిన నేరస్తులు బయట చట్టపట్టాలేసుకుని తిరుగుతుంటే పౌరుల హక్కులకు భంగం వాటిల్లిందని తెరిచే నోటిని నొక్కేయడమే స్వాతంత్ర్యమా?

ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా కన్నుమూశారు. విద్యావేత్తగా, రచయితగా, మానవ హక్కుల ఉద్యమకారుడిగా సాయిబాబాకు గుర్తింపు ఉంది. పదేళ్ల కఠిన జైలు జీవితం తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురైన ప్రొఫెసర్ సాయి బాబా శనివారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మౌనంగా నిష్క్రమించారు. తనకు చివరివరకూ తోడుగా వున్న వీల్ చైరే ఆయన కఠినప్రయాణానికి మౌనసాక్షిగా నిలబడింది. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే అభియోగాలతో 2014లో సాయిబాబాను పోలీసులు అరెస్టు చేశారు. 2017లో ఆయనకు గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది.2017లో సాయిబాబాను నాగ్‌పూర్ జైలుకి తరలించారు. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాలతో బాంబే హైకోర్టు విచారణ చేపట్టింది. సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది. సుమారు 9 ఏళ్ల పాటు జైల్లో గడిపిన సాయిబాబా.. ఈ ఏడాది మార్చిలో విడుదలయ్యారు.

ఆయన నిష్క్రమణచట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ( ఉపా ) అమలు పైన అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. జైళ్లలో ఖైదీలపైన ముఖ్యంగా ఉపా ఖైదీల పైన చూపుతున్న వైఖరిని బోనులో నిలబెట్టింది. ఈ చట్టం కింద ఆరెస్ట్ అయిన నిందితులతో ప్రభుత్వం వ్యవహరించే తీరు వివాదాస్పదం అవుతోంది. జైలు నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి అనారోగ్యంతో ఇటు దిల్లీలోనూ అటు హైదరాబాద్‌లోనూ సాయిబాబా

# నడుస్తున్న చరిత్ర



ఆస్పత్రుల చుట్టూ తిరిగిన విషయాన్ని పలువురు సామాజిక వేత్తలు గుర్తుచేస్తున్నారు.జైలులో ఆయన ఆరోగ్యం గురించి పట్టించుకోకపోవడం వల్లే అనారోగ్యం పాలయ్యారని, ఆయన చావుకు బాధ్యత ఎవరిదని పలువురు సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు.


1967లో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో నిరుపేద రైతు కుటుంబంలో సాయిబాబా జన్మించారు. పోలియో కారణంగా ఐదేళ్ల వయస్సు నుంచే ఆయన వీల్ చైర్‌ను ఉపయోగిస్తున్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్ లాల్ ఆనంద్ కాలేజీలో చాలా ఏళ్లు ఇంగ్లిష్ బోధించారు సాయిబాబా. మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉన్నారనే కేసులో జైలుకు వెళ్లడంతో.. 2021, ఫిబ్రవరిలో రామ్ లాల్ ఆనంద్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవి నుంచి తొలగించారు. అమలాపురంలో గ్రాడ్యుయేషన్ చేస్తున్న కాలంలోనే సాయిబాబా వామపక్ష రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యారు. తరువాత ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్ (ఏఐఆర్‌పీఎఫ్) లో చేరారు. 1992లో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో చదివేటప్పుడు ఏఐఆర్‌పీఎఫ్ ఆంధ్రప్రదేశ్ కమిటీకి కార్యదర్శి అయ్యారు. ఆ తరువాత 1995లో ఆ సంస్థకు ఇండియా ప్రధాన కార్యదర్శి గా కూడా పనిచేశారు. దీని తరువాత ఆర్‌డీఎఫ్ అనే సంస్థలో పని చేశారు సాయిబాబా. తెలంగాణలోని ప్రజా ఉద్యమాలే తనకు చదువును, చైతన్యాన్ని నేర్పాయని, తనను వ్యక్తిగా తీర్చిదిద్దింది తెలంగాణే అని సాయిబాబా పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

ఐదేళ్ల వయసులో సాయిబాబాకు పోలియో సోకి రెండు కాళ్లు పనిచేయడం మానేశాయి. అందువల్ల 90 శాతం అంగవైకల్యం కలిగింది.అ టువంటి మనిషిని అత్యంత బలీయమయిన రాజ్యవ్యవస్థకు ప్రమాదకరమని భావించడం మన ప్రభుత్వాలు ఎంత పిరికివో అర్థమౌతున్నాయి . ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించి జైలులో ఖైదీలకు కల్పించాల్సిన కనీస హక్కులను కూడా నిరాకరించింది. తనకు రెండు కాళ్లు పనిచేయనందువల్ల తన సెల్‌లో వెస్ట్రన్ టాయిలెట్ ఏర్పాటుచేయాలని ప్రొఫెసర్ సాయిబాబా ప్రభుత్వాన్ని కోరారు. ఈ చిన్న కోర్కెను కూడా ప్రభుత్వం నిరాకరించడం అమానవీయమ కాక మరేమిటి .

సాయిబాబా తుది శ్వాస వరకు ఆయన సహచరి వసంతకుమారి అండగా నిలబడ్డారు. జైలు లోపల సాయిబాబా పోరాడితే బయట వసంత ఆయన కోసం దాదాపుగా ఒంటరి పోరు చేశారు. అరెస్టయ్యాక సాయిబాబాకు ఉద్యోగం పోయింది. ఒక వైపు ఇల్లు గడవడమే కష్టం. మరో వైపు భర్త కోసం జైలు వెలుపల పోరాటం. వసంత కష్టాలు వర్ణనాతీతం. సాయిబాబా, వసంత,ఇద్దరు ఆంధ్రా ప్రాంతంలోని అమలాపురం దగ్గరలోని ఒకే గ్రామానికి చెందినవారు. హైస్కూల్ రోజుల నుంచి ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఒకరినొకరు ఇష్టపడి ప్రేమ పెళ్లి చేసుకున్నారు. అప్పటినుంచి సుఖాలనే కాదు కష్టాలనూ సాయిబాబాతో కలిసి వసంత పంచుకున్నారు.

దేశ భద్రత కోసం తీవ్రవాదాన్ని అరికట్టాల్సిందే. అందుకు అనుగుణమయిన చట్టాలు రావాల్సిందే. కానీ ఈ పేరుతో చట్టాలను దుర్వినియోగం చేస్తే దేశ ప్రజాస్వామ్యానికే పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉందని, ఉపా చట్టం ప్రజాస్వామ్యానికి ముప్పు కాకూడదు.. అదే జరిగితే అధికారాన్ని ప్రశ్నించేవారు కరువవుతారని, పాలనలో నియంతృత్వ పోకడలు పెచ్చరిల్లుతాయి .

# భారతరత్న రాని నిజమైన జాతిరత్నం రతన్ టాటా!






దేశంలోనే దిగ్గజ బిజినెస్ మెన్, టాటా గ్రూప్ గౌరవ చైర్మెన్ రతన్ టాటా కన్నుమూశారు. 86 ఏళ్ల రతన్ టాటా ఇటీవల అనారోగ్యం కారణంగా ముంబై నగరంలోని బ్రీచ్ కాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. బిజినెస్ మెన్ అయినప్పటికీ ఆయనకు దేశ వ్యాప్తంగా అభిమానులున్నారు. రతన్ టాటా దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం సంపాదించిన గొప్ప వ్యక్తి. ఆయనలో పెద్ద పారిశ్రామికవేత్తతో పాటు.. గొప్ప మానవీయగుణం ఉంది. 2008లో రతన్ టాటా తాను చదువుకున్న కార్నెల్ యూనివర్సిటీ 50 మిలియన్ డాలర్ల విరాళం అందించారు. రతన్ టాటా హయాంలోనే టాటా గ్రూప్ కంపెనీలు పలు కీలక రంగాల్లో అద్భుత అభివృద్ధిని సాధించాయి.ఈ రోజు టాటా గ్రూప్ టీ పౌడర్ నుంచి జాగుఆర్, ల్యాండ్ రోవర్ లాంటి పెద్ద పెద్ద కార్లు సైకం విక్రయిస్తోంది. సముద్రంలో నుంచి ఉప్పు తయారు చేయడంతో పాటు అదే సముద్రంలో ప్రయాణించే పెద్ద పెద్ద షిప్పులు, విమానాల తయారీకి పేరు గాంచింది. ఎన్నో రంగాల్లో టాటా కంపెనీలు విజయవంతంగా రాణిస్తున్నాయి అంటే దానికి ప్రధాన కారణం రతన్ టాటానే.

టాటా సన్స్ గౌరవ చైర్మెన్ అయిన రతన్ టాటా పూర్తి పేరు రతన్ నావల్ టాటా. 1937 సంవత్సరంలో డిసెంబర్ 28న నావల్ టాటా, సోనీ కామిసారిట్ అనే పార్సీ దంపతులకు ఆయన జన్మించారు. రెండేళ్ల తరువాత రతన్ టాటా తమ్ముడు జిమ్మీ టాటా జన్మించారు. రతన్ టాటా పదేళ్ల వయసున్నప్పుడే ఆయన తల్లిదండ్రులు విడాకులు తీసుకొని విడిపోయారు. ఆ తరువాత కొంత కాలం జెయన్ పెటిట్ అనాథాలయంలో ఉన్నారు. అది తెలిసి రతన్ టాటా నాన్నమ్మ నవాజ్ బాయి టాటా ఆయనను చట్టపరంగా దత్తత తీసుకున్నారు.రతన్ టాటా ముంబైలోని కాంపియోన్ స్కూల్ లో 8వ తరగతి వరకు చదువుకున్నారు. ఆ తరువాత క్యాథెడ్రల్ అండ్ జాన్ కానన్ స్కూల్ లో కొంత కాలం, ఆ తరువాత హిమాచల్ ప్రదేశ్ షిమ్లాలోని బిషప్ కాటన్ స్కూల్ లో కొంతకాలం స్కూల్ విద్య పూర్తి చేశారు. అమెరికాలోని న్యూయార్క్ సిటీ లోని రివర్ డేల్ కంట్రీ స్కూల్ నుంచి 1955లో ఆయన డిగ్రీ పూర్తిచేశారు. ఆ తరువాత 1959లో కార్నెల్ యూనివర్సిటీ నుంచి ఆర్కిటెక్చర్ లో బ్యాచిలర్స్ కోర్సు చదువుకున్నారు.

ఎంతో మందికి ఆదర్శప్రాయుడైన రతన్ టాటా ఒక మాట చెప్పేవారు. "ధనాన్ని, బలాన్ని నేను నమ్మకోలేదు.. కేవలం ఆత్మవిశ్వాసాన్ని నమ్ముకున్నాను. సరైన నిర్ణయాలు మాత్రమే తీసుకోవాలి అని నేను చెప్పను. ముందు ఒక నిర్ణయం తీసుకొని.. ఆ తరువాత దాన్ని సరిగా అమలుపరుస్తాను." అని చెప్పేవారు. దేశాభివృద్ధికి పాటుపడిన రతన్ టాటాకు 2000 సంవత్సరంలో భారత ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డు ప్రదానం చేసింది. ఆ తరువాత 2008లో దేశ రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ తో సన్మానించింది.

'చాలామంది భారత బిలియనీర్స్‌తో పోలిస్తే రతన్ టాటా జీవనశైలి అత్యంత సాధారణంగా ఉంటుంది'' అని రచయిత కుమీ కపూర్ చెప్పారు. రతన్ టాటా సాదాసీదా జీవితంలో కొన్ని ఉదాహరణలు :

దిల్లీ నుంచి ముంబయికి విమానంలో

ప్రయాణిస్తున్న సమయంలో మిమ్మల్ని అత్యంత ఎక్కువగా ప్రభావితం చేసిన ఒక ప్రయాణికుడి గురించి చెప్పండి అన్నారు. అప్పుడు అత్యధిక ఓట్లు రతన్ టాటాకు లభించాయి. కారణమేంటో తెలుసుకోడానికి ప్రయత్నించినప్పుడు, వీఐపీల్లో ఆయన ఒక్కరు మాత్రమే ఒంటరిగా ప్రయాణించేవారని తెలిసింది. అంటే తన బ్యాగ్ తీసుకెళ్లడానికి, ఫైళ్లు పట్టుకోవడానికి రతన్ టాటాకు అసిస్టెంట్లు ఎవరూ ఉండేవారు కాదు. విమానంలో ఆయన నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటుండేవారు. ఆ సమయంలో తక్కువ చక్కెర వేసిన ఒక బ్లాక్ కాఫీ తాగడం ఆయనకు అలవాటు.తాను అడిగినట్టుగా కాఫీ ఇవ్వలేదని ఆయన ఎప్పుడూ ఫ్లయిట్ అటెండెంట్లపై కోప్పడలేదు.

2018 ఫిబ్రవరి 6న బ్రిటన్ ప్రిన్స్ చార్లెస్ బకింగ్హమ్ ప్యాలెస్‌లో రతన్ టాటాకు 'రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ఇవ్వాల్సి ఉంది.కానీ, వేడుకకు కొన్ని గంటల ముందు తాను అక్కడికి రాలేనని, ఎందుకంటే తన కుక్క టీటోకు హఠాత్తుగా జబ్బు చేసిందని ఆ కార్యక్రమ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు రతన్ టాటా. ప్రిన్స్ చార్లెస్‌కు ఆ విషయం చెప్పగానే ఆయన ''దట్స్ ఎ మ్యాన్. దట్ ఈజ్ ద మ్యాన్ రతన్ ఈజ్'' అన్నారు.

జేఆర్డీ టాటా లాగే రతన్ టాటా సమయపాలనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆయన సరిగ్గా సాయంత్రం ఆరున్నర గంటలకు తన ఆఫీసు నుంచి వెళ్లిపోయేవారు.ఆఫీసుకు సంబంధించిన పని కోసం ఎవరైనా తనను ఇంట్లో కలవాలనుకుంటే ఆయన చిరాకు పడేవారు. ఇంట్లో ఏకాంతంగా ఫైళ్లు, ఇతర పత్రాలు చదువుతుండేవారు.

ఆయన ముంబయిలో ఉన్నప్పుడు వారాంతాల్లో అలీబాగ్‌లోని తన ఫాంహౌస్‌లో గడిపేవారు. ఆ సమయంలో ఆయనతో కుక్కలు తప్ప ఇంకెవరూ ఉండేవారు కాదు. ఆయనకు ప్రయాణాలు చేయడం, ప్రసంగాలు చేయడం లాంటివి పెద్దగా నచ్చేవి కాదు. ఆడంబరాలంటే ఆయనకు చిరాకు.

చిన్నప్పుడు కుటుంబం రోల్స్

రాయిస్ కారులో ఆయన్ను స్కూలు దగ్గర దింపే సమయంలో ఆయనకు అసౌకర్యంగా అనిపించేది.

ఆయనకున్న 'మొండి' స్వభావం తన కుటుంబంలోనే ఉందని, జేఆర్డీ, ఆయన తండ్రి నావల్ టాటాల నుంచి అది రతన్‌కు వారసత్వంగా వచ్చిందని రతన్ టాటాను దగ్గరగా చూసినవారు చెబుతుంటారు.

ఎవరితోనైనా గౌరవ మర్యాదలతో నడుచుకుంటారని, ఎలాంటి గాబరా ప్రదర్శించని ఆసక్తికరమైన వ్యక్తి అని చెబుతుంటారు. ఎవరైనా తనను కలవాలనుకుంటే, స్వయంగా ఆయనే ఫోన్ ఎత్తే వారని చెప్పారు. ఆయనకు సెక్రటరీలు ఎక్కువగా లేకపోవడాన్ని చూసి తాను చాలా ఆశ్చర్యానికి గురైనట్లు తన వ్యాపార సలహాదారుల్లో ఒకరు అన్నట్లు తెలిపారు.

"నేనొకసారి ఆయన ఇంటి బెల్ నొక్కినప్పుడు, ఒక చిన్న అబ్బాయి వచ్చి తలుపు తెరిచారు. యూనిఫామ్ వేసుకున్న సర్వెంట్లు ఎవరూ నాకు ఆ ఇంట్లో కనిపించలేదు. సముద్రానికి ఎదురుగా కొలాబాలో ఉండే ఆయన ఇల్లు టాటా కళాభిరుచిని ప్రతిబింబిస్తుంది. కుంబ్లా హిల్స్‌లోని యాంటిలియాలో ఉన్న ముకేశ్ అంబానీ 27 అంతస్తుల భవనానికి ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది"

దేశం చాలా మంది ప్రముఖులను చూసింది. ఒక్కో ప్రముఖుడు ఒక్కో సెక్టార్ ప్రజల అభిమాన పాత్రుడు అవుతాడు. దానికి రకరకాల రీజన్లుంటాయి. అలాంటి ప్రముఖులు దూరం అయినప్పుడు ఆ వర్గం ప్రజల నుంచి ఎక్కువ స్పందన వస్తూ



ఉంటుంది. మిస్ యూ పోస్టులు దర్శనమిస్తూ ఉంటాయి. అయితే కొందరు ఇలాంటి వాటికి మినహాయింపు. వీరికి జీరో హేటర్స్ ఉంటారు. బహూశా దేశంలో అబ్దుల్ కలాం తర్వాత అన్ని వర్గాల నుంచి అమితమైన స్పందనను చూరగొన్నది రతన్ టాటానే. ఆయన మరణ వార్త ప్రకటన తర్వాత మీడియా కన్నా సోషల్ మీడియానే పెద్ద ఎత్తున స్పందించింది. అప్పటికీ రతన్ టాటా సన్స్ చైర్మన్ హోదా నుంచి వైదొలిగి చాలా కాలం అవుతూ ఉంది. రతన్ తర్వాత సైరస్ మిస్త్రీ కొంతకాలం ఆ బాధ్యతల్లో కొనసాగారు, ఆ తర్వాత రకరకాల కారణాలతో మరొకరు తెరపైకి వచ్చారు. అయితే టాటా అంటే రతన్, రతన్ అంటే టాటా అనే భావనే సర్వత్రా కొనసాగింది.


వృద్ధుల దగ్గర నుంచి యువత వరకూ అందరికీ సుపరిచితుడు రతన్ టాటా వెలుగొందారు. ఆయన మరణం తర్వాత సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తాయి. ఇన్‌స్టాగ్రమ్, వాట్సాప్, ఫేస్ బుక్ ఇలా తేడా లేకుండా.. నెటిజన్లు పోస్టులు పెట్టి ఆయనకు నివాళి అర్పించారు. ఈ స్పందనను గమనిస్తే.. దివంగతుడు అయిన భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం తర్వాత.. ఆ స్థాయిలో రతన్ విషయంలోనే స్పందన వ్యక్తం అయ్యిందని చెప్పవచ్చు. దశాబ్దకాలం కిందట కలాం మరణించినప్పుడు నెటిజన్లు ఈ

స్థాయిలో స్పందించారు. ఆయనకు నివాళి అర్పించడంలో ఆయనపై ప్రేమాభిమానాలు వ్యక్తం అయ్యాయి. రతన్ టాటా ఒకరకమైన వ్యాపారస్తుడే, ఆయన తన కంపెనీ లాభాల కోసమే పని చేశారు. అయితే అలా పని చేసి కూడా ఏ చిన్న వివాదాన్నీ తెచ్చుకోలేదు. కార్పొరేట్ కంపెనీలనే ఆయన నడిపినా, వినియోగదారులతో వ్యాపారమే చేసినా.. టాటా కంపెనీ పేరును ఆయన నమ్మకానికి మారుపేరుగా మార్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. అంబానీలు, ఆదానీలు వ్యాపారస్తులు అయితే రతన్ టాటా ఇండస్ట్రియలిస్ట్.

అంబానీలు, ఆదానీలు కూడా దేశంలో లక్షల కోట్ల వ్యాపారాలను చేస్తున్నారు, కానీ వారికెన్నటికీ రతన్ టాటా వంటి పేరు ప్రఖ్యాతులు రావు, దేశ ప్రజల ప్రేమాభిమానాలు అయితే సొంతం కావు. అదంతే! అదెందుకో తెలుసుకోవాలంటే.. దశాబ్దాల టాటా సంస్థల మనుగడను అధ్యయనం చేయాలి. మార్కెట్ లో ఎత్తుకుపై ఎత్తులు వేసి.. వేల కోట్లు, లక్షల కోట్లు సంపాదించేసినా కూడా రతన్ టాటా లాంటి అభిమానాన్ని పొందాలన్నా, టాటా గ్రూప్ తరహాలో నమ్మకాన్ని చూరగొనాలన్నా.. ఆ సంస్థ అధిపతులు వేసిన బాటలోనే సాగాలి కానీ, మరో బాటతో అలాంటి ఆత్మీయాభిమానాలు పొందలేరు!

ఇతర సంస్థలన్నింటినీ దెబ్బ కొట్టేసి తాము పైకి రావాలనే వ్యాపారం ఏదీ కనపడదు టాటా వ్యవహారాల్లో! రాత్రికి రాత్రి చౌక ధరల్లో సేవలను అందుబాటులో పెట్టేసి, అప్పటికే ఆ రంగంలో పని చేసుకుంటున్న కంపెనీలను దారుణంగా దెబ్బతీసి, వినియోగదారులందరినీ తనవైపుకు తిప్పుకున్నాకా, ప్రత్యర్థులు పూర్తిగా దెబ్బతిన్నాకా, మోనోపలి సాధించాకా.. ఆ తర్వాత వినియోగదారుల నుంచి కూడా వీలైనంత దండుకునే వ్యాపారాలను చేస్తూ.. దేశానికి తామే దిక్కు అన్నట్టుగా తయారైన కంపెనీలు చాలానే ఉన్నాయి.

అయితే ప్రజలు కూడా అలాంటి వ్యాపారాలను చేసే వాళ్లను వ్యాపారస్తులుగానే చూస్తారు. వారి వైభోగాలు, వేల కోట్లతో చేసుకునే వేడుకలు కూడా.. వ్యాపారాత్మక వినోదంగానే ప్రజలు చూస్తారు. వారి జీవితాల్లోని గ్లామర్ ను చూసి జనాలు విస్తుబోవడమే కానీ.. వారిపై ఆత్మీయతలు, కనీసం అభిమానాలు కూడా ఏమీ ఉండవు! రతన్ ఆధ్వర్యంలో టాటా సంస్థలు ఎంతో ప్రగతిని సాధించాయి. ఆయన టాటా సన్స్ చైర్మన్ పదవిని తీసుకునే నాటికి ఆరు బిలియన్ డాలర్లు. అంటే సుమారు 18 వేల కోట్ల రూపాయలు. ఆయన 2012లో ఆ హోదా నుంచి విరమించుకునే సరికి ఆ సంస్థల ఆదాయాలు అక్షరాలా 5.5 లక్షల కోట్ల రూపాయలను అందుకున్నాయి. టాటా అంటే నమ్మకం అనే భావనను రతన్ కలిగించారు. మంచి నీళ్లు తాగాలన్నా, ఉప్పు కొనాలన్నా.. టాటా ప్రోడక్ట్స్ ఉన్నాయంటే వాటి వైపే వినియోగదారులు మొగ్గుచూపే సెంటిమెంట్ ను ఆయన నాయకత్వంలోనే ఆ సంస్థ పొందింది.
పోటీ ఉన్న రంగంలో తాము కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభిస్తున్నా.. వినియోగదారుడిని ఆకర్షించడానికి చీప్ ట్రిక్స్ ను టాటా అనుసరించిన దాఖలాలు అయితే ఎక్కడా కనపడవు. అప్పటికే విదేశీ కంపెనీలు విస్తరించి ఉన్నరంగాల్లోకి టాటా ఎంటరై ప్రత్యేకతను చూపించి, వినియోగదారులను తన వైపుకు తిప్పుకుంది కానీ, మొదట తక్కువ రేటు అనే వ్యూహాలను అనుసరించలేదు. ఇంకా చెప్పాలంటే కొన్ని రకాల వ్యాపారాలను ప్రారంభంతోనే టాటా సంస్థలు ఎక్కువ రేటుతోనే మార్కెట్ లోకి వచ్చాయి. రతన్ ఆధ్వర్యంలో టాటా అలాంటి ఎత్తు ఏదైనా వేసిందంటే అది లక్ష కారు విషయంలోనే. లక్ష రూపాయలకే కారు అంటూ సంచలనం రేపి, ఆ తర్వాత ఆ విషయంలో పూర్తిగా చేతులెత్తేసింది. అయినా అది రతన్ ఇమేజ్ ను ఏ రకంగానే భంగపరచలేదు.
సమీప కాలంలో మరో రతన్ టాటా అగుపించడం లేదు, అదే దేశానికి పెద్ద లోటు. రతన్ చాలా కాలం కిందటే టాటా రోజువారీ వ్యవహారాల నుంచి దూరంగా ఉన్నా, ఆ సంస్థలు ఆయన దారిలోనే సాగుతున్నాయనే నమ్మకం అయితే ఇప్పటికీ ప్రజల్లో గట్టిగా ఉంది.★



# అంతర్నేత్రం



## జీవితాన్ని ఆస్వాదించు

మనం భూమ్మీదకు వచ్చింది జీవించటానికి. జీవితం నుంచి తప్పించుకోవడానికి కాదు. చాలా మంది జీవిత మూలాల్లోకి వెళ్ళి తెలుసుకోలేక, పైపై మెరుగులతో సరిపెట్టుకుంటున్నారు. పూర్తిగా ఎవరైతే జీవితంలో నిమగ్నమౌతారో వారికే జీవితమంటే తెలుస్తుంది.

ప్రఖ్యాత శాస్త్రవేత్త న్యూటన్కు మృత్యువు సమీపించినప్పుడు, ఆయన 'నాకు ఈ సైన్సు అంటే ఏమి తెలియదు, నే సముద్రపు ఒడ్డున గవ్వలు ఏరుకోవటంలో జీవితాన్ని వ్యర్థం చేశాను. అసలు సముద్రాన్ని అన్వేషించలేదు. నాకు సముద్రాన్ని అన్వేషించే అవకాశం మళ్ళీ వస్తే బాగుంటుంది' అన్నాడు. జీవితాన్ని బాగా ఆస్వాదించినవారు, జీవితాన్ని మరిన్ని కోణాల గుండా చూడాలని కోరుకుంటారు.

# పరిణితి

జీవితం చాలా చిన్నది.
పశ్చాత్తాపంతో మొదలయ్యే ఉదయాలతో దాన్ని నింపలేం. అందుకే మనల్ని ఆదరించే వారిని ప్రేమిద్దాం. ఆ పని చేయని వారినీ గౌరవిద్దాం. ప్రతి సంఘటనా ఏదో కారణం చేతనే జరుగుతుందని నమ్ముదాం. అవకాశం వస్తే దాన్ని స్వీకరిద్దాం. అది మన జీవితాన్ని మారిస్తే, అనుమతిద్దాం. ప్రేమించే కన్నులతో చూసేవారికి జీవితం సుందరం, మృదువైన మాటలు పలికే వారికి జీవితం శాంతిమయం, సున్నితమైన చేతులతో సహకరించేవారికి జీవితం ఆనందమయం, సుతిమెత్తని హృదయంతో సంరక్షించే వారికి జీవితం సకల శుభప్రదం.

జీవించడం అనేది ఉత్తేజకరమైన పని. ముఖ్యంగా ఇతరులకోసం జీవించినప్పుడు అది పరమ ఉత్తేజకరమైంది. ఊహించిన వాటిని పోగొట్టుకోవడం, అనూహ్యమైన వాటిని ఎదుర్కోవడమే జీవితం. మనది ఒప్పయితే ఎవరూ మనల్ని గుర్తుంచుకోరు. మనది తప్పయితే ఎవరూ మనల్ని మరచిపోరు. అదే జీవితం.

జీవించడం అనేది ఉత్తేజకరమైన పని. ముఖ్యంగా ఇతరులకోసం జీవించినప్పుడు అది పరమ ఉత్తేజకరమైంది. ఊహించిన వాటిని పోగొట్టుకోవడం, అనూహ్యమైన వాటిని ఎదుర్కోవడమే జీవితం. మనది ఒప్పయితే ఎవరూ మనల్ని గుర్తుంచుకోరు. మనది తప్పయితే ఎవరూ మనల్ని మరచిపోరు. అదే జీవితం.

జీవితంలో ప్రతి సమస్య మనల్ని తుంచేందుకు గాని పెంచేందుకు గాని వస్తుంది. జీవితంలో ప్రతి పరీక్ష మనల్ని బాగు చేసేందుకు గానీ బాధ పెట్టేందుకు గానీ వస్తుంది, జీవితంలో ప్రతి కష్టం మనల్ని మెరుగు పరిచేందుకు గానీ మెడలు విరిచేందుకు గానీ వస్తుంది. విజేతగా నిలవడమా లేక పరాజితునిగా మిగలడమా అనేది మన చేతుల్లోనే ఉంది.
చాలా మంది జీవితంలో ఎదురైన వైఫల్యాలకు కుమిలిపోతుంటారు. ముందుకు సాగలేరు. చరిత్రను పరిశీలిస్తే జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఛార్లెస్ డార్విన్, విద్యుత్ బల్బు కనిపెట్టిన ఎడిసన్, టెలిఫోన్ కనిపెట్టిన గ్రహంబెల్, విజ్ఞాన ఖని ఐన్స్టీన్ రాజకీయ రంగంలో లబ్ధ ప్రతిష్ఠులైన వాషింగ్టన్, విన్స్టన్ చర్చిల్ బాల్యంలో ఎందుకూ పనికిరాని వారుగా ముద్రపడినవారే. వారంతా తమ వైఫల్యాలను అధిగమించి ముందుకు సాగుతూ విజేతలుగా చరిత్రలో నిలిచారు.

ఉదయాన్నే నిద్ర నుంచి సరైన ఎరుకతో మేల్కొనాలి. మనోదృష్టితో శరీరాన్నంతా దర్శించాలి. నీళ్ళు తాగుతున్నప్పుడు నీటిధారను మానసికంగా చూడగలగాలి. నడుస్తున్నప్పుడు ప్రతి అడుగు లెక్కపెడుతున్నంత స్పృహతో నడవాలి. జీవితంలోని ప్రతి అణువులను పరిపూర్ణంగా ఆస్వాదించాలి. అప్పుడే జీవితం ఆనందమయంగా మారుతుంది. అలా ప్రేమతో ఆనందంతో జీవించేవారు తప్పకుండా జీవిత లక్ష్యాన్ని చేరుకుంటారు.
సృష్టిలోని ఎనభైనాలుగు లక్షల జీవరాసుల్లో అత్యంత ఉత్కృష్టమైంది మానవ జన్మ. అందుకే మనిషిగా పుట్టినందుకు మన జన్మను సార్థకం చేసుకోవాలి. ఏ మనిషికైనా యోగ్యత ఉంటుంది. సృష్టిలో తన ఉనికిని, పుట్టుకకు గల కారణాన్ని తెలుసుకోవటమే జీవితం.

★★★

# కొంటె ప్రశ్న –చిలిపి జవాబు

కిందటి నెల ప్రశ్న
కూర్చుని తింటే, కొండలైనా తరిగిపోతాయి,మరి నుంచుని తింటే ..?
సముద్రాలు ఆవిరైపోతాయి
116/–రూ.బహుమతి పొందిన జవాబు:
పాంచజన్య

ఈ నెల ప్రశ్న
జవాబులు అక్టోబర్ 25 లోపు పంపండి
sumathi.potilu@gmail.com

## సాధారణ ప్రచురణకు ఎన్నికైన జవాబులు

కూర్చుని తింటే, కొండలైనా తరిగిపోతాయి,మరి నుంచుని తింటే ..?
కాళ్ళ చెప్పులు అరిగిపోతా
లావణ్య ,గుంటూరు

కూర్చుని తింటే, కొండలైనా తరిగిపోతాయి,మరి నుంచుని తింటే ..?
కాళ్ళ చెప్పులు అరిగిపోతాయి
కృష్ణ విజయ

కూర్చుని తింటే, కొండలైనా తరిగిపోతాయి,మరి నుంచుని తింటే ..?
కాళ్ళు కదలక మెదలక ఉండిపోతాయి
కోలా సత్యనారాయణ

కూర్చుని తింటే, కొండలైనా తరిగిపోతాయి,మరి నుంచుని తింటే ..?
అందరి పళ్లాలూ తగులుతాయి
మోదుగ బాలసుబ్రహ్మణ్యం , గుంటూరు

కూర్చుని తింటే, కొండలైనా తరిగిపోతాయి,మరి నుంచుని తింటే ..?
కాళ్ళు పీకుతాయి
పి .అమ్మిరెడ్డి ,గుంటూరు

కామెడి సీరియల్

# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి



అలేఖ్య

”సార్‘హోం మినిస్టర్ గారు లైన్ లో వున్నారు”

పి .ఏ. మహింద్రకి ఫోన్ అందించాడు.

“ఏమయ్య భాస్కర రావ్, నాకు ఒక్క ముక్కకూడా చెప్ప కుండా ఏమిటయ్యా ఆ కూల్చటాలు.... పార్టీ ఉండాలా? పోవాలా? ఏదో మనోడివిలే అని ఊరుకుంటుంటే మరీ పేట్రేగి పోతున్నావు. ఒక్క నిమిషం పట్టదు నిన్ను పదవి నుంచి తొలగించటానికి “అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు ముఖ్యమంత్రి

# కామెడి సీరియల్

**జరిగిన కథ**
ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లొ ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉండి ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు . వర్లుగారి స్నేహితుడు తాతారావు వంటపని ఇంటిపని చేస్తూ భార్య చాటు భర్తగా గడుపుతుంటాడు . కాలనీ చుట్టూ అపార్ట్మెంట్లు రావటం తో నీటి ఎద్దడి రావటంతో మినిష్టేర్ని కలవల్నుకుంటారు వర్లు గారు . మునిసిపల్ కమిషనర్ ణి కలిసిన ఫలితం ఉండదు .హెడ్ కానిస్టేబులు రంగనాథం శంకరం దగ్గరకు చిన్న చిన్న కేసులు తీసుకువస్తుంటాడు .తాతారావు కొడుకు పద్మనాభం అందరిని పార్టీకి పిలుస్తాడు.పార్టీలో రియల్ ఎస్టేట్ కింగ్ హరీష్ ని అందరికి పరిచయం చేస్తా డు పద్మనాభం . కొంత మంది రౌడీలు తమ ఇల్లు ఆక్రమించారని శంకరాన్ని సంప్రదిస్తాడు ఆ ఉరి పోస్టు మాస్టర్ .ఉమ శంకరం కలిసి వాళ్ళ ఆట కట్టిస్తారు .కోబ్రా పేరుతో కోసి నది పరివాహక ప్రాంతంలో కట్టిన ఇళ్ళను కులగొడతారు మాహనగర్ మునిసిపాలిటి వాళ్ళు .
**ఇక చదవండి**

‘అంత మాటెందుకులెండి, ఎవరిని దించాలన్నా , ఒక్క నిమిషమే పడుతుంది” అవతల నుంచి నింపాదిగా జవాబు వచ్చింది.

“అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం, ఎవరి అండ చూసుకుని. ఇలా రెచ్చి పోతున్నావు “అరిచినంత పనివేశాడు మహేంద్ర

“ నావెనుక ఎవరున్నారో మీకు తెలియంది కాదు. తెలిసీ మీరు ఆవేశపడుతున్నారంటే, మీది అమాయకత్వమో లేక అజ్ఞానమో అర్ధం కావట్లేదు . మీరు ఇలాగే ఆవేశ పడితే, జనం మీకు శ్రద్ధాంజలి ఘటిస్తారు మరి, ఆపై ‘మీ ఇష్టం’ “భాస్కర రావు మహేంద్ర ను హెచ్చరించాడు.

ఆ మాటలకు మహేంద్ర కాస్త వెనక్కి తగ్గాడు

“అదిగాదు. భాస్కర రావు చెప్పాపెట్టకుండా, ఒక పద్దతి పాడు లేకుండా కూలగొట్టుకొంటూ పోతే, రేపు జనానికి, మీడియాకి ఏం జవాబు చెప్పాలి “ అంటూ నసిగాడు

“అదా మీ బాధ, వాళ్ళను మీదాకా ఎందుకు రానిస్తాము. ఏదో ఒకటి చేసి వాళ్ళ దృష్టి మరులుస్తాము లెండి . మీరేమి కంగారు పడకండి.” అంటూ భరోసా ఇచ్చాడు

ఇక చేసేది ఏమిలేక,” వీడిని కాదు, ముందు వీడి వెనకున్న వాళ్లని దెబ్బకొడితే కాని, వదు దారికి రాడు అని మనసులో అనుకుంటూ

“ఇదిగో పిఏ. ఎవరన్నా పేపరోళ్ళు కాని , మీడియా వాళ్ళు కాని కోసి నది కుల్చివేతల గురించి అని వస్తే నేను లేనని చెప్పు లేదా ఆ భాస్కరరావు దగ్గరకు పంపించు “అంటూ పి .ఏ మీద విసుక్కున్నాడు.

ఇలాంటి ఎన్నో చూసిన పిఏ రామలింగం,” చిత్తం, సార్” అలాగే అంటూ అక్కడి నుండి నిష్క) మించాడు

★★★

“ఏరా పద్మ నాభం, ఎమిటి కోసి నది కూల్చి వేతల గొడవ.... చాలా మంది కోర్టును ఆశ్రయిస్తున్నారు. నాదగ్గరకు? ఒకరిద్దరు వచ్చారు కూల్చివేతలు ఆపమని “ఫోన్ లో పద్మ నాభాన్ని అడిగాడు శంకరం

# గిలిగింతలు పెట్టె హాస్య వల్లరి కడుపుబ్బా నవ్వించే కామెడి సీరియల్

ఏమోరా నాకు తెలియను. ఇంత అర్ధాంతరంగా ఎప్పుడో ఎండిపోయి, చాలావరకు ఆక్రమణలకు గురయిన ఆ నది మీద ప్రభుత్వానికి ఎందుకంత ప్రేమ పుట్టుకొచ్చిందో ఎవ్వరికీ అర్ధం కావట్లు మా డిపార్టు మెంట్లో కూడా. ప్రతి ఒక్కరూ ఇదె మాట్లాడుకుంటున్నారు.?" అవతల నుంచి పద్మనాభం జవాబిచ్చాడు

"ఇంతకి అక్కడున్న అక్రమ నిర్మాణాలన్నీకూల్చేసి ఏం చేస్తారట "



"కాంత మందేమో, నదిని మళ్లీ పునర్జీవింప చేసి, నదీ పరీవాహ ప్రాంతం మొత్తం సుందరికరణ చేసి పారిస్
నగరంలోలా తీర్చి దిద్దు తారట...."

'పారిస్ నగరం ? నమ్మమంటావా ?అసలు అంతుందంటావా. ఈ ప్రభుత్వానికి?"

"నన్ను పూర్తిగా చెప్పనివ్వు . ఇంకొంత మంది రియల్ ఎస్టేటు వాళ్ళకు కట్ట బెట్ట టానికి అని."

"అది సాధ్యం కాదురా , వున్న వాళ్ళను ఖాళీ చేయించి ఇంకొకరికి స్థలాలు అమ్మటానికి కోర్టులు ఒప్పుకోవు"

"ఏమోరా అన్నిటికీ అన్నీ నువ్వే చెపుతావు . మరిఅసలు విషయం ఏమిటో నువ్వే చెప్పరాదు .. !"

లాయర్లం కాదురా ,మా మాటలు ఇలాగె ఉంటాయి ,నాకు ఇతిమిద్ధంగా తెలియదు రా ..ఇంత పెద్ద ఎత్తున ఇంత మంది ఇళ్ళ కూలుస్తున్నారంటే, వెనకాల చాలా పెదతలకాయలే వుండి వుండాలి"

" ఎవరై వుంటారంటావు?"

"అది నీకే తెలియాలి, రియల్ ఎస్టేట్ టైకూన్ నీస్నే హితుడే కదా , వాడ్ని అడక్క పోయావా?"

'ఒరేయ్ నాయనా వాడిని నేను కలవటం అదే మొదటి సారి, అదే చివరిసారి.. మళ్లీ కలిసింది లేదు."

"అలా పెద్దవాళ్లని వది లేస్తే ఎలారా . పరిచయాలు . కొనసాగిస్తూ పోవాలి ""

'అన్నీ నువ్వేరా చెప్పేది. కాసేపు వద్దంటావు, కాసేపు పరిచయాలు పెంచుకోవాలంటావు.నీకో దండం రా కాస్త పని వుంది . మళ్ళీ కలుస్తా "అంటూ ఫోన్ కట చేసాడు పద్మనాభం

"ఏమంటున్నాడురా నీ స్నేహితుడు.." .అప్పటి దాకా వాళ్ళ సంభాషణ వింటున్న వర్లు గారు అడిగారు

'ఏవిషయం వాడికీ తెలియదట నాన్న. చాలా మంది కోర్టులో కేసు ;ఉ వెయ్యటం కోసం వస్తున్నారు. వాళ్ళ దగ్గర అన్ని పర్మిషన్లు వునాయి..."

"వుండకేం చేస్తాయిరా.
**మున్సిపాలిటీ అంటేనే ఓ పెద్ద మురుగు, అందులో టౌన్ ప్లానింగ్ వంటి అవినీతి పరులు ఇంకొకరు ఉండరు**
. స్మశానంలో ఇల్లు కట్టకుంటామన్నా డబ్బుతీసుకుని కళ్ళు మూసుకుని పర్మిషన్

# కామెడి సీరియల్

ఇస్తారు. వీళ్ళ దురాశను రియల్ ఎస్టేట్ మాఫియా క్యాష్ చేసు కుంటోంది.."

'అవున్నాన్న. సర్వేనంబర్లు మార్చి చెరువులు, కుంతలు స్మశానాలు ఇలా ఒకటేమిటి ఈ రియల్ ఎస్టేట్ మాఫియా నగరంలో సగభాగాన్ని మింగేశారు . ఇప్పుడు వీటిమీద ప్రభుత్వం నిజంగా కన్నెర్ర చేసిందా? ఒకవేళ అదే కనుక నిజమైతే ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం వుండదు"

'నువ్వన్నది నిజమే కాని, అంత నిజాయితీగా ఏప్రభుత్వం వుంది చెప్పు అధికారంలోకి వచ్చేదాకా ఒక మాట , వచ్చిన తరువాత మరోమాట. సరే వాళ్ళ గోల మన కెందుకు గాని, నువ్వు మాత్రం కేసులు తీసుకోవాలి అని అనిపిస్తే పేదవాళ్ళవి మాత్రమే డీల్ చెయ్యి"

"అలాగే నాన్నగారు, అక్కడ ఉండెవాళ్ళ లో చాలామంది మధ్యతరగతి , దిగువ మధ్యతరగతి వాళ్ళే ,మీరు అంతలా చెప్పాలా??"

★★★

ఏమిటి ఈ రోజు లేటయ్యింది ?" లోపలికి వస్తున్న ఉమను అడిగాడు శంకరం

"ఇప్పటికన్నా వచ్చాను సంతోషించండి ..అసలు అక్కడ వాళ్ళు మమ్మల్ని వేల్లనిస్తే కదా ?"

" ఎవరు వాళ్ళు , ఎక్కడ ..సరిగా చెప్పు "

అదేనండి , ఈరోజు నుండి కోసి నది కుల్చివేతలు జరిగే చోటా డ్యూటీ వేసారు ..పాపమ వాళ్ళను చూస్తే కడుపు తరుక్కు పోతోంది .అందరు చిన్న చిన్న కుటుంబాల వాళ్ళే . పదో పరకో సంపాదించి ఇల్లు కట్టుకున్నారు .ఇప్పుడు వాళ్ళను ఖాళీ చేసి వేల్లమంతున్నారు . వల్లేమో వెళ్లనని . మమ్మల్ని వాళ్ళని ఖాళీ చేయించమని పైనుంచి ఆర్డర్స్ .ఏమి చెయ్యాలి "

"మరి చివరకి ఏమి చేసారు"

" ఏమి చేస్తాం మా పోలీసులకు బుర్రలుండవు కదా , పైన బాసు ఏమి చెపితే అదే ..పాపం వాళ్ళందరూ నన్ను తిట్టుకున్నారో ఏమో ?"

"అయినా ఇంత అర్జంటుగా ఎవ్వరికి చెప్ప పెట్టకుండా ఇలా కుల్చటం ఏమిటండి .మీరన్నా ఆపొచ్చు కదా "

"ఇది మరి బాగుంది ..నేనల ఆపుతాను "

"అదే మీరంటే మీ కోర్టులు .."

" కోర్టులా ... భలే చెప్పావులే ..ఉన్న కేసులే తేలక దుమ్ము పట్టి పోతున్నాయి కోర్టులన్ని ,ఇప్పుడు ఇవి కుడానా ?

" పాపమ అంది మీరన్న వాళ్ళ తరుపున కేసు వెయ్యండి '

" అదే చూస్తున్న ..కొంత మంది నా దగ్గరకి వచ్చారు ..కేసు వెయ్యమని ..కాని కేసు అంటూ వేస్తే బలంగా నిలబడాలి ...ఎందుకంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదా ..కోర్టు కుడా ఎప్పుడు కొట్టేద్దామా అని చూస్తుంది కేసుని "

(ఇంకా ఉంది )

# మనిషి కంపు కొడుతున్నాడు

ఈదర శ్రీనివాస రెడ్డి

మొన్నటి దాకా
మనిషి నడచిన దారులన్నీ
మట్టి వాసనలు
చెమట సువాసనలు
గుబాళించేవి
వాటిని శ్వాసించిన
ప్రకృతి పరవశంతో
పరిమళించేది
ఆనందంతో పులకరించేది

నిన్నటి దాక
మనిషి తిరుగాడిన జాడలన్నీ
డబ్బుచెదలు పట్టి
స్వార్థం పుట్టలు పెట్టి
చెత్త చెదారలతో నిండి
చివికి చీకి పోయి
రోత కంపు కొట్టాయి
పక్కనే పారుతున్న
స్వచ్ఛమైన సెలయేళ్ళు
పచ్చని పచ్చిక బయళ్ళు అన్నీ
దురాశల మురుగులో
మరుగున పడిపోయాయి

ఇప్పుడ మనిషి ఆనవాళ్లన్నీ
కులమతాల నీడల మధ్య

కుళ్లి కంపు కొడుతున్నాయి
మనిషితనం చచ్చిపోయిన
శరీరాలిప్పుడు
సగం కాలిన శవాల కంపుతో
గుప్పు మంటున్నాయి
స్మశానం లో దెయ్యాలు కుడా
భయపడి పారిపోతున్నాయి

ఈ నెల కథ

మొదటి బహుమతి
పొందిన కథ

# స్వాభిమానం

మొదటి పని మనిషి అంటే పని–మని (డబ్బు)–షి( ఆమె) అని ద్విభాషా జ్ఞానమున్న ఒక గడసరి వివరణ. ఆ భాష్యానికి మద్దతు పలుకుతున్నట్లుగా, కొందరు గృహిణులు చేసే నిందారోపణలు సుందరికి తెలియనివి కావు. కారణం, ఆమె పెరిగిన వాతావరణం అలాంటిది. ఆమె పుట్టి బుద్దెరిగిన నాటినుండి ఆమె చెవిన పడిన మాటలు, పనిమనిషిని మానాభిమానాలున్న స్త్రీగా, ఒక బాధ్యత గల యిల్లాలిగా గుర్తించనివే.

"డబ్బు కోసం పని చేస్తారు, మనం ఎంత బాగా చూసినా వాళ్ళకి కృతజ్ఞత వుండదు. టైముకు రారు, చెప్పిన పనుల్లో కొన్ని చేసి, కొన్ని చేయకుండా, టైమైందని పరిగెడతారు" అని ఒక యిల్లాలి విసుగు.

"మీ అమ్మాయి నయం, మానకుండా వస్తుంది, మా దొరసాని వారంలో రెండు రోజులు నాగా పెడుతుంది, ఎప్పుడు మానుతుందో తెలియదు, ఎప్పుడొస్తుందో తెలియదు. ఎదురు చూపులతో నాకు బిపి వచ్చింది" అని మరొక యిల్లాలి అసహనం.

"ఈ పని వాళ్ళతో, ముఖ్యంగా వయసులో వున్న వాళ్ళతో జాగ్రత్తగా వుండాలి. దొంగతనాలు చేసే వారు కొందరైతే, యేకంగా యింటాయనను వలలోవేసుకుని, కాపురాలు కూల్చే వారు కొందరు. మన జాగ్రత్తలో మనముండాలి" అని మరొక యిల్లాలి భయం.

ఇలా మాట్లాడే వారందరూ, సుందరి దృష్టిలో మానసిక స్వస్థత తక్కువైనవారే. అదే మాటని, తన స్నేహితుల దగ్గర ప్రస్తావిస్తూ, సుందరి ఒక సలహానిచ్చింది.

"చాలా మంది గృహిణులు, భర్తల సహాయ నిరాకరణ వల్ల, కుటుంబంలోని చికాకుల వల్ల, వుద్యోగం చేయడంలో వున్న ఇబ్బందుల వల్ల, మనసులో పేరుకుపోయిన ఆగ్రహాన్ని పనిమనుషుల మీద చూపిస్తూంటారు. ఉదయమే మాటపడడం, యెవరికి మాత్రం నచ్చుతుంది? ప్రభుత్వ పథకాలతో, జీవితాలు కాస్త మెరుగైన ఈ రోజుల్లో, పేదలు వారి స్వాభిమానాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు, ఆ కారణంగానే, చాలా యిళ్ళల్లో దర్శనమిచ్చే యిల్లాలు –పనిమనిషి జగడాలలో సింహ భాగం, స్వార్థం స్వాభిమానం మధ్య జరిగేవే. అందువల్ల పనిమనిషితో రుజువర్తనకు రెండు సూత్రాలను పాటించండి.

ఒకటి, ఆమె మనలాంటి స్త్రీ అని, ఆమె చేసే పని మనం చేసే వుద్యోగం లాంటిదని గుర్తించండి. రెండు. మనమేది యిస్తే అది మనకు తిరిగి వస్తుందని నమ్మి స్నేహంగా మసలుకోండి."

@@@



సుందరి తన ఆలోచనలకనుగుణంగా, తన దగ్గర పనిచేస్తున్నఅవ్వను, మర్యాదగా ప్రేమగా చూసుకుంది. ఆ అవ్వకూడా అంతే ప్రేమాభిమానాలతో పని చేసింది. అలా ఆరు నెలల పాటు, సాగిన వారి బంధం, అవ్వ అనారోగ్యం వల్ల ముగిసిపోయింది. అవ్వ పని మానేస్తూ," చిన్నవయసు, పెళ్ళైన ఒక అమ్మాయి వుంది. దాని పేరు రాణి. దానికి అభిమానం యెక్కువ. అనవసరంగా మాట పడదు. ప్రేమగా చూసుకుంటే, యింట్లో మనిషిలా పడిపడి చేస్తుంది. నీ దగ్గరైతే ఆ అమ్మాయికి కూడా బాగుంటుంది. రేపటినుంచి దాన్ని పంపిస్తాను." అని భరోసా యిచ్చింది.

@@@

రాణిని చూసి, సుందరి సందిగ్ధంలో పడింది. పిల్ల చూస్తే తారాజువ్వలా వుంది. ఈ పిల్లని పెట్టుకుంటే, నా నాధుడి ప్రవర్తన యెలా వుంటుంది? నా కొంప మునగదు కదా! అలాగని సందేహపడి పెట్టుకోకుంటే, పని చేసుకోవడం కష్టం. కాస్త వయసైన వాళ్ళు కావాలంటే, ఇప్పటికిప్పుడు యెవరు దొరుకుతారు? చాలా మంది, తక్కువ జీతాలిచ్చే చిన్న యిళ్ళలో పని చేయడానికి యిష్టపడరు. ప్రస్తుతానికి వేరే గత్యంతరం లేదని గ్రహించిన ఆమె," రా రాణీ! అని లోనికి ఆహ్వానించింది. అలా రాణి, సుందరి యింట పనిమనిషిగా చేరింది.

చెప్పిన సమయానికి వస్తూ, అక్కా, అక్కా అని కబుర్లు చెబుతూ, చురుకుగా పనులు చేసుకుంటూ పోయే రాణి పట్ల సుందరికి, త్వరలోనే ఒక సదభిప్రాయం యేర్పడింది. రెండు వారాలు గడిచేసరికి, రాణికి సుందరి, శశికాంత్ లతో చనువు పెరిగింది. ఆ చనువుతోనే ఆమె ఒకరోజు,

శశికాంత్ ని ఒక కోరిక కోరింది. .

" సర్! మీరు టీచర్ కదా! నాకు లెక్కలు ట్యూషన్ చెప్పి, నన్ను పదవ తరగతి పాసు చేయించండి" శశికాంత్ నవ్వి, " నేను స్కూల్ మాస్టార్ని కాదు. యూనివర్సిటీలో ఒక చిన్న ప్రొఫెసరుని"

" అయితేనేం సర్! ఒకప్పుడు మీరు చదివిందే గదా! మీరు కావాలంటే చెప్పగలరు."

" ఇంతకీ నువ్వు పరీక్ష వ్రాయకుండా చదువెందుకు మానేసావ్?"

" ఆడపిల్లని చదవనిస్తారా సర్! డిగ్రీ చదివి మంచి ఉద్యోగం చెయ్యాలని నా కోరిక. అలాంటి ఆలోచనలు పెట్టుకోవద్దని, పదవ తరగతి పరీక్షల ముందు పెళ్ళి చేసేసారు. నేను పరీక్ష పాసయితే నా మొగుడికి నామోషీ అంట. వాడు ఫెయిల్ అయ్యాడు గదా!"

" మరి యిప్పుడు పాస్ అయితే, వూరుకుంటాడా!"

"మామూలుగా అయితే వూరుకోడు. మా అత్త వాడికి నచ్చచెప్పింది. నువ్వు తాగుడుకు ముండలకు తగలెస్తే మాకు బ్రతకడానికి డబ్బు యెక్కడినుంచి వస్తుంది, దాన్ని చదువుకుని వుద్యోగం చెయ్యనీ అని గట్టిగా చెప్పి ఒప్పించింది"

" బాగుంది. కానీ మనకో సమస్య వుంది. ప్రొద్దున్నే వెళ్ళిన అక్క, సాయంత్రం వస్తుంది. తను లేనప్పుడు నేను నీకు పాఠం చెప్తే, నీ భర్త అనుమానించవచ్చు. మన అపార్టుమెంటులో వారెవరైనా చెడుగా అనుకోవచ్చు. శని ఆదివారాలు మాత్రమే చెప్తే, నీకు ప్రయోజనముండదు. ట్యూషన్ మాస్టార్లుంటారు కదా! వారిలో యెవరినైనా అడిగి చూడు ?"

"మీలా డబ్బు తీసుకుకోకుండా యెవరు చెప్తారు? ఇంక మాటలంటారా, వాచ్ మన్ అన్నకి చెప్తా. ఆయన చూసుకుంటాడు. రెండు నెలల్లో పరీక్షలున్నాయి. మీరు యివాళే మొదలుపెట్టండి." అని రాణి అభ్యర్ధించింది.
రాణిని చిన్నబుచ్చలేక శశికాంత్, భార్య అనుమతి తీసుకుని పాఠాలు చెప్పడం ప్రారంభించాడు. వాచ్ మన్ కి కూతుళ్ళున్నారు. అతను వారిని చదివిస్తున్నాడు. అందువల్ల కాబోలు, అతనికి రాణి చదువుకోవడం బాగా నచ్చింది. అతను శశికాంత్ పట్ల ప్రత్యేక గౌరవం ప్రదర్శించడం మొదలుపెట్టాడు.

రాణికి చదువు నేర్పించ డాన్ని, సుందరి మొదట్లో ఒక సత్కార్యంగా భావించింది. కానీ, రోజులు గడుస్తున్న కొద్ది, ఆమె గుండెలో గుబులు మొదలైంది. గురుశిష్యుల మధ్య పెరుగుతున్న చనువు, ఆమె మనసులో అనుమానపు బీజాన్ని నాటింది. లెక్కలు సరిగ్గా చెయ్యకపోతే మొట్టికాయలు తప్పవని శశికాంత్ అనడం, మీకు నేను దొరికితే కదా! అని రాణి పరిహాసమాడడం వంటివి చూస్తూంటే ఆమెకు ఒంటికి కారం రాసుకున్నట్టుంది. ఎలాగో సహనం వహించి, రాణి చదువుని సాగనిచ్చింది. మొత్తానికి రాణి పరీక్షలు వ్రాసి వుత్తీర్ణురాలైంది.

@@@

పరీక్షలు ముగిసిన తర్వాత, రాణి తన మానాన తను, పని చేసి వెడుతుండడంతో సుందరి మనసు తేలిక పడింది. ఆమెకు రాణి పట్ల అభిమానం పెరిగింది. ఈ రెండు నెలల కాలంలో, శశికాంత్, రాణితో పొరబాటుగా ప్రవర్తించిన దాఖలాలు లేక పోవడంతో ఆమెకు, భర్త పట్ల నమ్మకం పెరిగింది. అయితే ఆమె నమ్మకాన్నిప్రశ్నించే, సంఘటన ఒకటి, పరీక్షా ఫలితాలు వచ్చాక జరిగింది.

" శశికాంత్ సరదాగా," పరీక్ష పాసయ్యావు కదా! నాకు బహుమతి యేది?" అని రాణి నడిగాడు.

" నేనే మీకు బహుమతి. నాలాంటి స్టూడెంట్ మీకు దొరుకుతుందా?" అంది రాణి కిలకిల నవ్వుతూ.

వారి కళ్ళల్లో తొణికిసలాడుతున్న అభిమానం, ప్రేమ, సుందరి

మనసులో అలజడి రేపాయి . ఆమె అ రాత్రి, తన మనసులో మాటను భర్తతో చెప్పడమే మంచిదని భావించి, యిలా అంది.

“ శశీ! రాణి గురించి ఒక మాట. నువ్వు వేరే విధంగా అనుకోకూడదు.”
“ ఏమిటది” కుతూహలంగా అడిగాడు శశికాంత్.
“రాణి మిమల్ని భర్తగా భావిస్తూ, మీతో సరసంగా వుంటుందనిపిస్తోంది”.
“ఆమెకు భర్త వున్నాడు. కాపురం చేస్తున్నాడు. నన్ను భర్తగా అనుకునే అవసరమేముంది?”
“ యవ్వనంలో ఆడ పిల్లలు, కొందరు టీచర్లని, హీరోలని, ప్రేమించి ఆరాధిస్తారు. వాళ్ళని భర్తలుగా వూహించుకుంటారు. మానసికంగానేగాక, భౌతికంగా కూడా వారికి దగ్గర కావాలని కోరుకుంటారు.”
శశి కాంత్ కి ఆమె భయం అర్ధమైంది. కౌమార, యవ్వన దశలలో ఆడపిల్లలు ఆకర్షణని ప్రేమగా నమ్మి దగా పడి, పసి మొగ్గలుగా రాలిపోయిన కథలు అతనికి తెలియనివి కావు. ఒక ఆచార్యునిగా, నేను నా ధర్మం తప్పనని ఆమెలో విశ్వాసం కలిగించడం నా బాధ్యత అని తలపోసి అతనిలా అన్నాడు.

“అది టీనేజ్ పిల్లల వూహాలోకం. వయసుతో పాటు అది మాయమవుతుంది. రాణి మరీ అంత చిన్న పిల్ల కాదు. నేను అభిమానం చూపడం వల్ల నాతో చనువు పెంచుకుంది. నన్నొక స్నేహితుడిగా భావించి సరదాగా వుంటోందని నా నమ్మకం. అంతకు మించి ఇందులో చింతించాల్సినదేమీ లేదు.”

“అంతేలే” అని సుందరి నిద్రకుపక్రమించింది.

“ నా మనసు నిండా వుండేది ఎప్పుడూ నువ్వే. నా ప్రవర్తన వల్ల నువ్వు బాధపడే రోజు రానివ్వనని వాగ్దానం చేస్తున్నా” అని, శశికాంత్ ఆమెని ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు. తేలిక పడిన మనసుతో, సుందరి భర్త కౌగిలిలో ఒదిగిపోయింది.

@@@

పదిరోజుల తర్వాత, రాణి జీవితంలో ఒక విషాద సంఘటన చోటు చేసుకుంది. ఆమె భర్త ఫుల్లుగా త్రాగి, చెరువులో చేపలు పడుతూ, నీళ్ళలోకి జారిపడి మరణించాడు. ఆ వార్త తెలియగానే, శశికాంత్ సుందరితో కలిసి వెళ్ళి, రాణిని పరామర్శించి, అంత్య క్రియలకు కొంత డబ్బు యిచ్చాడు.

కార్యక్రమాలన్నీ ముగిసిన తర్వాత, ఒక రోజు రాణి, సుందరి దగ్గరకు వచ్చి పని మానేస్తున్నానని చెప్పింది. ఆ మాటకు, సుందరి నివ్వెర పోయింది.

“ ఎందుకు మానేస్తున్నావు? ఇంటరు చదవాలనుకున్నావు కదా! ఇక్కడైతేనే నీ చదువు సాగుతుంది. నువ్వు వెళ్ళడానికి నేను ఒప్పుకోను.” అని ధృఢంగా చెప్పింది

“వద్దు మేడం! నా వల్ల మీకు యెటువంటి కష్టం రాకూడదు.”

“ నాకా! నేనెప్పుడైనా నిన్నొక మాట అన్నానా?”

“అనలేదు మేడం! కానీ అనే పరిస్థితి రాకూడదు కదా!

“ ఎలా వస్తుంది? చెప్పకపోతే నా మీద ఒట్టు!”

“సారు అంటే నాకు చాలా యిష్టం. అలాగే మీరంటే కూడా. ఇన్నాళ్ళు నేను సారుతో చనువుగా వున్నా, మొగుడున్నాడు కాబట్టి ఎవ్వరూ తప్పు బట్టలేదు. రేపు ఎవరైనా మొగుడు లేనిది, సారుని బుట్టలో వేసుకుంటోందని అంటే భరించలేను. అక్కకే ద్రోహం తలబెడతావా అని, ఎవరో ఒకరు దెప్పి పొడవకముందే, వెళ్ళిపోవాలి. నా గౌరవాన్ని, మీ ప్రేమని కాపాడుకోవాలంటే, ఇదే సరైన నిర్ణయం”.

““ఎక్కడకి పోతావు. అత్తింటికా, పుట్టింటికా?”
“ పెళ్ళి చేసాక పుట్టిల్లు, మొగుడుపోయాక అత్తిల్లు, వుంటాయా? నా స్నేహితురాలు చెన్నయి రమ్మంటోంది. అక్కడే పని యిప్పిస్తానంది. వెళ్ళొస్తానక్కా!”

రెండు చేతులు జోడించి, గుండెపై

ఆనించి, యెదను మెలిపెడుతున్నబాధ, తన కనులలో సుందరికి కనబడకూడదని, తలవంచుకుని, నిలబడ్డ రాణిని చూసి సుందరి నవ్వుకుంది. ఆమె రాణి చుబుకాన్ని పట్టుకుని, తల యెత్తి, ఆమె కన్నులలోకి చూస్తూ, వాత్సల్యంతో యిలా అంది.

"నీ భయం నాకర్థమైంది. కానీ నాకొక నమ్మకముంది. నీలా ప్రేమించేవారు, స్వాభిమానం కలవారు తప్పు చెయ్యరు. నిన్ను ఈ దుర్మార్గపు ప్రపంచంలోకి పోనివ్వను. ఈ రోజు నుంచి నేను, సొంత అక్కలా, నీ బాధ్యత తీసుకుంటాను. నిన్ను గ్రాడ్యుయేటుని చేసి, నీకు వుద్యోగం వచ్చాక, మంచి అబ్బాయిని చూసి పెళ్ళి చేస్తా. కాదు, కూడదు వెడతానంటే, కాళ్ళు విరగ్గొడతా."

సుందరి మాటలకు రాణి అప్రతిభురాలైంది. బదులు చెప్పలేని మూగదానిలా ఒక నిమిషం అలాగే వుండిపోయింది. ఎడారిగా మారిన తన జీవితం లోకి వసంతం వచ్చిందని భావించింది. అక్క నీడలో, సారు ప్రోత్సాహంతో చదువు, సంస్కారాలని పెంపొందించుకోవచ్చని మురిసిపోయింది. కృతజ్ఞతా భావంతో ఆమె మనసు సాగరమై పొంగింది. కన్నీళ్ళు సుడులు తిరుగుతూ బయటికి వస్తూంటే, ఆమె సుందరి పాదాలు తాకి నమస్కరించబోయింది. సుందరి ఆమెను వారించి, ఆప్యాయంగా కౌగలించుకుంది. రాణి స్వాభిమానానికి, సుందరి ఔదార్యానికి శశికాంత్ ముగ్ధుడయ్యాడు.

@@@@@

## భారత న్యాయ దేవత



మన దేశంలోని ప్రతీ కోర్టులో న్యాయదేవత విగ్రహం ఉంటుంది. చిన్న స్థాయి కోర్టు నుంచి మొదలుకుని.. దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టులో ఈ న్యాయ దేవత విగ్రహాన్ని ఉంచుతారు. అయితే ఎప్పటినుంచో ఆ న్యాయ దేవత విగ్రహం అనగానే మనకు కొన్ని గుర్తులు.. గుర్తుకువస్తాయి. ఎప్పుడూ న్యాయ దేవత కళ్లకు నల్లటి వస్త్రం కట్టి ఉంటుంది. ఇక ఎడమ చేతిలో ఒక కత్తి.. కుడి చేతిలో ఒక త్రాసు కనిపిస్తూ ఉంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా న్యాయ దేవత అంటే మనకు ఇవే గుర్తుకు వస్తాయి. చట్టానికి కళ్లు ఉండవని.. దానికి గుర్తుగానే కోర్టుల్లో ఉండే న్యాయ దేవత విగ్రహానికి ఉండే కళ్లను గంతలతో కడతారని మనం ఇప్పటివరకు విన్నాం.

# మేరా భరత్ మహాన్

అంతేకాకుండా ఎన్నో సినిమాల్లో చూశాం. న్యాయ దేవతకు కళ్లు ఉండవని, చెవులు కూడా వినిపించవని పేర్కొంటారు. ఎందుకంటే డబ్బు, అధికారాన్ని బట్టి.. నిందితులకు చట్టాలు, తీర్పులు ఉండవని.. న్యాయ దేవత ముందు అందరూ సమానమేనని చెప్పేందుకే అలా ఉంచారు.

మనం కోర్టుల్లో చూసే న్యాయ దేవత జస్టియా అనే గ్రీకు దేవత. జస్టిస్ అనే పదం నుంచి జస్టియా అనే పేరు వచ్చింది. 17వ శతాబ్దంలో ఒక బ్రిటిష్ కోర్టు అధికారి ఈ జస్టియా విగ్రహాన్ని మొట్టమొదటిసారిగా మన దేశానికి తీసుకువచ్చారు. ఆ తర్వాత 18వ శతాబ్దంలో బ్రిటిష్ కాలంలో న్యాయ దేవత విగ్రహాన్ని కోర్టుల్లో ఉంచగా.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అదే విగ్రహం కొనసాగుతూ వచ్చింది.

న్యాయదేవత కళ్లకు గంతలు తొలగాయ్. అవును మీరు చదువుతుంది నిజమే. ఇన్నాళ్లూ భారతదేశంలో న్యాయ దేవత విగ్రహం కళ్లకు గంతలు ఉండేవి. ఇకపై న్యాయదేవత కళ్లకు గంతలు ఉండకూడదని దేశ అత్యున్నత ధర్మాసనమైన సుప్రీం కోర్టు నిర్ణయించింది. ఆ నిర్ణయానికి అనుగుణంగా.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఆదేశాలతో సుప్రీం కోర్టులో కొత్తగా న్యాయదేవత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

అత్యున్నత ధర్మాసనంలో ఏర్పాటు చేసిన న్యాయదేవత విగ్రహం కళ్లకు గంతలు లేకపోవడంతో ఈ అంశం వార్తల్లో నిలిచింది. అంతేకాదు.. ఇన్నాళ్లూ న్యాయ దేవత రెండు చేతుల్లో.. కుడి చేతిలో న్యాయానికి ప్రతిబింబంగా నిలిచే త్రాసు, ఎడమ చేతిలో ఖడ్గం ఉండేవి. సుప్రీం కోర్టులో కొత్తగా ఏర్పాటు చేసిన న్యాయ దేవత విగ్రహం ఎడమ చేతిలో ఖడ్గానికి బదులుగా రాజ్యాంగం ఉండటం గమనార్హం. అదేవిధంగా కొత్త న్యాయ దేవత భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా చీర కట్టులో కనిపిస్తుంది .

సుప్రీం కోర్టులోని జడ్జీల లైబ్రరీలో ఈ విగ్రహాన్ని ఉంచారు. న్యాయం గుడ్డిది కాదని, చట్టానికి కళ్లున్నాయని బలమైన సంకేతమిచ్చే ఉద్దేశంతోనే న్యాయదేవత విగ్రహంలో సుప్రీం కోర్టు ఈ మార్పులుచేర్పులు చేసింది.
అయితే
ఇన్నాళ్లూ న్యాయదేవత విగ్రహం కళ్లకు గంతలు కట్టడం, చేతిలో ఖడ్గం ఉంచడం వెనక కారణం లేకపోలేదు. చట్టం ముందు అందరూ సమానమే.. న్యాయస్థానం డబ్బు, అధికారం.. ఇతర హోదాను చూడదు" అనే సందేశమిచ్చేందుకే న్యాయదేవత విగ్రహం కళ్లకు గంతలు కడతారు. ఇక.. చేతిలో ఉంచే ఖడ్గం విషయానికొస్తే.. అన్యాయాన్ని న్యాయదేవత చీల్చిచెండాడుతుందని సంకేతం ఇచ్చేందుకు ఇలా న్యాయదేవత విగ్రహం చేతిలో ఖడ్గాన్ని ఉంచారు.

ఇంత గొప్ప అర్థం ఉన్నప్పుడు మరి న్యాయదేవత విగ్రహంలో మార్పులు ఎందుకు చేశారనే సందేహం కలగడం సహజం. బ్రిటీష్ ఛాయల నుంచి భారతదేశ న్యాయ వ్యవస్థ బయటపడాలనే ఉద్దేశంతో పాటు.. చట్టం గుడ్డిది కాదని, రెండు కళ్లు తెరిచి అందరినీ సమానంగానే చూస్తుందని చాటి చెప్పే ఉద్దేశంతో జస్టిస్ చంద్రచూడ్ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించినట్టు సమాచారం.

అయితే న్యాయం మనదేశం లో ఒక రకంగా ,విదేశాల్లో ఒకరఁఅకన్నా ఉండదు కదా , ఈ మార్పు అవసరమా అని కొంత మంది వాదించే వాళ్ళు ఉన్నారు .ఇటీవల మన చట్టాల్లో కూడా మార్పులు తీసుకురావటం జరిగింది , బహుశా దానికి ఇది కొనసాగింపు ఏమో ?

★★★

ఈ నెల కథ

# పాప క్షయం

మొదటి బహుమతి పొందిన కథ

నన్ద త్రినాధరావు

పరంధామయ్య గారి మనసు అన్యమనస్కంగా ఉంది. ఆయనకి జీవితం పై విరక్తి కలుగుతోంది. తనకి చచ్చిపోవాలని ఉంది. తను ఎవరికోసం బ్రతకాలి? భార్య చనిపోయింది. కొడుకు చెరసాల పాలయ్యాడు. ఎవరూ లేని అనాథ గా మిగిలిపోయాడు తను!

ఆయన ఆలోచనల్లోకి రాము మెదిలాడు లీలగా. తనెంత దుర్మార్గుడు! తన వలన అన్యాయంగా ఒకరి నిండు జీవితం నాశనమయ్యింది! నిజానికి తను కావాలని చేయలేదు. అనుకోకుండా అది అలా జరిగిపోయింది.

రాము చాలా మంచి కుర్రాడు. తరగతి లో అందరి పిల్లలకంటే బాగా చదివే వాడు. రాము, వేణు స్నేహితులు. వేణు జులాయి. చదువులో మొద్దు. తను ఎంతగా మందలించినా, తిట్టినా వేణుకు చదువు అబ్బేది కాదు.

పిల్లల చదువులెలా ఉన్నా, క్రమ శిక్షణ విషయంలో పరంధామయ్యగారు కాస్త కఠినంగా వ్యవహరించేవారు. పిల్లలు బాగా చదవక పోయినా పర్లేదు. క్రమ శిక్షణ తప్పితే మాత్రం తను ఊరుకునేవాడు కాదు.

ఆయన తరగతి గదికి వచ్చాడంటే పిల్లలందరికీ చాలా భయంగా ఉండేది. అతి నిశ్శబ్దంగా ఉండేది తరగతి గది. తనకి పాఠాలు చెప్పడంలో ముప్పయ్యేళ్ల అనుభవముంది. తను పాఠం చెప్పాడంటే ఎవరికీ ఎలాంటి అనుమానాలు వచ్చేవికాదు. అంత బాగా పాఠం చెబుతాడు తను.

తను చదువు చెప్పడంలో ఎంత శ్రద్ధ తీసుకుంటాడో, పిల్లల్ని క్రమశిక్షణలో ఉంచడంలో కూడా అంతే శ్రద్ధ తీసుకునేవాడు. తను పిల్లలపై ఎప్పుడూ చేయి చేసుకునేవాడు కాదు. మాటలతో, చూపులతోనే వాళ్ళకి బుద్ధొచ్చేలా వ్యవహరించేవాడు. అయినా పిల్లలు తనను చూసి భయపడేవాళ్లు.

తన తరగతి లో పిల్లలు అల్లరి చేయడానికి లేదు. కనీసం తల కూడా అటూ ఇటూ తిప్పకూడదు. ముఖ్యంగా అమ్మాయిల విషయంలో తను చాలా కఠినంగా ఉండేవాడు. అబ్బాయిలు అమ్మాయిల వైపు చూడటం, మాట్లాడటం చేసారంటే ఆరోజు వాళ్లకి గుంజీలు తీయించటం, గోడ కుర్చీలు వేయించటం, ఇంకా ఎండలో నిల్చో బెట్టటం వంటి చిన్న చిన్న శిక్షలు వేసేవారు ఆయన!

ఒకరోజు మాత్రం రాము తనకి దొరికిపోయాడు. ఓ ప్రేమలేఖ రాసి ఓ అమ్మాయి పుస్తకాల సంచీలో పెట్టాడు. ఆ అమ్మాయి సరాసరి ప్రధానోపాధ్యాయునికి ఫిర్యాదు చేసింది.

ప్రధానోపాధ్యాయులు తనను మందలించటంతో తనకి ఎక్కడ లేని కోపం వచ్చేసింది రాము మీద.

అంతే! రాముని గట్టిగా మందలించాలని తరగతి గదికి వచ్చాడు పరంధామయ్య గారు. కానీ అసలే పిరికివాడయిన రాము భయంతో తరగతి గదిలోంచి బయటికి పారిపోయాడు. అలా పారిపోతూన్న రాము, ఎదురుగా వస్తూన్న లారీని గమనించకపోవటం, అది సరాసరి రాముని గుద్దటం, అతడు కింద పడిపోయి వెన్నుపూస విరిగి పోయి, శాశ్వతంగా చక్రాల కుర్చీకి అంకితమవడం అన్నీ జరిగిపోయాయి.

అయితే రాము తల్లి దండ్రులు బాగా పేదవాళ్ళు కావటంతో పెద్దగా గొడవలేమీ జరగలేదు. పాఠశాల తరఫునుండి కొంత డబ్బు వాళ్ళకి ముట్ట జెప్పారు.

ఆరోజు పరంధామయ్యగారు చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చారు. ఆయన్ని ఉరుకోబెట్టడం ఎవరి తరం కాలేదు. తను పాపం చేసినట్టు కుంగిపోయారు.

రాము ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చిన తర్వాత, రాము అమ్మా నాన్నలని పరామర్శించటానికి వెళ్లారు పరంధామయ్యగారు.

రాము తల్లి దండ్రులు, జరిగిన ఘోరం గుర్తు తెచ్చుకొని భోరుమని విలపించారు. ఆయన వాళ్ళకి నచ్చ జెప్పటానికి చూసారు.

"అయ్యా, మీరు మాత్రం ఏం చేస్తారు? మా అబ్బాయి చేసింది తప్పే. వాడ్ని బుద్ధిగా చదువుకోరా అని బడికి పంపిస్తే, వాడు ప్రేమ లేఖలు రాసి అమ్మాయిలకు ఇవ్వడం తప్పే. ఇందులో మీ తప్పు కూడా లేదు అయ్యా. రాముకి మీరు బుద్ధి చెప్పాలని చూసారు. అది కాస్తా వికటించింది. ఇందులో ఎవరి తప్పూ లేదు. అంతా మా ప్రారబ్ధం అంతే" అని బొటా బొటామని కన్నీరు కార్చారు.

పరంధామయ్యగారు విషణ్ణ వదనంతో తిరుగుముఖం పట్టారు.
ఇది జరిగిన కొన్ని రోజులకి ఆయనకి అసలు నిజం తెలిసింది. ఆ ప్రేమ లేఖ రాము రాయలేదు. వేణు రాము పేరుతో రాసి ఆ అమ్మాయి సంచీలో పెట్టాడు.

వేణు స్వయంగా తనకి చెప్పేసరికి తనకి కోపం నషాళానికి అంటింది. వేణుని గట్టిగా మందలించారు. దాంతో వేణు కోపంతో, ఆ రాత్రికి రాత్రే ఇంట్లోంచి పారిపోయాడు.

అప్పటికి తనకు భార్యే లేదనుకున్న పరంధామయ్య గారికి, ఇప్పుడు కొడుకు కూడా లేకుండా పోయాడు.

'పండిత పుత్ర పరమ శుంఠ' అన్నట్టు వేణు తన సొంత కొడుకే అయినా అతనికి చదువు అబ్బలేదు. జులాయి తిరుగుళ్లకు అలవాటు పడ్డాడు. ధూమపానం, మద్యం సేవించటం, అమ్మాయిల వెంటబడటం తో పాటూ చిన్న చిన్న దొంగ తనాలు కూడా చేస్తూ పట్టుబడి చెరసాల పాలయ్యాడు.

ఆలోచనల్లోంచి బయటకొచ్చిన పరంధామయ్య గారి మనసు కకావికలమయ్యింది. తన కొడుకు చెరసాల పాలవ్వడం కంటే ఆయనని ఎక్కువుగా బాధించింది రాము శాశ్వత అంగ వైకల్యం మాత్రమే!

★★★

అక్కడో పెళ్లి జరుగుతోంది. ఆకాశమంత పందిరి కాకపోయినా ఉన్నంతలో చిన్న పందిరి వేశారు. పచ్చని తోరణాలు కట్టారు. వాటితో ఆ ఇంటికి పెళ్లి కళ వచ్చేసింది. పెళ్ళికి వచ్చిన చుట్టాలు, బంధువులు అంతా హడావిడిగా అటూ ఇటూ తిరిగేస్తున్నారు. పెళ్లి కూతురు ముస్తాబులో ఆ అమ్మాయి మెరిసి పోతోంది.

ఇంతలో పంతులు గారు వచ్చి, పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేసారు. పెళ్లి తంతు, మంత్రోచ్చారణ మొదలయ్యాయి.

ఇంతలో పెళ్లి కొడుకు తండ్రి వచ్చి, "పంతులూ, మంత్రాలూ ఆపవయ్యా. ఒరే పెళ్లి కొడకా, పైకి లేవరా. ఈ పెళ్లి జరగదు" అంటూ హుకుం జారీ చేసాడు.

అంతే! పంతులు గారు మంత్రాలు ఆపేశారు. భజంత్రీలు ఆగిపోయాయి. ఏం జరిగిందో తెలియక పెళ్ళికి వచ్చిన వాళ్లంతా తెల్ల మొహాలు వేసుకొని చూస్తున్నారు.

పెళ్లి కొడుకు పైకి లేచాడు. అప్పటి వరకూ నవ్వుతూ తుళ్ళుతూ ఉన్న పెళ్లి కూతురి మొహంలో విషాదం అలముకుంది. ఏ క్షణానయినా వర్షించే మేఘాల్లా ఉన్నాయి ఆమె కళ్ళు.

ఈ విషయం తెలిసి పరుగు పరుగున వచ్చాడు పెళ్లి కూతురి తండ్రి. వచ్చీ రావడంతోనే వియ్యంకుడి కాళ్లపై పడి పోయాడు.

"బావగారూ, నన్ను క్షమించండి. మీకు ఇస్తానన్న కట్నం బాకీ డబ్బులు ఇప్పుడు నేనివ్వలేకపోయాను నిజమే! దయచేసి ఈ పెళ్ళాపకండి! నా కూతురి జీవితం నాశనం చేయకండి. నాకు కొన్ని రోజులు గడువివ్వండి. నా తల తాకట్టు పెట్టయినా మీ డబ్బులు మీకు పువ్వుల్లో పెట్టిస్తాను. నన్ను నమ్మండి బావ గారూ..." అంటూ కాళ్లావేళ్లా పడ్డాడు.

పెళ్లి కొడుకు తండ్రి ససేమిరా అన్నాడు. "చూడండి బావగారూ, మీరు ఎప్పుడయితే నాకు బాకీ కట్నం డబ్బులు ఇస్తారో, అప్పుడే మావాడు మీ అమ్మాయి మెళ్ళో తాళి కడతాడు అంతే..." అంటూ గట్టిగా చెప్పేసాడు.

పెళ్లి కూతురు తండ్రికి ఏం చేయాలో అర్థం కాలేదు. వియ్యంకుడ్ని ఎంత బతిమిలాడినా అతడు కరగలేదు. పెళ్లి కూతురి కళ్ళు జలధారలయ్యాయి. ఆమె చీర కన్నీళ్లతో తడిసిపోయింది. పెళ్ళికి వచ్చిన కొంతమంది బంధువులు, పెద్దలు, పెళ్లికొడుకు తండ్రికి నచ్చజెప్పినా ఆయన వినలేదు. ససేమిరా అన్నాడు. ఇక వాళ్ళు పెళ్లి పందిట్లోనుంచి వెళ్లిపోయే క్షణంలో అప్పుడొచ్చాడు ఒకాయన!

ఆయన చేతిలో నోట్ల కట్టలు! అవి పెళ్లి కొడుకు తండ్రి చేతుల్లో పోశాడు. పెళ్లి కొడుకు తండ్రి మొహం సంతోషంతో వెలిగిపోయింది. పెళ్లి కూతురు తండ్రి ఆనందానికి హద్దులు లేవు. అంతే ధూమ్ ధామ్ అని పెళ్లి జరిగిపోయింది.

అందరితో పాటూ భోజనాలకి కూర్చున్నారు పరంధామయ్య గారు.

పెళ్లి కూతురు తండ్రి ఆయన చేతులు పట్టుకొని, "అయ్యా, మీరు చేసిన సాయం నేను ఈ జన్మలో

తీర్చుకోలేను. ఇవి చేతులు కావు కాళ్ళనుకోండి. ఎందుకు అయ్యా మాకు ఇంత పెద్ద సాయం చేశారు?" అంటూ కళ్ల నీళ్ల పర్యంతమయ్యాడు.

పరంధామమయ్యగారి మనసు చలించిపోయింది.

"చూడయ్యా, నేను ఎవరూ లేని అనాథని! నేను మీ రాము విషయంలో చాలా అన్యాయం చేసాను. అది నా మనసుని అనుక్షణం దహించి వేస్తోంది. కనీసం నేను పదవీ విరమణ అవ్వగా వచ్చిన ఈ డబ్బు తో అయినా మీ అమ్మాయి పెళ్లి జరిగితే నాకు సంతోషంగా, కాస్త మనశ్శాంతి గా ఉంటుంది" అన్నారు విషణ్ణ వదనంతో. పాప క్షయం తో ఆయన మనసు కాస్త శాంతించింది.

నూతన దంపతులని ఆశీర్వదించి బరువెక్కిన హృదయంతో వెను తిరిగారు పరంధామయ్య గారు.

+++

ఈ నెల కథ

## అపుత్రస్య గతిర్నాస్తి

రెండవ బహుమతి పొందిన కథ

మూలా వీరేశ్వర రావు

హాస్పిటల్ లో కూర్చుని ఆలోచిస్తోంది పరిమళ ఎం చేయ్యాలా అని మాటిమాటికీ భర్త మాటలే గుర్తుకు వస్తున్నాయి.
“చూడు! మా ఇంటి ఆచారం ఏమిటంటే మొదటి బిడ్డ మగబిడ్డని కనాలి. మా ఇంట్లో అందరికీ, మా అన్నకి పెద్దనాన్నకీ మొదట మగబిడ్డే! అపుత్రస్య గతిర్నాస్తి ఆడపిల్ల పుడితే ఎవరికెనా ఇచ్చేయ్ ఆడపిల్లతో ఈ గుమ్మంలో అడుగుపెట్టకు పుట్టింట్లోనే వుండాలి
పరిమళ ఆలోచిస్తుంటే డాక్టర్ వచ్చింది.
“ఏమిటలా డల్గా వున్నావు. కాస్త హుషారుగా ఉండాలి? నీరసంగా వుంటే పిల్ల నీరసంగా పుడుతుంది” అంది డాక్టర్
“ పుడతాడు అనండి డాక్టర్”
“ఏం అడపిల్ల పుట్టకూడదా! ఆడదీ కనేటప్పుడు ఆడది ఎందుకు పుట్టదు ? మీవారికి మగపిల్లాడు కావాలంటే మగపిల్లవాడిని అయన్నే కనమనండి” నవ్వుతూ చెప్పింది.
పరీమళ డాక్టర్ జోక్ కి కొంచెం రిలీఫ్ పొందింది.
మరి కొద్దిసేపటికే పరిమళకి నొప్పులు ప్రారంభమయ్యాయి.

★★★★★★★

పరిమళకి ఆడపిల్ల పుట్టింది. పిల్లని చూడ గానే ఆనందం, భర్త మాటలు గుర్తుకువచ్చి. దుఃఖం ఒకేసారి కలిగాయి. డాక్టర్ అడిగింది ఎందుకలా వున్నావని. తన పరిస్థితి చెప్పుకుంది పరిమళ.

డాక్టర్ ఒక పరిష్కారం చెప్పింది. "రంగారావు దంపతులు పిల్లలు లేరని నా దగ్గరికి వచ్చారు. చివరికి దత్తత తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. వాళ్ళకి నీ పిల్లని ఇస్తాను. ఏమంటావు?"

సరేనని తల ఊపింది. రంగారావు దంపత లకి పరిమళ పిల్లని ఇచ్చింది. ఈ విషయం గోప్యంగా వుంచమంది. పరిమళ భర్త వెంకట్రా వుకి పిల్ల పురిటిలోనే పోయిందని చెప్పింది. డాక్టర్. తన కాపురం నిలబెట్టినందుకు చేతులు జోడించింది పరిమళ డాక్టర్కి.

★★★★★★★★

రెండేళ్ళ తరువాత పరిమళకి మగ పిల్లవాడు పుట్టాడు. వెంకట్రావు ఆనందానికి పగ్గాలులేవు. పరిమళని చాలా ప్రేమగా చూసుకుంటున్నాడు! ఇంటి పనులన్నీ తనే చేస్తున్నాడు. పిల్లాడు పుట్టినందుకు ఆనందంగా వున్నా మొదటి బిడ్డ అనే మమకారం కలుక్కు మంటోంది. మాటిమాటికీ పాప గుర్తుకువస్తోంది పరిమళ కి.

★★★★★★★★★

పదిహేడేళ్ళు గడిచాయి. వెంకట్రావు పిల్లాడు చక్రధర్ డిగ్రి ఫస్ట్ ఇయర్లోకి వచ్చాడు. నక్సలైట్ ఉద్యమానికి ఆకర్షించ బడ్డాడు. ఇల్లు వదిలివెళ్లిపోతానన్నాడు.

"వద్దురా. చక్కగా డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగం చూసు కోరా" అని పరిమళ నచ్చచెప్పింది. వెంకట్రావు కూడా బతిమాలాడు.

చక్రధర్ వినలేదు. ఒకరోజు కొంత డబ్బుతో ఇంట్లోంచి పారిపోయాడు. ఏడాది తరువాత ఆదిలా బాద్ అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్లో చక్రధర్ మరణించినట్టు వార్త వచ్చింది పేపరులో

వెంకట్రావు ఆ వార్త విని కుప్పకూలిపోయాడు. కొరివి పెడతాడనుకున్న కొడుక్కే కొరివి పెట్టవలసి వచ్చిందని వెంకట్రావు దుఃఖంతో చిక్కిపోసాగాడు.

పరిమళ దుఃఖం ఎక్కువయింది. మొదటి బిడ్డ మళ్ళీ కనిపిస్తే బాగుండునని అనుకుంటోంది.

★★★★★★★★

ఒకరోజు బజార్లో పరిమళకి డాక్టర్ కనిపించింది. చక్రధర్ చనిపోయాడని తెలిసి చాలా బాధపడింది.

"మీరు ఆడపిల్లను నాకిచ్చారు కదా. రంగారావు దంపతులు ఆమెకి సౌగంధి అని పేరు పెట్టారు. తరు వాత వాళ్ళు అమెరికా వెళ్లిపోయారు. నేను కూడా ఆమె రికా వెళ్లిపోయాను. వాళ్ళు వచ్చేనెల ఇండియాకి వస్తు న్నారు. ఇప్పుడు మీ అమ్మాయి అమెరికాలో ఎంబిఏ పూర్తిచేసి నెలకి మూడు లక్షల రూపాయల ఉద్యోగం తెచ్చు కుంది. వాళ్ళు వచ్చాక నేను వాళ్ళని తీసకువస్తాను. మీ అడ్రస్ ఇవ్వు" అంది డాక్టర్ సుమ. పరిమళకి నోట మాట రాలేదు ఆనందంతో.
అడ్రస్ ఇచ్చింది. వాళ్లు ఎప్పుడు ఇండియాకి వస్తారా అని ఎదురుచూస్తోంది.

★★★★★★★

"ఏమండీ మీకో విషయం చెప్పవా?"

" చెప్పు" అన్నాడు వెంకట్రావు.

' "మొదట ఆడపిల్ల పుడితే మీరు రావద్దన్నారుకదా. నా కాపురం నిలుపుకోవడానికి ఆ పిల్లని దత్తతకు ఇచ్చాను

మీకు ఎదురు చెప్పలేక కన్నప్రేమను చంపు కుని" పరిమళ ఏడుస్తూ ఉండిపోయింది.

"నా మూర్ఖత్వానికి మంచి శిక్ష వేసాడు దేవుడు ఆడ, అయినా మగ అయినా మన పిల్లలే అన్న జ్ఞానం మరచి మూర్ఖంగా ప్రవర్తించాను. . ఆడపిల్ల అయితే కనీసం నాన్నా అని పిలుస్తుంది. మగపిల్లాడు డబ్బో అంటూ పీక్కుతింటాడు. నా కొలీగ్ బాబూరావు కొడుకుని చూసావు కదా" అంటూ బాధపడ్డాడు

వెంకట్రావు.

ఇద్దరూ సౌగంధి రాక కోసం ఎదురు చూస్తున్నారు.

ఒకరోజు వెంకట్రావు ఇంటిముందు కారాగింది.

కారు లోనుండి రంగారావు దంపతులు, డాక్టర్ సుమ, సౌగంధీ దిగారు.

కూతుర్ని చూడగానే పరిమళ మనస్సు ఆనందంగా వుంది. డాక్టర్ సుమ పరిమళని, వెంకట్రావుని అందరికీ పరిచయం చేసింది.

సౌగంధి తన కన్నతల్లిని చూసింది. మరలా వెంకట్రావుని చూసింది. ఒకరు పిరికితనానికి, మరొకరు మూర్ఖత్వానికి ప్రతీకలుగా కనిపించారు.

“నాన్నా” అని పిలిపించుకోవాలని వెంకట్రావు ఆరాటపడుతున్నాడు.

‘అమ్మా” అనిపించుకోవాలని పరమళ.
ఆరాటపడుతోంది.

పరిమళని ‘అమ్మా” అంది.
వెంకట్రావుని ‘నాన్నా’ అనలేదు.

“అదేమిటమ్మా?” అంది రంగారావు భార్య “పుట్టగానే వేరొకరికి ఇచ్చింది నా తల్లి. ఆడపిల్ల వద్దు అన్నాడు నా తండ్రి. వీళ్ళని చూస్తూ నేను ఉండలేను. మీరే నా తల్లీదండ్రి” అంది

సౌగంధి.

“నువ్వేకదా చూడాలన్నావు.”

“చూసాను. వెళదాం.

“సౌగంధీ! ఈ నాన్నని క్షమించమ్మా..మూర్ఖుడ్ని నిన్ను చిన్నప్పుడే దూరం చేసుకున్నాను”

‘క్షమించాలా. అవును ‘క్షమయా ధరిత్రీ’ అని ఒక పేరుందికదా. మీ మగవాళ్ళు స్కానింగ్ లో ఆడపిల్ల అని తెలితే. అబార్షన్ అంటారు. కట్నం తక్కువ అయితే చంపడానికి సిద్ధం. ఇలా ఆడజాతి క్షమించు కుంటూపోవడంతో మీ ఆగడాలు మితిమీరిపోతున్నాయి. క్షమకి అర్ధంలేదు , బయలుదేరుదాం నాన్నా” అంది సౌగంధి రంగారావుతో.

“క్షమించక్కర్లేదు. ఒక్కసారి నాన్నా అను తల్లీ” అన్నాడు వెంకట్రావు

“నాన్న కాదు అంకుల్. వస్తాను. ఎప్పుడైనాచూడాలనిపిస్తే చూసి వెళ్లిపోండి” అని సౌగంధి కారులో కూర్చుంది.

కారు కదిలింది.

కన్నీళ్లతో వెంకట్రావు, పరిమళ!

వెంకట్రావు కి గుండె నొప్పి వచ్చింది. పరిమళ చేతుల్లోనే తల వాల్చేసాడు.

పరిమళ కన్నీళ్ళు నేలమీద పడితే ‘నేను అర్ధం చేసుకున్నాను’ అన్నట్టు ఆ కన్నీళ్లని తనలో ఇముడ్చుకుంది.భూమాత.

★★★

సీరియల్






పాంఁడ్రంకిసుబ్రమణి

"వస్తే యేమవుతుందట?"అసహనంగా చూపులు సారిస్తూ అడిగాడు కామేశ్."ఎన్నో జరగవచ్చు.యేమైనా జరగవచ్చు" "ఎన్నో అని చెప్పి ఔటాఫ్ ది బాక్సులోకి తప్పుకోవడానికి చూడకు——ఒకటి చెప్పు యేమవుతుందో——"
"నాగురించి నేను చెప్పను గాని——మీది మండే స్వభావం,"
"ఐతే గనుక--"ఆమె చిలిపిగా నవ్వుతూ అంది–"ఇంకా అర్థం కావడం లేదా!"అర్థంకానట్టు తల అడ్డంగా ఆడించాడతను, అప్పు డామె ముందుకు వంగి గుసగుసలు పోయింది–"నాకు బల్జింగ్ స్టమక్ వచ్చేసినా వచ్చేస్తుందని వాళ్ళ భయం.నా వివరణ యిక చాలా!లేక యింకా పొడిగించనా?" ఆ ఒక్కమాటతో కామేశ్ పెద్దపెట్టున నవ్వసాగాడు.ఆపుకోలేకుండా నవ్వసాగాడు. అప్పుడక్కడకు పరుగు వంటి నడకతో దూసుకు వచ్చింది పార్వతి–"ఏమిట్రా అంతలావున నవ్వుతున్నావూ!ఊపిరి అందుకోవ డానికి వీలుగా కాస్తంత ఆగి నవ్వరా!
ఇంతకీ యెందుకు నవ్వుతున్నావో మాకు చెప్పవా!"అప్పుడతను యింకా నవ్వుతూనే కళ్ళతో సైగ చేసాడు

# ఫ్యామిలీ సీరియల్

**జరిగిన కథ**

శారద ,పూర్ణ చందర్ దంపతులు. శారదకు నాలుగు కాన్పుల్లో కుడా ఆడపిల్లలే పుట్టటం తో అత్త బద్రమ్మ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెడుతూ ఉంటుంది . శారద తల్లి చంద్రావతి మనుమరాళ్ళను చూడటానికి వస్తే ఆమెను కూడా నానా రకాల మాటలతో ఇబ్బంది పెడుతుంది . శారద సహనం కలది కాబట్టి ఏ గొడవలు లేకుండా కాపురం నెట్టుకొస్తోంది .చాల రోజుల తరువాత శారద అన్నయ్య ఫోన్ చెయ్యటం తో శారద ఆనందానికి అవధులేకుండా పోతాయి .పూర్ణ చందర్ ఫాక్టరీలో స్ట్రైక్ చేయించాడని ఉద్యోగంలో నుండి తీసివేస్తారు .శారద అన్న వివేక్ ,శారద ఇద్దరు కూతుళ్ళను తన దగ్గర చదివించటానికి తీసుకువేళతాడు .వివేక్ స్నేహితుడు గణేష్ అతని భార్య చనిపోవటం తో అతని కూతురు ప్రశాంతిని ఇంటికి తీసుకువస్తాడు

**ఇక చదవండి**

అమ్మతో చెప్పేదా– అన్నట్టు. చెప్పావంటే లెంపకాయ తగుల్తుందన్నట్టు చేయి చూపించింది మాన్విత. సంకేతం అందుకున్న కామేశ్ సభాళించుకున్నాడు–“మరేం లేదు–మాన్విత వాళ్ళకాలేజీ జోకొకటి చెప్తేనూ“

“అలాగా!నాకూ మీ కాబోయే మామగారికి కూడా అటువంటి కమ్మటి జోకొకటి చెప్పవూ!–“అంటూ వెళ్ళిపోయిందామె.

లవర్ రాకతో కొడుకు గదిలోయెంతటి అలికిడి!ఎంతటి సందడి!ఇదేకదూ యవ్వనప్రాయంలో వినిపించే రసరమ్య సరాగాలు!

మరి కాసేపటికి మాన్విత కాఫీ తీసుకుని బైటకు కదిలింది. ఆమెతో బాటు కామేశ్ కూడా లేచి హాలులో యేవో పేపర్లు చూసుకుంటూన్న భరద్వాజ్ వద్ద తీసుకు వచ్చాడు–“నాన్నా!మాన్విత గురించి ఒక మాట చెప్పాలి“ఉఁ అంటూ పేపర్లను ప్రక్క కు నెట్టి చూసాడు. “మాన్వితకు కోర్సు పూర్తయంది.మన మైనింగ్ కంపెనీలో ఇంటర్న్ గా చేర్చుకుంటే బాగుంటుందేమో!”

“ఎక్సలెంట్ ఐడియా రేపో యెల్లుండో ఆఫీసుకి రమ్మనమను. అనురాధ యెలాగూ ఉందిగా తోడుగా––ఈలోగా హెచ్చారమ్ మేనేజర్ కి పేపర్లు సిద్ధం చేసి ఉంచమను.ఇది గాని వింటే సూర్యవివేక్ హేపీగా ఫీలవుతాడు“

“థేంక్స్ అంకుల్!”అంటూ అతడి కాళ్ళకు నమస్కరించి కదలబోయింది.అప్పుడు భరద్వాజ్ ఆమెను ఆపాడు.”మన కంపెనీకి రెండు రకాల స్టాప్ పునాది రాళ్లుగా నిలుస్తారు.ఒకరిది–– బ్రిలియంట్ యెడ్యుకేషనల్ బ్యాక్ గ్రౌండ్.రెండవది–నమ్మకస్థులు. మీ మామయ్య దివంగత ప్రాణస్నిహితుడి కుమార్తె కూడా యింట్లో ఉందిగా–ఆమెది బ్రిలియంట్ అకాడమికి క్వాలిఫికేషన్ అని విన్నాను. పనిలో పనిగా ఆ అమ్మాయిని కూడా ఇంటర్న్ గా చేర్చుకోవచ్చుగా!” మాన్విత వెంటనే స్పందించింది. “మీరన్నట్టు ప్రశాంతికి బ్రిలియంట్ అకాడమిక్ నేపథ్యం ఉంది అంకుల్ !కాని ప్రశాంతి మొదటినుంచీ టీచర్ కావాలన్న పట్టుదలతో ఉంది. అంచేత మా వీధికి దగ్గరలో ఉన్న సెంట్రల్ సిలబస్ తో నడుస్తూన్న హయ్యర్ సెకండరీ స్కూలులో చేరడానికి నిర్ణయించుకుంది, మామయ్య కూడా ఒప్పుకున్నాడు. వెళ్ళి మాట్లాడి వచ్చాడు”

“దెన్ ఇటీజ్ ఓకే!ఇక నువ్వెళ్ళి రామ్మా!టూ వీలర్ పైన వచ్చినట్టున్నావు.జాగ్రత్తగా వెళ్ళి రామ్మా! మీ మామయ్యను అడిగానని చెప్పు“ మాన్విత అలాగే అంటూ మరచిపోకుండా పార్వతి వద్దకు వెళ్ళి సెలవు తీసుకుంది.

ఆరోజు రాత్రి భోజనాలయిన తరవాత,యింటి ఆవరణ చుట్టూ వీస్తూన్న పిల్లగాలుల మధ్య చిన్నపాటి నడక సాగించి వచ్చి పనావిడ తెచ్చిన పాలు మాత్ర బిళ్ళలతో తీసుకుని ఆ తరవాత కూడా కాసేపు కొన్ని ముఖ్యమైన పార్టనర్ షిప్పు అగ్రి మెంట్ పత్రాలు సరిచూసుకుని మంగళతో ఫోనులో మాట్లాడి కామేశ్ కి పక్కగదిలో ఉన్న పడకపైన మేనువాల్చాడు భరద్వాజ్. వెంటనే నిద్ర కమ్ముకొ చ్చింది. అర్ధరాత్రి దాటిన తరవాత భరద్వాజ్ కి చప్పున మెలకువ వచ్చింది. కళ్ళు నులుపుకుంటూ డిమ్ లైట్ లో చూసాడు. ఎప్పుడొచ్చిందో యేమో-- పార్వతి తన ప్రక్కన నిద్రపోతూంది.రెప్పవాల్చకుండా చూసాడు.ఈ మేని ఈ రూపం తనకు చిరపరిచితం, ప్రేమించి పెళ్ళి చేసుకున్న వివాహబంధం. ఇప్పుడతణ్ణి బిడియం వెనక్కి లాగుతూంది.తామిద్దరి మధ్యా యేర్పడ్డ ఈ యెడబాటు దూరతీరాన తాండవమాడుతూన్న ఒక దుస్వప్నంలా కనిపించడం లేదూ! ఇంతకీ ఇప్పుడా బంధం ఉందనాలా ముగిసిందనాలా! ఏమో—— అతడికి యేమీ పాలుపోవడం లేదు. ఆలోచనలను కట్టి పెడుతూ అతడు లేచి పార్వతి పైన దుప్పటి కప్పి గది మూలన ఉన్న సోఫాలోకి తరలి పోయాడు.

ఇక్కడ పరిస్థితి ఇలా ఉంటే- అక్కడ మంగళ ఇంకేమేమో ఊహించుకుంటూ ఉంటుంది. ఎటు చూసినా యే కోణంలోంచి తరచి చూసినా అతడికి తన తల్లే గుర్తుకి వస్తూంది.విచిత్రంలో కెల్లా విచిత్రం——తన రెండు పెళ్ళిల్లూ తన తల్లే జరిపించింది. జరిపించి జగన్నాటకంలోనుంచి నిశ్శబ్దంగా తప్పుకుంది.ఇంతకీ తను యేక పత్నీవ్రతుగా!లేక ఇద్దరు పెళ్ళాల మొగుడా!

మరునా డు ఉదయం టిపిన్ తీసుకుని కొడుక్కి మరో రెండు రోజులు విశ్రాంతి తీసుకుని మైనింగ్ కంపెనీ కార్యాలయా నికి రమ్మనమని పురమాయించి కారువేపు నడిచాడు భరద్వాజ్. అప్పుడక్కడ పార్వతి సెల్లో బాక్సుతో నిల్చుంది. "మధ్యాహ్నం భోజనానికి ఉంచాను.రేపట్నించి మీకు మంగళే పంపిస్తుంది" అతడు అర్థరహితంగా చూస్తూ బాక్సు అందుకున్నా డు. "ముందే చెప్పాగా!మీరు మీ కొడుకు కోసం వచ్చారని——నాకోసం వచ్చేవారు కాదని.ఎనీహౌ—— థేంక్స్-మాతో రెండు రోజులు కలిసి ఉన్నందుకు.నాకు కూడా టైమయింది బ్యాంకు హెడ్ క్వార్టర్సు వెళ్ళడానికి——నా కోసం అన్నయ్య యెదురు చూస్తుంటా డు." అంటూ ఆమె వెనక్కి తిరిగింది.నడుస్తూ వెళుతూన్న పార్వతి వేపు కొన్ని క్షణాలు పాటు తేరి చూస్తూ కారెక్కాడతడు.

అతడు కారులో కూర్చున్న తరవాత మనసు మూలన నిస్సారంతో తలపోసాడు;కొన్ని సంబంధాలు కరకట్ట దాటని తరంగంలా ఆగిపోతుందనుకుంటాడు మనిషి. కాని——అవి ఆగిపోకుండా పుంజుకుంటాయి,మరి కొన్ని సంబంధాలు సాగిపోతూనే ఉంటాయనుకుంటాడు మనిషి. కాని——అవి యెటూ తేలని రీతిన యెటూ తోచని దిక్కున సాగుతూ నాలుగు రోడ్ల కూడలి స్థలాన అనూహ్యంగా ఆగిపోతుంది.ఆ బంధం సాగుతుందో లేదో తెలియని రీతిన ఊరూ పేరూ తెలియన చోట నిలచిపోతుంది.బొమ్మను చేసి ప్రాణము పోసి యాతన చూచుట పైనున్నవాడికి వేడుకే కదా!అతడికి పోతన కళ్ళముందు మెదిలాడు- "గలడందుర రన్ని దిశలను—— కలడు కలండనెడువాడు కలడో లేడో!"

------------

ఎట్టకేలకు శారద కంట కన్నీరు నింపుకుంటూ కూతురు చెప్పిందంతా విని కామేశ్ కి మాన్వితను యిచ్చి పెళ్ళి చేయ దానికి సగం మనసుతో ఒప్పుకుంది.నిజానికి ఆమె ఆదిలో అనుమానించినట్లే జరిగింది. ఇంట్లోకి ప్రశాంతి రాక,అన్నయ్యను మామయ్యా అని వరస పెట్టి పిలవనారంభించడం-ఇవన్నీ తలచుకుంటే సర్వమూ యేదో నిర్దేశిత గణిత సూత్రం ప్రకారం కంచికి కథ చేరినంత పకడ్బందీగా జరగడం తన అంత:కరణానికి అద్దం పట్టడం లేదూ!నిజమే—— అన్నయ్య తనకెన్నడూ మాటివ్వలే దు తన యిద్దరు మేనగోడళ్ళనూ

యింటి కోడళ్ళుగా చేసుకుంటానని. వదిన కూడా మాటివ్వలేదు; ప్రయత్నిస్తానంది.అంతే-- పూర్తిగా సాఫల్యత పొందకపోయినా గుడ్డిలో మెల్లగా ప్రీతిని కోడలు పిల్లగా చేసుకోబోతూంది.అంతవరకూ నయమే--మొత్తానికి అన్నయ్య కుటుంబంతో తన సంబంధం తెగిపోదు.ఇప్పటికిది చాలు జన్మ సార్థకమవడానికి--ఆ భావస్రవంతి మనసు పొరను సోకినంతనే శారదలో ఆర్ద్రత వెల్లువై చోటుచేసుకుంది.అంతే కాదు-మొదట ప్రీతి పెళ్ళి జరిగిన తరవాతనే మాన్విత పెళ్ళి పీటల పైన కూర్చోవాలన్న తన కోరికను అన్నయ్య స్వీకరించాడు.ఎప్పుడేది చేసినా అన్నయ్య తన మంచికేగా చేస్తాడు!

అక్కడ విషయం అలా సాగుతుండగా ఇక్కడ సూర్యవివేక్ అదే పెళ్ళి విషయాన్ని భార్యతో చర్చిస్తూ మరొక దారి వేపు మెలిక తిప్పాడు.రాఘవ్ ప్రీతిల అదే పెళ్ళిరోజున అదే పెళ్ళి పందిరిలో సాయికృష్ణ ప్రశాంతిల పెళ్ళికూడా జరగాలి.ఆ మాట విన్నంతనే పావని సగం ఆశ్చర్యంతో సగం ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది."స్నేహితుడి పట్ల మీరు చూపిస్తూన్న కృతజ్ఞతా భావానికి అణువణువే నా తనువు పులకించిపోతూందండీ!" అని భర్తను గుండెలకు హత్తుకుంది. అప్పుడు సూర్యవివేక్ ఒకే ఒక మాటతో స్పందించాడు-"ఈ స్నేహభావమూ ఈ కృతజ్ఞతా భావము గురించీ చేసిన ప్రస్తావన ప్రక్కన పెట్టు.దీనికి హృదయ ద్వారాలు తెరచి బదులియ్యి. ప్రశాంతికి మనం తప్ప ఇంకెవరున్నారు? నిజానికి వాళ్ళ దూరపు బంధువులకు ఇప్పటికే రెండు మూడు సార్లు కబురంపాను ప్రశాంతి విషయం తేల్చుకుని పొమ్మని.ఎందుకో రిస్పాన్స్ రాలేదు. అదే--ప్రశాంతి మగ పిల్లాడయి ఉంటే వాళ్ళ రిస్పాన్స్ మరొక విధంగా ఉండేదేమో——ఇక ప్రశాంతి విషయానికి వస్తే-- మంచి అకాడమిక్ క్వాలిఫికేషన్స్ ఉన్నా,ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నా క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరు కాకుండా——ఇతర సర్వీసు కమీషన్ ఉద్యోగాలకై అప్లయ్ చేయకుండా మనకు దగ్గరగా మనలో ఒక్కతెగా ఉండాలని ప్రశాంతి యెందుకు మనూరి పొలిమేర తావునున్న స్కూలులో టీచరుగా చేరడానికి సిద్ధమైంది?"ఆమెకు బదులివ్వడానికి మాటలు కరువయ్యాయి.ప్రశాంతి సద్గుణ సంపన్నురా లు మాత్రమే కాదు,దూరచూపుతో భవిష్యత్తుని పరికించగల తెలివైనది కూడాను. నిజమే--ఆ పిల్లది అరుదైన గుణాంశమే! స్నేహశీలి దివంగత తండ్రికి తగిన తనయ కదూ!ఆడపిల్ల అలికిడి లేని తమింటికి అటువంటి అమృత హృదయి కోడలు పిల్లగా రావడం శ్రేయస్కరమేగా!చదువుల సరస్వతి ప్రీతికి తోడికోడలుగా పూవుకి తావిలా ప్రశాంతి జతచేరడం ఇంటికి శుభకరమేగా--

ఆవేశ ఆక్రోశాలకు అతీతంగా జరిగి,ఓసారి నిశ్చలంగా నిర్మలంగా ఆకాశ గోపురం వేపు చూపు నిల్పి ఆలోచిస్తే మనిషికి తెలుస్తుంది;జీవితం వివిధ దశల్లో యెదురయ్యే పలు మలుపులేనని,మార్పుల మణిహారమేనని——

కామేశ్ మైనింగ్ కంపెనీ సీనియర్ మేనేజర్లతో చేరి లాటిన్ అమెరికాకి గుండెకాయ వంటి బ్రెజిల్ దేశానికి బిజినెస్ పర్య టనపై వెళ్ళి పలు ముఖ్యమై వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకుని సుమారు ఇరవై రోజుల యెడబాటు తరవాత శంషాబాద్ విమానాశ్రయానికి విజయోత్సాహంతో చేరాడు.కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లు అతడికి యెదురు వెళ్ళి పూలమాలాంకృతుణ్ణి చేసి స్వాగతం పలికారు, కామేశ్ కళ్ళు వెతికాయి.అదిగో—— మాన్విత వాళ్ళకు యెడంగా ఆమడ దూరాన పూలగుచ్ఛంతో నిల్చుంది.అతడు వేగంగా దూసుకు వెళ్ళాడు-"హేయ్!ఇక్కడేమి చేస్తున్నావు?నువ్వు కదూ ౦దుండాలి!ఇంతకీ నువ్వెవరి వో తెలుసా?చీఫ్ బాస్ కి కా బోయే కోడలు పిల్లవు.ఇది కూడా నేనే చెప్పాలా!నీకు నీవు అసెర్ట్ చేసుకోవద్దూ!ఇప్పటికి నువ్వు ట్రైనీ ఇంటర్న్ వే,రేపు నీ స్థా నం యెలా గుంటుందో ఇక్కడి వాళ్ళకు తెలియనిదా!అలా యెడంగా ఒదిగి నన్ను డిస్సాప్పాయింట్ చేస్తున్నావు మాన్వితా--"

"నోనో!అటువంటి దేమీ లేదు కామేశ్ !వాళ్ళందరూ నన్ను ముందుండమనే పిలిచారు.నేనే

తొలగి నిల్చున్నాను.ఇప్పటికి నాకు న్న స్థానాన్ని నేను గుర్తుంచుకుని పదుగురులో పదిల పరచుకోవాలి కదా!ఎక్కడున్నా యెలా ఉన్నా ప్రొటోకల్ లాంఛనాలను ఉల్లంఘించ కూడదు కదా!అదే కదా,నాకిచ్చిన ట్రైనింగులోని ముఖ్య సారాంశం--"ఆమె యిచ్చిన దీర్ఘమైన వివరణకు అతడు నవ్వకుండా ఉండలేక పోయాడు."ఓకే ఓకే!నీవు చూపించే డిసెన్సీ డెకోరమ్ అర్థమైంది. నువ్విప్పుడు అందించిన పూలు నీలా యెంత తాజా గా యెంత పరిమళభరితంగా ఉన్నాయో తెలుసా? థేంక్స్!" అంటూ మాన్విత చుట్టూ చేతులు పోనిచ్చి లాంజ్ వేపు నడిచి నిదానంగా వెనక్కి తిరిగి చూసి.తన పర్సనల్ స్టాపుని ఆదేశించాడు."నేను తిన్నగా నాన్నగారి వద్దకు వెళ్తున్నాను, మాన్విత ను తోడు తీసుకుని. సెక్యూరిటీ బ్రాంచీ వద్ద స్పెషల్ పర్మిషన్ తీసుకుని కార్గో డివిజన్ నుండి నా సూటు కేసులు తీసుకొచ్చే యండి,ఇదిగో——నా ఫ్లయిట్ పేపర్లు-ఐడీ పత్రాలు" అని అందిచ్చి ఎయిర్ పోర్టు వసారా వద్ద సిద్ధంగా నిల్చున్న కారులోకి యెక్కాడు కామేశ్ మాన్వితతో బాటు——

పరిస్థితిని ఆకళింపు చేసుకున్న కంపెనీ కారు డ్రైవర్ కారుని వేగంగా పోనిచ్చాడు. అప్పుడు ప్రక్కనుంచిన ఫ్లాస్కు నుంచి కాఫీ పోసి కామేశ్ కి అందించింది మాన్విత-"ఇప్పుడా కాఫీ!ఫ్లయిట్ మధ్యలో రెండు మూడు కప్పులు తాగొచ్చాగా——"

"ఇది నేను మీ కోసం మీకిష్టమని చేసిన ఫిల్టర్ కాఫీ——హుఁ తీసుకోండి"

"ఓ!అదా! ముందే చెప్పొచ్చుగా-- "అంటూ కాఫీ కప్పు తీసుకుని డ్రైవర్ ని కాస్తంత వేగం హెచ్చించమని పురమాయించాడు.

కారు అలా వేగంగా వెళుతూ రోడ్డు ఆఖరి మలుపు తిరిగేటప్పటికి అక్కడ ఫుట్ పాత్ వద్ద జనం గుంపుగా నిల్చుని యేవేవో మాట్లాడుకుంటున్నారు.డ్రైవర్ కారు వేగం తగ్గిస్తూ అక్కడ ఆగిపోయాడు.అసహనంగా కామేశ్ పురమాయించాడు డీప్ కట్ చేసి కాస్తంత వెనక్కి లాగి కారుని డైవర్ట్ చేస్తూ సాగమని. అప్పుడు మాన్విత చప్పున కలుగ చేసుకుంది-"కొంచెం ఆగుదాం కామేశ్!ఎవరికో యేదో జరిగినట్లుంది.రండి చూసొద్దాం.-" అంటూ కారు డోర్ తెరచుకుని క్రిందకు దిగింది.అప్పుడు కామేశ్ కూడా దిగాడు.మాన్విత గుంపులోకి చొరబడేటప్పటికి అక్కడ జనం ఒకరి తరవాత ఒకరుగా మాట్లాడుకుంటున్నారు- "వాకింగ్ చేస్తూ తొట్రుపడుతూ పడిపోయుంటాడు"- మొదటతను.రెండవతను అందుకున్నాడు-"కాదు. అలాగయుండదు.జాగింగ్ చేస్తూ ఊపిరందక,రక్తపోటు అమాంతం పెరిగి ముఖం తిరిగి పడిపోయుంటాడు.వయసు పై బడుతున్నప్పుడు వేగంగా మూవ్ చేయ డం తగ్గించి జాగ్రత్తగా ఉండాల్సింది" అదేమీ గమనించకుండా గుంపుని చెదరగొడ్తూ తొంగి చూసింది మాన్విత. కళ్ళు రెండూ ఒక్కసారిగా పెద్దవి చేసుకుని గట్టిగా అరచింది- "కామేశ్!" అని.ఎవరది-ఎవరది అంటూ దూసుకువచ్చాడతను. క్షణకాలం బిత్తరపోయి చూస్తూ- "నాన్నా!" అంటూ దగ్గరకు వెళ్ళి భరద్వాజ్ ని చేతుల్లోకి అందుకున్నాడు.దిగ్భ్రాంతినుండి తేరుకుంటూ మాన్విత కూడా చేయి అందించిం ది.ఇద్దరూ భరద్వాజ్ ని పొదవి పట్టుకుని ఒకరిద్దరి సాయంతో యెత్తుకుని వెళ్ళి కారు బ్యాక్ సీటులో పడుకోబెట్టి,ప్రక్కన మాన్వితను కూర్చోబెట్టి, స్వయంగా స్టీరింగ్ అందుకుని సర్రున కారుని పోనిచ్చాడు కామేశ్.

(ఇంకా ఉంది )

సీరియల్






జి .నరసింహ మూర్తి;

భరద్వాజ ఆఫీసు... కేసు ముందు రోజు సాయంత్రం వరుణ్ వచ్చాడు...

"వరుణ్... ఆరోజు ఈ కేసు వాదించడానికి ఒప్పుకునే ముందు మీతో నాకు అన్ని విషయాలు దాపరికం లేకుండా చెప్పాలనీ లేకపోతే మధ్యలోనే ఈ కేసు నుంచి తప్పుకుంటాననీ మీకు చెప్పాను... గుర్తుందా?" అని అడిగాడు భరద్వాజ.

"గుర్తుంది లాయర్ భరద్వాజ గారు... నేనన్ని విషయాలూ మీకు చెప్పాను..."

"మరి ఆ మధుమాలిని అనే స్త్రీతో మీకు గల అక్రమ సంబంధం విషయం నాకెందుకు చెప్పలేదు"; అనీ అడిగాడు భరద్వాజ;

ఆ మాటలు విన్న తరువాత వరుణ్ కాసేపు మౌనం వహించాడు...

"భరద్వాజ గారూ! ఆ విషయానికి ఈ కేసుకి ఏమిటి సంబంధం? సంబంధంలేని విషయాలు ఎందుకు చెప్పాలనీ చెప్పలేదు" కుర్చీలో వెనక్కి వాలి కుర్చుంటూ చెప్పాడు వరుణ్.

# క్రైం సీరియల్

"సంబంధం లేదనీ మీరెలా అనుకుంటున్నారు?
సంబంధం ఉందో లేదో నేను నిర్ణయించుకోవాలి... చెప్పడం మీ బాధ్యత... తరువాత పీపీగారు ఆరోపించినట్లు మీరే ప్లాన్డ్ గా మధూలికకి ఫోన్ చేసి నాకు ఆమె హత్యోదంతాన్ని చెప్పమన్న విషయం నిజమేనా?" అని అడిగాడు భరద్వాజ...

"భరద్వాజ గారు... మీరు డిఫెన్స్ వారి ట్రాప్ లో పడ్డట్టున్నారు. అందుకే వారు చెప్పినవన్నీ నమ్మి నన్ను ప్రశ్నిస్తున్నారు. ఒక లాయర్ గా కేసు ఒప్పుకున్నప్పుడు క్లయింట్ ని రక్షించడానికి ప్రయత్నం చెయ్యాలి... కానీ మీరు ముందే నేను నేరస్తుడిని అన్న భావనకు వచ్చేసారు... ఇంక మీరేం నా తరఫున వాదిస్తారు?" అన్నాడు వరుణ్ అసహనంగా.
"వాదించననీ చెప్పడానికే మిమ్మల్ని పిలిచాను వరుణ్... మీలో ఫ్రాంక్ నెస్ నాకు కనిపించలేదు. మీరు కొన్ని విషయాలను దాస్తున్నారు... అది నాకు నచ్చలేదు. ఇది మనం కేసు వాదించే విషయంలో చేసుకున్న ఒప్పందానికి విరుద్ధంగా ఉంది... అందుకే ఈ కేసు నుంచి నేను తప్పుకుంటున్నాను. మీరు మీ తరఫున ఈ కేసుని వాదించడానికి ఇంకెవరినైనా పెట్టుకోండి" అన్నాడు భరద్వాజ.

"మీరు కేసుని ఒప్పుకునే ముందే అన్నీ ఆలోచించుకొనీ ఒక నిర్ణయానికి రావాలి... ఒకసారి కేసుని ఒప్పుకున్న తరువాత మధ్యలో వదలి వెళ్ళిపోవడం అనేది నది వరద మధ్యలో పడవను వదిలేయడం లాంటిది. అది ఉభయులకూ మంచిది కాదు. కాబట్టి మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోండి" అన్నాడు వరుణ్...

"మీ గురించి చాలామంది చెడుగా చెప్పారు. అవన్నీ విన్న తరువాత వాటి గురించి ఆరా తీసి నిజాలు తెలుసుకున్నాను. ఆ తరువాత ఈ నిర్ణయం తీసుకున్నాను. ఈ కేసులో ఒక్కరోజే వాదనలు జరిగాయి. అందుకనీ ఈ సమయంలో మీరు ఇంకొక లాయర్ని పెట్టుకుంటే పెద్దగా సమస్య ఉండదు" అన్నాడు భరద్వాజ.

"ఒకే మిస్టర్ భరద్వాజా... దేశంలో లాయర్లకేం కొదవ లేదు. ఏదో ఈ ఊళ్ళో ఉంటారనీ, ఎప్పుడూ అందుబాటులో ఉంటారనీ మిమ్మల్ని ఈ కేసు కోసం ఎన్నుకున్నాను. అసలు మా పాత లాయర్ గారైతే ఈ కేసు కోసం సుప్రీంకోర్టు ప్రముఖ లాయర్ని పిలిచారు. నేనే ఈ చిన్న పాము కోసం అంత పెద్దకర్ర అవసరం లేదనీ మీ దగ్గరికి వచ్చాను. కానీ మా లాయర్ గారు చెప్పిందే ఇప్పుడు నిజం అయింది... పెద్దకర్రని పట్టుకోక తప్పదు. ఈ కేసులో గెలిచి నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకొంటాను. అప్పుడు మీరు విచారించక తప్పదు" అన్నాడు వరుణ్.

"అదీ చూద్దాం... ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడుతారో కాలమే చెబుతుంది. ఇప్పటి దాకా నేను చేపట్టిన ఏ కేసులోనూ ఓడిపోలేదు. అది నిజమో కాదో కొద్ది నెలల్లో తెలిసిపోతుంది. చివరగా ఒక్క మాట. వేలమంది దోషులు శిక్ష నుంచి తప్పించుకున్నా ఒక నిర్దోషి కూడా శిక్షకు గురి కాకూడదనీ మన న్యాయశాస్త్రం చెబుతోంది... చూద్దాం ఏం జరుగుతుందో" అన్నాడు భరద్వాజ.

"భరద్వాజ... నా అంతటి పెద్ద పారిశ్రామికవేత్త, కోటీశ్వరుడు కోరి నీ దగ్గరకు వస్తే నన్ను అవమానించావు. భూమి ఆకాశాలను ఏకం చేసైనా ఈ కేసులో గెలుస్తాను. నువ్వు చేసింది తప్పనీ నిరూపిస్తాను. ఇట్స్ ఏ ఛాలెంజ్" అనీ అన్నాడు వరుణ్ లేచి నిలబడుతూ...

"అదీ చూద్దాం వరుణ్! గుడ్ లక్!" అన్నాడు భరద్వాజ.

ఆ తరువాత కోపంగా భూమి మీద కాలుతో తన్ని వెళ్ళిపోయాడు వరుణ్.

భరద్వాజ ఆఫీసు... ఆ రోజు కేసుల గురించి స్టడీ చేస్తున్నాడు...
ఆ సమయంలో డియస్పీ రఘువీర్, సిఐ అనంతరావు ఇద్దరూ ఇచ్చారు.
"హలో భరద్వాజా? మీతో

## క్రైం సీరియల్

కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలని వచ్చాము...” అన్నాడు రఘువీర్...

“వరుణ్ కేసు విషయమైతే అవసరంలేదు. ఎందుకంటే ఆ కేసు నుంచి నేను మొన్ననే వైదొలగాను. ఆ విషయాన్ని కోర్టుకి తెలిపాను కూడా!” అన్నాడు భరద్వాజ.

“ఓహెూ ఇంట్రెస్టింగ్... ఆరోజు మేము చెబుతున్నా వినకుండా బల్లలు చరిచి మరీ కోర్టులో వాదించారు. ఇప్పుడేమైంది? ఈ నిర్ణయానికి కారణం?” అన్నాడు అనంతరావు .

“క్లయింట్ కీ నాకూ మధ్య చిన్న బేదాభిప్రాయాలు వచ్చాయి. అతనిలో ఫ్రేంకనెస్ లేదు... అబద్దాలు చెప్పాడు. హీ హేజ్ హైడ్ ది ఫేక్ట్స్... అతను నిజాల్ని దాచేడు... అది నాకు నచ్చలేదు. అందుకే వైదొలిగాను” అన్నాడు భరద్వాజ...

“భరద్వాజా! ఆ కేసు విషయమై మీతో మాట్లాడాలని వచ్చాను. మధూలిక అనే స్త్రీని తన మీద జరిగిన హత్యాప్రయత్నం సంగతి ఎవ్వరికీ చెప్పొద్దనీ చెప్పాము. ఎందుకంటే అటువంటి విషయాలు పేపర్లలో వస్తే సమాజం అల్లకల్లోలం అవుతుంది. స్త్రీలు వంటరిగా ఉండటానికి భయపడతారు. మీరు గమనించారో లేదో... అనుష్క హత్య జరిగిన తరువాత మళ్ళీ అటువంటి ఘటనలు జరగలేదు. అంటే ఇదంతా ఆ వరుణ్ చాలా పకడ్బందీగా రూపొందించిన ఒక ప్లాన్. ఒకేరకంగా ఇద్దరు స్త్రీల మీద హత్యాప్రయత్నం జరిగిందంటే పోలీసులు అనుమానం ఆ వ్యక్తిమీదకు వెళుతుందనీ, ఆ విధంగా పోలీసుల దృష్టి కోణాన్ని ఏమార్చాలనీ వరుణ్ ఆలోచన... ఒక విధంగా సక్సెస్ అయ్యాడు కూడా... కానీ నిజం పాతాళగంగ లాంటిది... దాన్ని పుడమిని చీల్చుకొని బయటకు రాకుండా ఎవ్వరూ ఆపలేరు... సరే... ఇప్పుడు మీరు ఏం చెయ్యబోతునారు?” అని అడిగాడు రఘువీర్...

“ఏం లేదు... నాకేసులు నాకున్నాయి.”

“ఒక చిన్న రిక్వెస్ట్... ఈ వరుణ్ కేసులో మీరు మాకెందుకు సహాయం చెయ్యకూడదు... మా పీపీ గారికి రిటైర్మెంట్ ఏజ్ వచ్చింది. సరిగ్గా వాదించలేక పోతున్నారు. మేము మా ఎస్పీ దగ్గర ఆర్డర్స్ తీసుకొనీ మిమ్మల్ని వకీలుగా నియమిస్తాము. అంటే పోలీసుల తరపున మీరు వాదించాలి... అంటే ఏ వరుణ్ని రక్షించడం కోసమైతే కేసుని వాదించడానికి ఒప్పుకున్నారో ఇప్పుడదే వరుణ్ కి వ్యతిరేకంగా కేసుని వాదించాలి...” అన్నాడు రఘువీర్...

భరద్వాజ కాసేపు మౌనం దాల్చి ఆలోచించటం మొదలు పెట్టాడు.

“ఇందులో అనైతికత ఏంలేదు భరద్వాజా? ఎవ్వరి తరపున వాదించినా నిజం బయటకు రావాలి... అంతే... కాని పని మీరు చెయ్యవద్దు. బలవంతంగా మా తెలివితేటలు ఉపయోగించి ఒక నిరపరాధిని అపరాధిగా కోర్టులో ఋజువు చేసే అవసరం మాకు లేదు... ఒకవేళ వరుణ్ నిజంగా నిరపరాధైతే అతను ఈ కేసు నుంచి బయటపడాలి. అనుష్కని చంపిన అసలు హంతకుణ్ణి పట్టుకోవటమే మా లక్ష్యం. ఆ తరువాత అతనికి శిక్ష పడేటట్లు చెయ్యడం... ఈ దిశగా ఆలోచించండి... కొద్ది రోజులు ఆలోచించుకొనీ చెప్పండి... అది చెప్పటానికే వచ్చాను” అన్నాడు రఘువీర్.

“ఒకే రఘువీర్... లెట్ మీ థింక్ ఇన్ దిస్ రిగార్డ్... ఈ విషయంలో నాకు కొద్దిగా సమయం కావాలి.” అన్నాడు భరద్వాజ.

“అలాగే... టేక్ యువర్ ఓన్ టైమ్...’ పది రోజుల తరువాత అనంత్ మిమ్మల్ని కలుస్తాడు. ఈ లోగా ఓ నిర్ణయానికి రండి...” అన్నాడు రఘువీర్ లేచి నిలబడుతూ.

భరద్వాజ బయటకొ

తెలుసుకునేందుకు ప్రయత్నం చేసాను. ఈ కేసులో కష్టపడితే కానీ నిజాలు బయటకొచ్చేటట్లు లేవు. ఇది ఈ జిల్లాలోని పెద్ద పారిశ్రామికవేత్త కూతురి హత్య. దీన్ని మామూలుగా చూడరాదు... దీని వెనక లోతైన కారణం ఉండే ఉంటుంది... ఈ నిజాన్ని బయటకు తీయాలనే నిర్ణయించుకున్నాను. నేను మీ తరఫున వాదించటానికి నిర్ణయించుకున్నాను" అంటూ తన అంగీకార పత్రం అతనికిచ్చాడు భరద్వాజ.

"కృతజ్ఞతలు భరద్వాజా... ఈ కేసులో మీ సహాయం మాకు చాలా అవసరం. మీకే సహాయం కావలసినా నాకు చెప్పండి... ఈ కేసు విషయంలో మరిన్ని విషయాలతో మళ్ళీ వారం కలుస్తాను... మిమ్మల్ని మా లాయరుగా నియమించే పత్రాన్ని ఈరోజే కోర్టుకి అందచేస్తాము" అన్నాడు అనంత్.

అతను వెళ్ళిపోయిన తరువాత భరద్వాజ ఆలోచించటం మొదలు పెట్టాడు...

ఈ కేసు మూలాల్లోకి వెళ్ళాలి... అప్పుడే నిజాలు బయటకు వస్తాయి... నిజం అంకురం లాంటిది... అది మట్టిలోంచి మొక్కలా బయటకు వచ్చినట్లు బయటపడి తీరుతుంది...

ఆ సాయంత్రం పోలీస్టేషన్ కి వెళ్ళి గోపాలరావు కారు ప్రమాదం కేసు ఫైలు కావాలని చెప్పాడు. డ్యూటీలో ఉన్న ఎస్సై రమణ అనంత్ కి ఫోన్ చేసి అతని అనుమతితో ఆ ఫైలునిచ్చాడు...

భరద్వాజ అక్కడే కూర్చొని దాన్ని చదవటం మొదలు పెట్టాడు.

గోపాలరావు గారి కూతురు అనుష్క కంపెనీ డైరెక్టర్ హెూదాలో "తన తండ్రి కారు ప్రమాదం ఎవరో చేయించారన్న అనుమానం కలుగుతోందనీ, దీని వెనక ఎవరున్నదీ తేల్చాలనీ పోలీసులకు ఫిర్యాదు చెయ్యడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ లాడ్జ్ చేసి కేసు పరిశోధన మొదలు పెట్టినట్లు అందులో ఉంది.

కానీ ఆ తరువాత "ఈ కేసులో అనుమానించదగ్గ వాస్తవాలు ఏవీ లేవు... అది ప్రమాదవశాత్తూ జరిగిన కారు ప్రమాదంగా తేలింది కాబట్టి ఈకేసుని మూసివేస్తున్నాము" అనీ ఆ కేసుని క్లోజ్ చేసినట్లు ఎస్పీకి వ్రాసిన ఉత్తరంలో ఉంది...

కానీ ఆ ఫైల్లో పల్లవి అనే స్త్రీ వ్రాసిన ఓ ఉత్తరం భరద్వాజని ఆకర్షించింది...సబ్ ఇన్స్పెక్టర్ గారికి,

మొన్న సాయంత్రం నేను పక్క ఊరు వెళ్తున్న సందర్భంలో ఇద్దరు వ్యక్తులు దూరంగా చెట్టుకింద నిలబడి ఒక కారు మీద కాల్పులు జరపడాన్ని నేను గమనించాను. ఆ సమయంలో నేను నా కారుకి డ్రైవర్ టైర్ మార్చుతుంటే బయట నిలబడి ఉండటంతో వాళ్ళిద్దరూ జరిపిన కాల్పుల్ని ప్రత్యక్షంగా చూడగలిగాను. వాళ్ళు జరిపిన కాల్పుల వల్ల స్పీడుగా వెళుతున్న ఆ కారు టైరు పేలి పోవడంతో అది డివైడర్ కి గుద్దుకొని ప్రమాదానికి గురవడం వల్ల ఆ కారు వెనక సీట్లో కూర్చున్న వ్యక్తి బయటకు విసిరేయబడి డివైడర్ ని గుద్దుకొని చనిపోయాడు. ఇదంతా తృటికాలంలో జరిగింది. ఆ కారు నెంబరు ఏపీ 7777. కాబట్టి పోలీసులు ఈ విషయమై తగు చర్యలు తీసుకుంటారనీ ఆశిస్తున్నాను.ఇట్లు పల్లవి "అనీ వ్రాసి ఉంది...

తరువాత పోలీసులు ఆమె స్టేట్మెంట్ ని గానీ, ఎంక్వైరీని గానీ ఏమీ చేసినట్లు అందులో కనిపించలేదు.ఆమె చెప్పిన కారు నంబరు హత్యకు గురైన అనుష్క తండ్రి,పారిశ్రామికవేత్త గోపాలరావు గారిది; అంటే ఎవ్వరో గోపాలరావు గారి కారు ప్రమాదం కేసుని ముందుకు వెళ్ళకుండా అడ్డుపడ్డారని తెలుస్తోంది.

అనుష్క గోపాలరావు కూతురు. అనుష్క హత్యకు ఆరు నెలల ముందు ఓ కారు ప్రమాదంలో గోపాలరావు చనిపోయాడు. అది ప్రమాదవశాత్తూ కాదనీ, ఇద్దరు వ్యక్తులు టైర్ల మీద కాల్పులు

# క్రైం సీరియల్

జరపడం వలన ప్రమాదానికి గురైందనీ ఓ స్త్రీ ఫిర్యాదు చేసినా దాన్ని మామూలు ప్రమాదం అనీ కేసుని ముగించడం వెనక ఎవరిదో హస్తం ఉండే ఉంటుంది. ఆ తరువాత అతని కూతురు అనుష్క హత్య చేయబడింది...

దీన్నిబట్టి గోపాలరావు మరణం ఈ కేసులో చాలా కీలకం అనిపించింది భరద్వాజకి.

ఆ సాయంత్రం అనంతరావుకి ఫోన్ చేసి ఆ ఫైల్లోని హరిత వ్రాసిన ఉత్తరం గురించి చెప్పాడు. అతను ఓ గంట తరువాత భరద్వాజని కలవడానికి అతని ఆఫీసుకొచ్చాడు.

"ఆ సమయంలో ఈ కేసుని ఎవరు పరిశోధించారు" అని అడిగాడు భరద్వాజ.

"అప్పుడు విక్టర్ అనే ఓ ఎస్సై డీల్ చేసాడు. అతనొక అవినీతిపరుడు' అని చెప్పాడు.

'నా ఉద్దేశ్యంలో పల్లవి ని ప్రశ్నిస్తే మనకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఆ తరువాత ఏం చెయ్యాలో దారి దొరుకుతుంది" అనీ చెప్పాడు భరద్వాజ.

"భరద్వాజా. మీరు వెళ్ళి ఆమెతో మాట్లాడండి. పోలీసుల్ని చూస్తే వాళ్ళు నిజాలను సరిగ్గా చెప్పరు" అనీ వెళ్ళిపోయాడు అనంత్.

భరద్వాజ హరిత ఎడ్రస్ నోట్ చేసుకొనీ ఆ మర్నాడుదయాన్నే ఆమె ఇంటికి వెళ్ళాడు.

పల్లవి నగరంలో ఒక కంపెనీలో మేనేజర్ గా పనిచేస్తున్న పాతికేళ్ల యువతి; చూడటానికి తెల్లగా ,అందంగా వుంది;అతను వెళ్ళేసరికి ఆమె ఆఫీసుకి వెళ్ళే హడావుడిలో ఉంది. భరద్వాజ తన గురించి చెప్పి తను వచ్చిన పని గురించి చెప్పాడు...

"పల్లవి గారు! ఆ రోజు మీరు పోలీసులకు ఒక కారు ప్రమాదం గురించి ఫిర్యాదిచ్చారు. ఆ తరువాత ఏం జరిగింది?" అని అడిగాడు...

"నేను ఉత్తరం వ్రాసిన రెండురోజుల తరువాత ఒక ఎస్సై మా ఇంటికొచ్చి కొన్ని వివరాలు అడిగేడు. నేను అన్ని వివరాలు చెప్పబోతుంటే అవన్నీ మాకు తెలుసనీ, ఈ వివరాలు ఇంకెక్కడ చెప్పవద్దనీ, అది కేసుని తప్పుదారి పట్టిస్తుందనీ చెప్పి వెళ్ళిపోయాడు. మా నాన్నగారు ఆ ఎస్సై గారు వెళ్ళిపోగానే నా దగ్గరకు వచ్చి ఆ కేసు గురించి ఎక్కడా ఎవ్వరితోనూ చెప్పొద్దు. అనవసరంగా మనకి సమస్యలొస్తాయి. పోలీసులు మన కుటుంబాన్ని నానా విధాలుగా హింసిస్తారనీ చెప్పటంతో నేను దాన్ని గురించి మరిచి పోయాను..." అనీ చెప్పింది పల్లవి;

"అంటే... దీని వెనక ఏదైనా గూడుపుఠాణి ఉందంటారా?"

"ఉందనే అనుకుంటున్నాను... పోలీసులు దీని వెనక ఉన్నారనే నా నమ్మకం... వాళ్ళకన్నీ తెలుసు... అందుకే నా వివరణ తీసుకోలేదు" అనీ చెప్పింది...

"పల్లవి గారూ! ఆ కేసు విషయంలో ఆ కారు మీద కాల్పులు జరిపిన వ్యక్తుల్ని మీరు పోల్చగలరా? అని అడిగాడు భరద్వాజ...

"నేను వాళ్ళు కాల్పులు జరిపిన సమయంలో దగ్గర్నుంచీ చూసాను... వాళ్ళను చూస్తే పోల్చగలను... ఒక్క విషయం" అంటూ ఇంట్లోకి వెళ్ళి ఓ ఫైలు తెచ్చి భరద్వాజకి ఇచ్చింది.

"నాకు చిత్రలేఖనం వచ్చు... ఎవర్నైనా చూడగానే వాళ్ళ బొమ్మలను వెంటనే గీయగలను. ఆ రోజు కూడా పోలీసులు నన్ను వాళ్ళ గురించి ప్రశ్నిస్తారని అనుకొని వాళ్ళ బొమ్మలను డ్రాయింగ్ పేపరు మీద గీసాను" అనీ చెప్పింది.

భరద్వాజ ఆ డ్రాయింగు లను పరిశీలించాడు.

అందులో ఇద్దరు వ్యక్తులు నల్లటి గెడ్డాలతో, భయంకరంగా వున్నారు ;ఒక వ్యక్తి బుగ్గ మీద నల్లటి మచ్చ ఉంది. ఇంకో వ్యక్తి నల్లటి కళ్ళజోడు పెట్టుకున్నాడు.

" పల్లవి గారూ! ఈ రెండు డ్రాయింగులు నాకు కావాలి. అవసరం అయితే కోర్టు కొచ్చి సాక్ష్యం చెప్పాలి. ఈ విషయంలో మీరేం భయపడొద్దు" అనీ చెప్పాడు.

ఆ సాయంత్రం స్టేషన్ కి వెళ్ళి సీ ఐ అనంత్ ని కలిసి ఆ డ్రాయింగుని చూపించాడు;

"అనంత్!ఈ డ్రాయింగ్ లోని ఇద్దరూ గోపాలరావు గారి కారు మీద కాల్పులు జరిపారు. వీళ్ళెవరో తెలుసుకోవాలి" అనీ చెప్పాడు.

అనంత్ దాన్ని తీసుకొనీ సెల్ కెమేరాతో ఫోటో తీసి "వీళ్ళెవరో కనుక్కుంటాను." అనీ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన తరువాత భరద్వాజ ఆలోచించడం మొదలు పెట్టాడు.

సాయంత్రం అనంత్ వచ్చి కొన్ని ఆసక్తికరమైన విషయాలు చెప్పాడు.

"భరద్వాజ గారు! వాళ్ళిద్దరూ ఓ హత్య కేసులో నిందితులు. వాళ్ళ పేర్లు పఠాన్, దిలావర్ బీహారీలు... ఆ కాల్పులు జరిపిన రోజు వాళ్ళిద్దరూ ఓ కేసు విషయంలో మా లాకప్పులో ఉన్నట్లు రికార్డుల్లో ఉంది..." అన్నాడు.

"అనంత్! ఆరోజు సాయంత్రం వాళ్ళు పోలీసు లాకప్పులో ఉంటే ఎలా బయటకు వచ్చారు? వాళ్ళ నెవరు బయటకు వదిలారు? ఆ రోజు డ్యూటీలో ఉన్న ఎస్సై, కానిస్టేబుల్స్ ఎవరు ?? దాంతోపాటు ఆ రోజు ఇంకెవరు లాకప్పులో ఉన్నారు? ఈ వివరాలు కావాలి. వాళ్ళ వివరాలు తెలిస్తే వాళ్ళ ద్వారా తెలియని విషయాలు తెలుసుకోవచ్చు" అన్నాడు భరద్వాజ.

"తప్పకుండా ఆ వివరాలు మీకందిస్తాను. మన కేసులో ఇంకా 15 రోజుల తరువాత వాదనలు ప్రారంభవుతాయి. ఈ లోపులో మనం కావలసిన సాక్ష్యాలన్నీ పకడ్బందీగా సంపాదించాలి... అసలు ఏం జరిగిందో, దీని వెనక ఎవరున్నారో తెలుసుకోవాలి..." అన్నాడు అనంత్.

"అది సరే... ఆ హత్య జరిగిన రాత్రి వరుణ్ తను ఇంట్లో లేనట్లు, పక్క పట్నంలోని హొటల్లో ఉన్నట్లు చెబుతునాడు. ఆ హోటల్ కి వెళ్ళి వివరాలు సంపాదించాలి..." అన్నాడు.

"మీరు ఎప్పుడు వెళతే నేను మా కానిస్టేబుల్ని పంపుతాను. అప్పుడు మీకు అన్ని విషయాలు తెలుస్తాయి" అన్నాడు అనంత్.

"వద్దు... మీ పోలీసుల్ని చూస్తే చాలామంది భయపడి నిజాలు చెప్పరు. నేనే వెళ్ళి వివరాలు సంపాదిస్తాను" అన్నాడు భరద్వాజ...

"అలాగే" అనీ చెప్పి అనంత్ వెళ్ళిపోయాడు...

ఆ మర్నాడు భరద్వాజ ఆ పట్టణ పోలీస్టేషన్ కి వెళ్ళాడు.

ఎస్సై రమణ ,ఇద్దరు కానిస్టేబుళ్ళు ప్రకాశం, సూర్యనారాయణ డ్యూటీలో ఉన్నారు.

భరద్వాజ గురించీ అనంత్ ముందే చెప్పడం వల్ల రమణ అతన్ని లోనికి ఆహ్వానించాడు.

ఓ కానిస్టేబుల్ కాఫీలను తెచ్చాడు. భరద్వాజ కేసు గురించి చెబుతూ "ఈ ఫోటోలో ఉన్న పఠాన్, దివాన్లను క్రితం నెల 15న మీ పోలీస్టేషన్లోని లాకప్పులో ఒక కేసు నిమిత్తం ఉంచారు. కానీ అదేరోజు సాయంత్రం వాళ్ళు బయట ఓ కారు మీద కాల్పులు జరిపినట్లు ఋజువులు దొరికాయి. లాకప్పులో ఉన్న వాళ్ళిద్దరూ బయటకెలా వెళ్ళారు? ఎవరు వారిని బయటకు వదిలేరు. ఈ విషయంలో ఎవరి ప్రోద్బలమైనా ఉందా? ఈ వివరాలు చెప్పండి. అదీకాక ఆరోజు ఇంకెవరైనా లాకప్పులో ఉన్నారా అన్న విషయం కూడా కావాలి..." అన్నాడు భరద్వాజ.

రమణ వెంటనే కానిస్టేబుల్ ప్రకాశాన్ని పిలిచి రిజిస్టర్లను తెప్పించి చూసాడు.

"సార్! ఆరోజు "మురళీధర్ అనే ఎస్సై, శివరామ్ అనే కానిస్టేబుల్ డ్యూటీలో ఉన్నారు. ఆ రోజు పక్క లాకప్పు గదిలో వెంకట్ అనే జేబుదొంగ కూడా ఉన్నాడు" అన్నాడు రమణ.

# క్రైం సీరియల్

"రమణ గారూ! ఇప్పుడా మురళీధర్, శివరామ్ ఎక్కడ పనిచేస్తున్నారు?" అని అడిగాడు భరద్వాజ.

"వాళ్ళిద్దరికీ నెల క్రితం రెండో టౌన్ స్టేషన్ కి బదిలీ అయింది..." అనీ చెప్పాడతను...

"ఒకే రమణా! ఈ కేసు విషయమై ఏదైనా అవసరం పడితే మీ దగ్గరికి వస్తాను" అనీ వెళ్ళిపోయాడు భరద్వాజ.

ఆమర్నాడు భరద్వాజ, అతని సహాయకుడు ధర్మారావు ఆ ఊరికి పక్కనే ఉన్న పట్నం బయలుదేరారు. అక్కడికి 40 కి.మీ. దూరం ఉంటుంది ఆ పట్నం...

ఆ ఊళ్లో పెద్ద హెూటల్ షెరటాన్. అనుష్క హత్య జరిగిన రోజున ఒక మీటింగ్ నిమిత్తం వరుణ్ ఆ హోటల్ కి వచ్చాడు. దురదృష్టవశాత్తూ అదే రాత్రి అతని భార్య అనుష్క హత్యకు గురైంది.

భరద్వాజ తిన్నగా రిసెప్షనిస్టుని కలిసి తన వివరాలు చెప్పాడు. పోలీసులు తనను కౌన్సిల్ గా నియమించిన ఉత్తరాన్ని అతనికి చూపించాడు.

"చెప్పండి... ఏ విషయమై మీరొచ్చారు" అని అడిగాడు రిసెప్షనిస్ట్...

ఆ హెూటల్ చాలా అధునాతనంగా ఉంది. ఐదంతస్తుల బిల్డింగ్. ముందుర పెద్ద స్విమ్మింగ్ పూల్,ఆ పక్కన పెద్ద ఫౌంటెన్... రిసెప్షన్ హాల్ గ్రానైట్ ఫ్లోరింగ్ లో మెరిసిపోతోంది. హాలు మధ్యలో వేలాడుతూ పెద్ద షాండ్లియర్స్ లైటింగ్. ఎక్కడ నుంచో బీటిల్స్ సంగీతం వినిపిస్తోంది... ఉదయం పదిగంటలు కావడంతో ఖాళీగా, నిశ్శబ్దంగా ఉంది...

క్రితం నెల 15వ తారీఖున వరుణ్ ప్రసాద్ అనే పారిశ్రామికవేత్త మీ హెూటల్లో ఉన్నారు. అతను ఎప్పుడు ఈ హెూటల్కి వచ్చాడో, ఎప్పుడు ఖాళీ చేసాడో అంటే చెక్-ఇన్, చెక్ అవుటు లు కావాలి" అనీ అడిగాడు భరద్వాజ ;
అతను పక్కనే కూర్చొని ఉన్న లేడీ రిసెప్షనిస్ట్ ని పిలిచి 'మేడం... ఈ వివరాలు లాయర్ గారికివ్వండి" అంటూ ఆమెకి చెప్పాడు.

భరద్వాజ థేంక్స్ చెప్పి ఆమె దగ్గర నుంచి అతనికి కావలసిన వివరాలు తీసుకున్నాడు. ఆ తరువాత అతనికి కృతజ్ఞతలు చెప్పి వచ్చేసాడు.

(ఇంకా ఉంది )

సీరియల్



# యూనివర్సిటీ

పాంచజన్య

విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, సమాజానికి ఉపయోగపడే నాయకులుగా తీర్చిదిద్దాల్సిన విశ్వవిద్యాలయాలు నేడు రాజకీయ బురదలో కురుకుపోయి , కులాల కుంపట్లను అనుక్షణం రాజేస్తూ ,మతాల మంటల్లోవిద్యార్థుల భవిష్యత్తును కాలుస్తూ ,తమ స్వార్ధం కోసం విద్యార్థులను రాజకీయ కార్యకర్తలుగామార్చి వారిని అసాంఘిక శక్తులుగా తయారుచేస్తూ దేశ భవిష్యత్తుకే ప్రమాదకరంగా మారాయి అనటం లో ఏ సందేహం లేదు . విశ్వవిద్యాలయాలలో జరిగే అవినీతి పై , అసాంఘిక కార్యకలాపలాపై ,లైంగిక దుశ్చర్యలపై పోరాటానికి పూరించిన పంచాజన్యమే ఈ నవల .

దీనిని నవల అనేకంటే నిజాల ప్రబంధం , వాస్తవాల దృశ్య కావ్యం అని పేర్కొనవచ్చు . ఈ నవలలో జరిగే ప్రతి సంఘటన ఎదో ఒక విశ్వవిద్యాలయం లో జరిగినదే .” పాంచజన్య “ కలం నుండి నెల నెల వెలువడబోతున్న ఈ నవలను చదివి మీ అభిప్రాయాలను , మీకు ఎదురైనా సంఘటనలను రాసి పంపండి ఉత్తమమైన వాటికి బహుమతి ఉంటుంది .

వచ్చే నెల నుండే ....”యూనివర్సిటీ “...

సీరియల్



# బాబా ..బాబా ...బ్లాక్ షీప్

ఈ సృష్టిలో  మిగిలిన జీవరాశులన్నీ దేవుడనే భావన లేకుండా బతుకు తున్నప్పుడ మనిషి మాత్రం ఆ భావన లేకులగా బ్రతకలేడా?  ఈ భుమి మీదు ఉన్న అన్ని జీవరాశుల లో  మనిషికి మాత్రమే తెలివితేటలున్నాయి. మనిషి మాత్రమే విచక్షణాజ్ఞానంతో అలోచించగలడు. తన తెలివి తేటలతో ఈ భూగ ) హం  మీద ఆధిపత్యాన్ని సంపాదించి , ఇతర గ్రహాలను కూడా ఆక్రమించాలని చూస్తున్నాడు. ఇంతటి తెలివి తీటలు, ధైర్య సాహసాలు వున్న మనిషి దేవుడినే  గుడ్డి నమ్మకన్నా ఏర్పరుచుకుని, తన శక్తి యుక్తులను మరచిపాతునాడు . తనమీద తనే నమ్మకాన్ని కోల్పియి బలహానుడుగా మారిపోతున్నడు.

దేవుడు ఉన్నాడా లేదా  అనే విష యాన్ని పక్కన పెడితే, మనిషికి దేవుడిఅవసరం ఉన్నప్పుడే గుర్తుకొస్తాడు. అసలు దేవుడిత మనిషికి అవసరం ఏమిటి?
దేవుడు మనిషికి ఎప్పుడు అవసరం వస్తుందంటే, కోరికలు ఎక్కువై వాటిని సాధించు కునే శక్తి లేక బలహీనుడిగా  మారినపుడు మాత్రమే .తన పరిదిని  నిర్వ చించుకుని, తనకేం కావలి, ఏం అక్కర్లేదో  తెలుసుకున్న ప్పుడు, తన అవసరాలు తీర్చుకోవటానికి  తకు న్న శక్తి యుక్తులు సరిపోతాయి. కాని అన్ని తనేకే కావాలనే దురాశ కలిగినప్పుడు మాత్రం, ఆ ఆశ తీరటానికి ఎదో అద్భుతం జర్గితే బాగుండు అని  మనిషి ఆశిస్తాడు. ఆ అద్భుతం  పేరే దేవుడని సరిపెట్టు కుంటున్నాడు.

మన అజ్ఞానాన్ని ,దురాశలనే పెట్టుబడి గా పెట్టి , దేవుళ్ళుగా చెలామణి అవుతున్న బాబాలు మన దేశం లో కోకొల్లలు .అటువంటి బాబాల నిజ స్వరూపాలను ప్రజలముందు  పెట్టాలనే ఒక చిన్న ప్రయత్నమే ఈ నవల .....వచ్చే నెల నుండే

# రాణాప్రతాప్

సీరియల్





డా. పులిచెర్ల సాంబశివరావు

అంబర్ నుండీ, మార్వార్ నుండీ చక్రవర్తి సైన్యం మిడుతలదండువలె పైన పడింది. కోటలో ఆహార పదార్థాలు వట్టిపోయాయి. తురుష్క సైన్యం సూర్యమహల్ని చుట్టుముట్టింది. మహారాణాప్రతాప్ కృష్ణసింహునితో ఆలోచించి, అనుచరులతో సహా రహస్య మార్గాన తప్పించుకొని భీమ్గఢ్ చేరాడు.

అట్టహాసంతో ఫిరంగులను పేల్చి సూర్యమహల్ సింహద్వారాన్ని బద్దలుచేసి, లోన ప్రవేశించిన తురుష్కులను శూన్య ప్రదేశాలు వెక్కిరించాయి! మహారాణాను పట్టుకోవడానికి ఇక మిగిలింది ఒక్కటే మార్గం! అతడి భార్యా పుత్రుల్ని చేజిక్కించుకుంటే ప్రతాప్ లొంగిపోతాడు! ఊపిరి సలపకుండా అతనిపై దాడిచేస్తే, పెండ్లాం పిల్లల్ని ఒకచోట పెట్టి తానొకచోట యుద్ధం చేయక తప్పదు!

భీమ్గఢ్ మీద ఫిరంగి గుళ్ళవర్షం కురిసింది. కోట దద్దరిల్లింది. గోడలు బీటలు వారాయి.

రాణా తన భార్యాపిల్లల్ని భిల్లులవెంట గుహల్లో దాగివుండమని పంపాడు! భిల్లులు వారిని వెదురుగంపల్లో

మోసుకొనిపోయి జవోరా ప్రాంతపు తగరపు గనుల్లో దాచిపెట్టారు. భిల్లులే వారిని సంరక్షించి, ఆహారం అందించారు.

దినమొక యుగంగా గడుస్తోంది. ఏ మూలనుండి, ఏ క్షణాన తురుష్కసైన్యం పైన పడుతుందో తెలియదు! రాణా భీమ ద్ను వీడి కొండగుహలలోనికి పోగా, అతని ఉనికిని కనిపెట్టి అక్బర్ సైన్యం కాశింఖాన్ నాయకత్వంలో కొండల్లోకి ప్రవేశించింది. ఆ ప్రదేశాన్ని వీడి రాణా చిట్టడవుల్లోకి పోగా అక్కడ షాబాతాఖాన్ సైన్యం వెంటపడింది. రాణా ఆబూ కొండదారి పట్టగా మార్వారు సైన్యం ఎదురైంది

. ప్రతాప్ వారిని తప్పించుకొని సకుటుంబంగా త్రికూట పర్వత సమీపంలోని ఏకలింగేశ్వరాలయం చేరాడు. మిగిలిన కొద్దిమంది మేవాడు సర్దారులు తమ అనుచరులతో మహారాణాను అక్కడ కలుసుకున్నారు. ప్రతాప్ అందర్నీ పరికించాడు.

మేవాడ్ వీరులంతా చిక్కి శల్యమైపోయారు.

మహారాణాపై భక్తివిశ్వాసాలు, అంతులేని దేశభక్తి మాత్రమే వారిని ప్రాణాలతో నిలబెట్టాయి. మహారాణా వారి దుస్తులను చూశాడు.

మాసిపోయి, మాసికలువేసి ఉన్నాయి. ఎవరికీ చిన్నమెత్తు ఆభరణం లేదు! ప్రతాపుని అంతర్మథనం ఆ క్షణంలో అంతమైంది. ఒక నిశ్చయానికి వచ్చాడు.

“మేవాడు వీరవరులారా! పందొమ్మిది సంవత్సరాలనుండి ఎడతెరపిలేని యుద్ధంతో శరీరాలను తప్ప సర్వస్వం పోగొట్టుకున్నాం! వయసు పెరుగుతున్నది; ఆశ తరుగుతున్నది. కష్టాలు అధికమవుతున్నాయి; సహచరులు నశించిపోతున్నారు. మా వంశకీర్తిని నిలబెట్టలేని ఈ అధమునిపై మేవాడ రక్షణభారం పడింది! నన్ను నమ్ముకొని మీరందరూ పడరాని ఇడుములు పట్టారు. ఈ దశలో నేను చేయగలిగింది ఒక్కటే...!” అందరూ చెవులప్పగించి నిశ్చేష్టులై వింటున్నారు.

“... మీరందరూ స్వేచ్ఛగా వెడలిపొండి! మీ ఇష్టము వచ్చినచోట స్థిరపడి సుఖంగా బ్రతకండి!”

ఈ మాటలు విని సర్దారులు నివ్వెరపోయారు. సలుంబ్రా కృష్ణసింహుడు సంబాళించుకొని అన్నాడు.

“ప్రతాప్! మేవాడ్ స్వాతంత్ర్య పరిరక్షణకోసం నీవు చేయవలసిన త్యాగాలన్నీ చేశావు. ఈ దేశచరిత్రలో మున్నెన్నడూ ఎదురవని విపద్దశ నేడు వచ్చింది. అక్బర్ పైశాచిక శక్తిని నీ దైవభక్తితో ఎదుర్కొన్నావు; ఐహికభోగాలను ఆత్మవైభవంతో ఎదుర్కొన్నావు! నీకంటే మాకు దేవుడు వేరే లేడు! నిన్ను విడిచి మేము ఎక్కడకూ వెళ్ళము! కష్టమో సుఖమో నీ వెంటే ఉంటాము. నీవు ఎక్కడికి వెళితే అక్కడికే వస్తాము!”

“జై రాణాప్రతాప్!”

“జైజై మహారాణా ప్రతాప్!”

# చరిత్రాత్మక సీరియల్

**జరిగిన కథ** అక్బర్ చక్రవర్తి! అశేష సైన్యసమూహాలతో, విశేషాయుధ సంపత్తితో చిత్తోడ్ను కైవసం చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు! ఈ ఆలోచనలతో సతమతమవుతూ, మనశ్శాంతి కోసం ఉదయసింహుడు రాజధానిని విడిచి అరణ్యమార్గాన అనుచరవర్గంతో ఏకలింగనాథస్వామి సన్నిధికి చేరాడు.అక్కడ 'ఓం నమశ్శివాయ!' అంటూ వినపడింది. ఆ శబ్దం వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళితే ఓ సాధువు కనిపించాడు . 'ఉదయా చిత్తోడ్ వదిలి నేను చుపించాచోట కోట నిర్మంచమని చెపుతాడు . దానికి ఉదయసింహుడి మంత్రులు అది పిచ్చి ఆలోచన అంటారు .కాని ఉదయ సింహుడి కొడుకు మాత్రం తండ్రి ఆజ్ఞ పాటించలంటాడు. అక్బర్ అనుమతితో బైరాంఖాన్ తన కరకు కరవాలంతో హేమూ శిరమును ఒక దెబ్బతో తెగనరికాడు .చిత్తోడ్ అక్బర్ వశంఅయ్యింది . అగ్ర కోటకి ఇరు వైపులా జయమల్, పత్తా విగ్రహాలను నిలిపాడు అక్బర్ .చిత్తోడ్ మొత్తం శ్మశానంలా మారిపోయింది.దానితో దిగులుతో మంచం ఎక్కాడు ఉదయ సింహుడు .చిన్నరాణి తనకొడుకు జగమ్మల్లుడికి పట్టాభిషేకం చెయ్యమంటుంది .మాట ఇచ్చి మరణిస్తాడు ఉదయ సింహుడు. కాని అక్కడి సర్దారులు అందుకు ఒప్పుకోరు . రాణాప్రతపుడికే పట్టం కడతారు .దానితో జగమల్లుడు పగ బడతాడు .రాజ మాన్సింగ్ షోలాపూర్ జయిస్తాడు .మాన్సింగ్ను రాణాప్రత్జాప్ అవమానిస్తాడు . తగిన గుణ పాఠం చెప్పాలని అక్బర్ అనుకుంటాడు .మాన్ సింగ్ ను సర్వ సైన్యా ధ్యక్షుడిగా నియమించి రణ ప్రతాప్ మీదకు యుద్దానికి పంపుతాడు అక్బర్ .రాజా రాం తన కొడుకు శాలివాహన్ తో యూద్దనికి వస్తాడు .రాజా జగన్నాథ్ వెన్నుపోటుతో దాందాస్ మరణిస్తాడు రాణాప్రతాప్ రామ్ప్రసాద్ అనే ఏనుగు ను మొఘులుల మీదకు పంపిస్తాడు. దాన్ని వాళ్ళు స్వాధీనం చేసుకుంటారు . ప్రతాప్ మాన్సిన్హ తో తల పడతాడు . మొఘులుల సైన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతాప్ కు గాయాలవుతాయి.ఝులా ప్రతాప్ సుర్యద్వాజం తీసుకుని పారిపోతాడు .ప్రతాప్ పరిపోతున్నాడని అతని వెంటపడి అతన్ని హతమారుస్తారు మొఘులులు.గాయపడ్డ ప్రతాప్ ణి అతన్ని గుర్రం చేతక్ దూరంగా రహస్య ప్రదేశానికి తీసుకు వెళుతుంది

**ఇక చదవండి**

ఏకలింగేశ్వరాలయము నినాదాలతో మారుమ్రోగింది. కొద్దిరోజుల్లోనే ప్రతాపుని అనుచరులందరూ కుటుంబాలతో వచ్చి చేరారు.

మహారాణా ప్రతాప్ ఆర్ద్రనేత్రాలతో తన మాతృభూమివైపు ఒక్కసారి చూశాడు. వంగి భూమిని ముద్దుపెట్టుకున్నాడు. మట్టిని తీసి తలపై చల్లుకున్నాడు. రవంత ధూళిని నుదుట బొట్టుపెట్టుకున్నాడు. గద్గదస్వరంతో చేతులు జోడించి పలికాదు.

"నా మాతృదేశమా! ఈ జన్మలో నీ ఋణం తీర్చుకోలేని అసమర్థుణ్ణి మన్నించు తల్లీ! మేవాడమాతా! రెండు దశాబ్దాలుగా నేను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి! నీ పాదము లానగా నేను చేసిన బాసలు చెల్లించుకోలేకపోయాను. చిత్తోడ్ను తిరిగి స్వాధీనం చేసుకోలేకపోయాను! నా రక్తమాంసాలు అక్బర్ను విదిరించే ప్రయత్నంలో ఆహుతి అయిపోయాయి. భౌతికసుఖాలను వీడి, అహరహమూ అడవులలో, కొండలలో భార్యనూ, పిల్లలనూ దాచిపెడుతూ నేను పడిన కష్టాలన్నీ నిష్ఫలమయ్యాయి. నేను కన్న కలలన్నీ గాలిమేడలై కూలిపోయాయి. వీరమాతా! ఈ పిరికిపంద నిన్ను శత్రువుల కప్పగించి పారిపోతున్నాడమ్మా! పారిపోతున్నాడు! నాకంటే దీక్షాదక్షుడైన వీరకుమారు డెవరో ఉద్భవించి, నిన్ను ఉద్ధరించాలని ఆ ఏకలింగేశ్వరుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నాను తల్లీ!"

మహారాణా ప్రతాపుని దీనవచనాలకు రసపుత్రవీరులు గోలుగోలున ఏడ్చారు. అందరూ నేలతల్లికి నమస్కరించి ప్రయాణం ప్రారంభించారు. రాణి పాటేశ్వరీదేవి పుట్టెడు దుఃఖంతో

పిల్లలను వెంటబెట్టుకొని భర్తను అనుసరించింది.

కొండలు గుట్టలు... వాగులు వంకలు... అన్నీ దాటి మేవాడ్ సరిహద్దులను దుఃఖభారంతో వీడలేక వీడలేక విడిచిపోతున్నారు.

ఆ దశలో – ఒక వయోవృద్ధుడెదురయ్యాడు. ముడతలుపడిన ఒడలు, నెరసిన వెంట్రుకలు, వంగిన నడుము, పసుపు పచ్చని దేహచ్ఛాయ, ఆదరాభిమానాలు నిండిన చూపులు!

"రాణా ప్రతాపుడెక్కడ? మా నాయన ప్రతాపుడెక్కడ?" ఆత్మీయత తొణికిసలాడే గొంతుతో కనబడిన వారినందర్నీ అడుగుతున్నాడు.

ప్రతాపుడు ఆ వృద్ధుణ్ణి చూశాడు. "ఎవరు తండ్రీ... మీరు?"

"మా మహారాణా ప్రతాపుడు కావాలి బాబూ!"

"నేనే ప్రతాప నామధేయుడిని! మీరెవరు?"

"ఆ నీవేనా నా ప్రతాపుడివి!" అంటూ ఆ వృద్ధుడు రాణాను ఒళ్ళంతా పుణికి, 5 బుగ్గలు నిమిరి తలను స్పృశించి చుంబించాడు. "ఎవరు మీరు?" రాణా ఆశ్చర్యంతో మరల ప్రశ్నించాడు. "నా పేరు భామాషాహి అంటారు!"

"అవును! మీ తాతల దగ్గర మంత్రిత్వం నెరపిన వారి వంశస్థుడను!" మిమ్ములను గూర్చి విని వున్నాను! మీరు పర్షియాకు పోయి గొప్ప వ్యాపారులుగా ఖ్యాతిగాంచి ఉన్నారు! మీరు మా పితృదేవులతో సమానులు! ఈ పేద ప్రతాపుని నమస్కృతులు స్వీకరించండి!"

ప్రతాపుని వినయశీలతకు భామాషాహి హృదయం పులకించింది. కాని, అతడి దీనస్థితికి భామాషాహీ మనసు కరిగిపోయింది.

"తండ్రీ! మీ సంరక్షణలో మా పితృదేవతలు పాలించిన భూమిని రక్షించలేక, మాతృదేశాన్ని



వీడిపోతున్న దశలో ఈ దీనుడి దగ్గరకు వచ్చారా?"

"ఎక్కడకు పోతున్నావు నాయనా?"

"ఉన్నదంతా పోగొట్టుకొని, అనుచరులతో కూడి, పంజాబు కవతల స్వతంత్ర రాజ్యం స్థాపించుకొని, ఏనాటికైనా నా మాతృభూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలనే ఆశతో వెడలిపోతున్నాను!"

భామాషాహీ ఒక్క నిమిషం ప్రతాపుణ్ణి ఆపాదమస్తకం చూచి "నాయనా! కొంచెం మంచినీరు ఈ వృద్ధుడికి ఇవ్వగలవా?" అని అడిగాడు.

"భామాషాహీ! నీరైతే ఇవ్వగలను!! కానీ... దయచేసి ఆహారం అడగవద్దు. ఈ నిర్భాగ్యుడు అతిథిదేవుళ్ళకు ఒక్క కబళం అన్నంకూడా పెట్టలేని దీనస్థితిలో ఉన్నాడు!" అంటూ తన అశ్వంపై ఉన్న తోలుసంచిలోని నీటిని ఒక మృణ్మయపాత్రలో పోసి అందించాడు.

భామాషాహీ అత్యంత అనురాగంతో ఆ నీటిని అందుకొని కడుపునిండా త్రాగి, ఉబికి ప్రవహించే కన్నీటిని తుడుచుకున్నాడు.

"ప్రతాప్! మీ ఉప్పు తిని బ్రతికినవారు మా పూర్వులు. వంశపారంపర్యంగా మేము మీ మంత్రులం! కష్టసుఖాలలో మీతో భాగంపంచుకునే అధికారం మాకు వున్నది. ఇప్పుడు నీవిచ్చిన నీరే నాకు పంచభక్ష్య పరమాన్నాలు! నాయనా! మీకు సంబంధించిన వస్తువొకటి నా దగ్గర ఉన్నది. దాన్ని

తిరిగి మీకివ్వడానికే నేనింత దూరం వచ్చాను!"

"ఒక్క చిన్న వస్తువివ్వడానికి మీరు వందలమైళ్ళు ఎడారులగుండా పయనించి నా దగ్గరకు వచ్చారా తండ్రీ! ఆహా! మీకు మాపై ఎంత వాత్సల్యం! ఎవరిచేతనైనా పంపిస్తే సరిపోయేది గదా!"

"ఒకరిచేత పంపేది కాదు ప్రతాప్!" "నాకు తెలిసినంతవరకు మాకు సంబంధించినదేదీ మీ దగ్గర లేదే...?"

"మీరు విస్మరించివుంటారు!" "సరే మాకు సంబంధించినదైతే తప్పక స్వీకరిస్తాను!" అని ప్రతాపుడు వినమ్రుడై అన్నాడు. భామాషాహీ చప్పట్లు కొట్టగానే ఆయన అనుచరులిరువురు వచ్చి నమస్కరించి నిలిచారు. "మన ప్రయాణం ముగిసింది! మీరు వెళ్ళి, ఆ గుట్టల అవతల విడిసివున్న మన మందీ మార్బలాన్నీ, శకటాలనూ వెంటనే ఇక్కడకు తీసికొనిరండి!" అని అజ్ఞాపించాడు.

ఒక్క ఘడియలోనే ఒక నూరు బండ్లు వరుసగా వచ్చి అక్కడకు చేరాయి. ప్రతాపుడు ఆశ్చర్యంతో వాటిని పరికించాడు. భామాషాహీ ప్రతాప్ భుజంమీద చేయివేశాడు.

"ప్రతాప్! ఈ సమస్త సంపద ఇక నీది! మహారాణాలు ఇచ్చిన పెట్టుబడితో చేసిన వ్యాపారం మాది. అసలు, లాభాలతో తిరిగి వారికే సమర్పిస్తున్నాను. మాతృదేశ ఋణాన్ని ఇప్పుడు ఈ విధంగా తీర్చుకోగలగటం నేను పూర్వజన్మలో చేసిన సుకృతఫలం!"

"కానీ... భామాషాహీజీ!"

"ప్రతాప్! నాకు అన్నీ తెలుసు. మారు మాట్లాడక ధనకనక వస్తు వాహనాలను స్వీకరించు! పర్షియాలో నేను నిన్ను గూర్చి విన్నాను! నీ వీరచరిత్ర నన్ను ఉత్తేజితుణ్ణి చించింది. చూడు! మాతృదేశం కష్టదశలో ఉన్నప్పుడు వినియోగపడని ధనం ఎందుకు?

విదేశీ దురాక్రమణదారుల నెదిరించి పోరాడే నీవంటి వీరునికి ఉపకరించని ఈ ధనం ప్రయోజనం ఏమిటి? అందుకే నేను సంపాదించిన సొమ్మును నీకిద్దామని వచ్చాను! ఈ బండ్లనిండా ధనమే ఉన్నది. వీటి రక్షణకు రెండువందలమంది యోధులను తుపాకులతో సహా వెంటబెట్టుకొని వచ్చాను. దారిలో మాల్వాపైన దాడిచేసి, దానిని వశపరచుకున్నాను. ఆ దాడిలో లభించిన సొమ్ము ఈ నాలుగు బండ్లనిండా వేసి తెచ్చాను. అందులో నాలుగువేల అష్రఫీల సొమ్ము ఉన్నది. ఇదంతా నీవు స్వీకరించు! ఈ మొత్తం సొమ్ముతో నీవు పన్నెండు సంవత్సరాలపాటు ఇరవైరెండువేలమంది సైన్యాన్ని పోషించవచ్చును!"

"లేనిపోని శంకలతో నన్ను బాధింపక, ఈ సొమ్ము స్వీకరించి నన్ను కృతార్థుడిని గావించు! ప్రతాప్ ఈ ధనంతో తిరిగి సైన్యాన్నీ, వారికి తగిన ఆయుధాలనూ సిద్ధం చేయి! ఈ వృద్ధుని ప్రార్థన మన్నించు! నీ దగ్గరున్న మంచినీరు నాకు ఇచ్చావ్! నా దగ్గరున్న ఈ సొమ్మును నీకు ఇస్తున్నాను! నా ఇష్టదైవానికి నేను సమర్పించే చిరుకానుక."

ప్రతాపుడు తన అనుచరులవైపు చూశాడు. "తీసుకోండి ప్రభూ!" అంటున్నాయి వారి కన్నులు. ప్రతాపుని పటాలం వెనుదిరిగింది!

మేవాడు మాత ఆనందబాష్పాలతో తన ప్రియపుత్రుణ్ణి అక్కున చేర్చుకున్నది.

(ఇంకా ఉంది )

# ఓ స్త్రీ, ఓ అక్షరం, ఓ మానవత్వం

మళ్ళ కారుణ్య కుమార్

రెక్కలు తెగిన ఓ స్వప్నమా, కర్కశ చూపులకు, ఉన్మాద చేతలకు
ఛిద్రమైన ఓ జీవమా ఏమిటి ఈ వింత ప్రదర్శనలని హేళనగా
అంతరంగం వికటాట్టహాసం చేస్తుంది. కరిగిపోతున్న కొవ్వొత్తుల
వెలుగులో న్యాయం కావాలంటూ ఏక కంఠంతో ఆమె కోసం
కంఠాలెన్నో ఎలుగెత్తుతున్నాయి కానీ ఎంత వరకు
ఆ కొవ్వొత్తి కరిగిపోయే వరకే కదా, నాకు న్యాయం జరిగే వరకు
ఈ పోరాటం సాగుతుందా,మరో అన్యాయం జరగకుండా
నిరోధిస్తుందా అని వేదన చెందుతుంది.

నిర్వేదన తో కూడిన నిశబ్ధ గీతమేదో ఆలపిస్తున్న ఆ నిశి
తెరల్ని తొలుచుకుంటూ ప్రకాశిస్తున్న మిణుగుర్ల వెలుగు
అడుగంటిన ఆమె విశ్వాసానికి ఊపిరి పోస్తూ, నీకు నువ్వే
స్ఫూర్తివై అన్యాయాన్ని ఎదురించు అని సత్యాన్ని బోధిస్తూ, ప్రేరణ
కలిగిస్తుంది.

నేనేంటో తెలుసుకో, అప్పుడు నీలో వున్న జ్ఞానం విరాజిల్లుతుందని
ఆ అక్షరం జ్ఞాన బోధ చేస్తుంది! ఎక్కడ తన ఉనికి వ్యాపార కూపంలో
చిక్కి శూన్యమైపోతుందో అని! ఎక్కడ భావి దేశపు భవిత చిక్కుల్లో
పడుతుందో అని! ర్యాంకుల మోజులో పడి నిజం గ్రహించని చిన్నారికి
తన విలువ తెలియజేయాలని పరితపిస్తుంది.

పారిపో ఓ మంచితనమా రక్కసి ఛాయల్ని పులుముకున్న
మానవత్వం విడిచేసిన మనుసుల్నుండి! చేరుకో ఓ మంచితనమా
నిజాయితీ నమ్ముకున్న ఓ మనసున్న మనిషిని అని తనకు
తానే హితబోధ చేసుకుంటుంది ఆ మంచితనం ఎక్కడ
ఈ లోకం తనకు సమాధి కడుతుందో అని!
తనని బ్రతికించమని ప్రతి మనిషిని వేడుకుంటుంది.

## అమ్మాయిలకు ఒకరోజు

అమ్మాయిలు చదువుకోవడం,
విదేశాలకు వెళ్లి పై చదు వులు చదవడం, మగవారికి మాత్రమే సాధ్యమయ్యే ఉద్యో గాలు తాము చేయడం చూస్తూనే ఉన్నాం. చరిత్రలో మొద టిసారి అమెరికాలో అధ్యక్షపదవికి ఒక మహిళ పోటీ పడటం వరకూ ఈ మహిళా చైతన్యం సాగింది. అయినప్ప టికీ మహిళల పట్ల వివక్ష, కుటుంబాలలో మగ పిల్లాడికి దక్కే ప్రాధాన్యం, చదివించే విషయంలో అబ్బాయిలకు మంచి కోర్సు అమ్మాయిలకు అప్రధానమైన కోర్సు దేశంలో సాగుతూనే ఉన్నాయి. ఇలాంటి మైండ్సెట్ని మార్చడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 'శక్తి మిషన్' అనే కార్యక్రమం నిర్వ హిస్తోంది. మహిళల స్వావలంబనే కాదు... అమ్మాయిల ఆత్మవిశ్వాసం పెంచడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఇందులో మరో ముఖ్యమైన కార్యక్రమం 'అమ్మాయిలకు ఒకరోజు 'అధికారం'.

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మొన్నటి అక్టోబర్ 12న దాదాపు పది జిల్లాలలో ఈ కార్యక్రమం: కింద ఇంటర్ లోపు చదువుతున్న అమ్మాయిలకు జిల్లా కలెక్టర్, ఎస్.పి.గా, సి.డి.ఓ. (చీఫ్ డెవలప్మెంట్ ఆఫీ సర్) పూర్తి అధికారాలు ఇచ్చారు. సర్వోన్నత ఉద్యోగాల్లో ఉంటే పేదవారికి, బలహీనులకు ఎలా న్యాయం చేయ వచ్చో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు తెలియచేయ డమే కాదు... వారు అధికారంలో ఉంటే మిగిలిన సిబ్బంది ఎలా వ్యవహరిస్తారో నిజంగా చేసి చూపించారు.



లక్ష్మీపూర్ భేరి జిల్లాకు ఎనిమిదవ తరగతి చదువుతున్న అగరిమ ధావన్ ఒకరోజు కలెక్టర్ అయ్యింది. ఆమె ఆ రోజు తన దగ్గరకు వచ్చిన ప్రజల సమస్యలు వింది. అందులో భాగంగా కూరగాయల రేట్లు పెరగడం వల్ల ఇబ్బంది పడుతున్నామన్న ఫిర్యాదు వింది. వెంటనే కింది స్థాయి అధికారులను పిలిచి 'కూరగాయల రేట్లు ఇలా ఉంటే ఎలా? వీటిని క్రమబద్ధీకరించరా? అని ప్రశ్నించి. వాటి అదుపునకు చర్యలు తీసుకోమంది. వెంటనే అందుకు తగిన చర్యలు మొదలయ్యాయి. జౌన్పూర్ జిల్లాకు ఇంటర్ చదువుతున్న సాజల్ గుప్తా కలెక్టర్ అయ్యింది. ప్రజాదర్బార్ లో 87 ఫిర్యాదులు ఆమె వద్దకు వచ్చాయి. వాటిలో 14 ఫిర్యాదులను అక్కడికక్కడే ఆమె పరిష్కరించింది తన అధికా రాలతో, ఇక మహరాజ్ గంజ్కు కలెక్టర్ అయిన నిధి యాదవ్ అనే అమ్మాయి ఆ ప్రాంత వాసులకు రావాల్సిన (హైవే నిర్మాణం వల్ల) నష్టపరిహారాన్ని అప్పటికప్పుడు మంజూరయ్యేలా చేసింది. అదే జిల్లాకు ఎస్.పి.గా అధికా రాలు స్వీకరించిన గోల్డీ అనే అమ్మాయి తన పరిధిలోని స్టేష న్లలో అడవాళ్లు ఇబ్బంది పడుతున్న కేసులను మొదటగా ఇన్వెస్టిగేట్ చేసి పరిష్కరించాలని గట్టి ఆదేశాలు ఇచ్చింది. మిర్జాపూర్, ఘాజీపూర్, షామ్లి, శ్రావస్త, బాందా తదితర జిల్లాలలో కూడా ఆ జిల్లాల్లో చురుగ్గా చదువుతున్న అమ్మా యిలను ఎంపిక చేసి కలెక్టర్, ఎస్.పి. బాధ్యతలు అప్పజెప్తే వారు ఒక రోజంతా అద్భుతంగా బాధ్యతలు నిర్వహించ డమే కాదు... విజిట్ల కు కూడా వెళ్లారు.

ఒక రోజు ఆఫీసర్ఎ న్.శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఒకే ఒక్కడు' సినిమాలో అర్జున్ ఒక్క రోజు కోసం సి.ఎం. అయినా అతని నిర్ణయాలన్నీ అమలవు తాయి. ఇక్కడ కూడా ఈ అమ్మాయిలు తీసుకున్న నిర్ణయాలు అమలయ్యాయి. అమలు అయ్యేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో కొన్ని జిల్లాల్లో తాసిల్దార్లుగా కూడా అమ్మాయిలను నియమించారు ఒకరోజు కోసం. కలెక్టర్గా నియమితమైన అమ్మాయి, తాసిల్దార్లుగా నియమితమైన అమ్మాయిలు కలిసి మాట్లాడు కుని ఆ రోజున తమ టేబుళ్ల మీద ఉన్న సమ స్యలను చకచకా పరిష్కరించడం అందరినీ ఆక ర్షించింది. ఎస్.పి.గా చేసిన అమ్మాయిలు కొందరు ఎఫ్ఐఆర్ మీద కూడా సంతకాలు చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమ్మాయిలందరూ ప్రజల సమస్యలు విన్నారు. తాము బాగా చదువు కున్న ఆ సమస్యలను పరిష్కరించే అధికార స్థానంలో వెళ్లవచ్చని గ్రహించారు. 'మేము బాగా చదువుకుం టాం' అని ఆత్మవిశ్వాసంతో చెప్పారు. ఈ సందర్భంగా వీరందరూ కాన్వాయ్ లో ఆఫీసులకు చేరుకున్నారు. వీరందరూ భవిష్యత్తులో ఇంతకుమించిన బాధ్యతా యుత స్థానాల్లోకి వెళ్లాలని కోరుకుందాం.

★★★